ప్రజాపక్షం
7th ANNIVERSARY
22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


**టూరిస్టు బస్సుపై విరిగిపడిన కొండచరియలు**

18 మంది ప్రయాణికులు మృతి

శిథిలాల కింద మరికొంత మంది

హిమాచల్ ప్రదేశ్ బిలాస్‌పూర్ జిల్లాలో ఘటన

05


సంపుటి 28, సంచిక: 108 | బుధవారం | 08-10-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00





## డిజిటల్ టెక్నాలజీ పురోగతికి కృషి

ముగ్గురు అమెరికన్లకు భౌతికశాస్త్రంలో నోబెల్

**స్టాక్‌హోం:** అసాధ్యమైన క్వాంటమ్ టన్నెలింగ్‌పై పరిశోధనలు చేసి డిజిటల్ టెక్నాలజీని మరింత ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేసినందుకు భౌతికశాస్త్రంలో ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలకు ఉమ్మడిగా నోబెల్ బహుమతి లభించింది. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్.డెవోరెట్, జాన్ ఎం.మార్టినిస్‌లకు ఈ ప్రపంచ అత్యున్నత గౌరవం లభించింది. ఈనాడు సెల్‌ఫోన్లు పనిచేయడానికి ఆయన కనుగొన్న అంశాలే కారణం. కొత్త తరం క్వాంటం తరువాయి 2లో

# అడుగడుగునా జాగ్రత్త

హైకోర్టులో బిసి రిజర్వేషన్‌పై విచారణ నేపథ్యంలో ముఖ్యనేతలతో సిఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం

హైకోర్టులో వాదనలు వినిపించాల్సిందిగా ఫోన్‌లో అభిషేక్ సింఘ్వీని కోరిన ముఖ్యమంత్రి



ప్రజాపక్షం/హైదరాబాద్

వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బిసిలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై అడుగడుగునా జాగ్రత్తలు చేపడుతున్న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు, హైకోర్టులోనూ కేసు గెలిచేందుకు తన సర్వశక్తులు ఒడ్డుతోంది. బిసి రిజర్వేషన్ల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గంట గంటకు పరిస్థితిని అంచనా వేస్తూ ముందుకు వెళుతుంది. ఈ క్రమంలో బుధవారం హైకోర్టులో బిసి రిజర్వేషన్ కేసు విచారణ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, చేపట్టాల్సిన చర్యలు తదితర అనుబంధ అంశాలను చర్చించేందుకు ఏకైక ఎజెండాతో మంగళవారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొననున్నారు. ఈనెల 8న హైకోర్టులో తరువాయి 2లో

## అందరి చూపు హైకోర్టు వైపు

**స్థానిక రిజర్వేషన్లపై నేడు విచారణ**

అందరి చూపు ఆవైపే ఏ నలుగురు కలిసిన అదే చర్చ. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఏ తీర్పు ఇవ్వబోతుంది, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రస్తుత రిజర్వేషన్‌ను కొనసాగించేందుకు అనుమతి ఇస్తుందా అన్న దానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో విడుదల చేసింది. ఆ జీవో ప్రకారం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రిజర్వేషన్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఈ నెల తొమ్మిదిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం తరువాయి 2లో

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి కోటా పిటిషన్‌లో సిపిఐ ఇంప్లీడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన కేసులో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో తమను ప్రతివాదిగా చేర్చాలని కోరుతూ సిపిఐ తరుపున తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం నాడు ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు వర్తించే జిఒ 9ను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు పెంచడాన్ని సమర్థిస్తూ, దానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని, ఆ కేసులో తమను కూడా ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ సిపిఐ ఇంప్లీడ్ పిటిషన్ వేసింది. ఇప్పటికే విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు సహా స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించే బిల్లులకు శాసనసభలో సిపిఐ సంపూర్ణంగా మద్దతు పలికింది.



## నల్లగొండలో విద్యార్థిని దారుణ హత్య

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్

నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో విద్యార్థిని దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారెడ్డి గూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని (17) ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే నల్లగొండ మండలం గుట్టకింది అన్నారం గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ అనే యువకుడితో కొంత కాలంగా ప్రేమ తరువాయి 2లో



## స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్, సిపిఐ చర్చలు

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సిపిఐ నేతల భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్‌తో సిపిఐ నేతల ప్రతినిధి బృందం మంగళవారం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంఎల్‌ఏ క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కల్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి. నరసింహ, కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇరు పార్టీల మధ్య జెడ్‌పిటిసి, ఎంపిటిసి, పంచాయతీ ఎన్నికల్లో అవగాహనపై చర్చ జరిగింది. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ,సిపిఐ మధ్య అవగాహనతో పోటీ చేశాయని అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కలిసి పోటీ చేయాలని సమావేశం అభిప్రాయపడింది.

## ఆ 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలు ఇవ్వండి

ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ :** బిహార్ ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తు తర్వాత రూపొందించిన తుది ఓటర్ల జాబితా నుండి మినహాయించబడిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల సంఘాన్ని కోరింది. ఆగస్టులో ముసాయిదా జాబితాలో ప్రచురించబడిన తర్వాత తుది జాబితాలో చేర్చబడిన వారిలో ఎక్కువ మంది కొత్త ఓటర్లేనని, మినహాయించబడిన ఏ ఓటరు కూడా దీనిపై ఫిర్యాదు లేదా అప్పీల్ దాఖలు చేయలేదని ఎన్నికల సంఘం అత్యున్నత న్యాయస్థానానికి వివరించింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ పార్టీలు ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఐ (ఎం) సహా కొంత మంది పిటిషనర్లు తుది ఓటర్ల జాబితా నుండి ఓటర్లకు ఎన్నికల సంఘం (ఇసి) ఎలాంటి నోటీస్ జారీచేయకుండా, తరువాయి 2లో

గాజాలో ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న

# జాతి హననాన్ని నిలిపేయాలి

- పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు డిమాండ్
- వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, మైనారిటీ సంఘాలు సంఘీభావ ప్రదర్శన
- ధర్నా చౌక్ వద్ద ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు




ప్రజాపక్షం /హైదరాబాద్

గాజాలో ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న జాతి హననాన్ని తక్షణమే నిలిపివేయాలని పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. అనైతిక యుద్ధంతో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమెన్ నెతన్యాహూ, అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ గడిచిన రెండేళ్ల కాలంలో 65 వేల మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులను నిరసిస్తూ పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో వామ పక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, పలు మైనార్టీలు సంఘాలు నాయకులు, కార్యకర్తలు పాలస్తీనా మద్దతుగా మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ దేశాలు, ప్రజలు గాజాపై దాడులు ఆపాలని కోరుతున్నా కనీస యుద్ధ విలువలను పాటించకుండా తమ నరమేధాన్ని సాగిస్తూనే ఉన్నారని వక్తలు విమర్శించారు. ప్రత్యక్షంగా ఇజ్రాయిల్, పరోక్షంగా అమెరికా దేశం గాజా (పాలస్తీనా)ను భస్మీపటలం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రదర్శనను ఉద్దేశించి తరువాయి 2లో



## ఐక్యంగా, బలంగా ముందుకెళదాం

**తేజస్వీ యాదవ్‌తో భేటీలో డి.రాజా**

**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో సీట్ల సర్దుబాటుపై చర్చలు మొదలయ్యాయి. 24 స్థానాల్లో పోటీ చేయాలని సిపిఐ భావిస్తోంది. ఇదే క్రమంలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం బిహార్ రాజధాని పట్నాలో ఆర్‌జెడి నాయకుడు, మహాకూటమి సమన్వయ కమిటీ చైర్మన్ తేజస్వీ యాదవ్‌తో భేటీ అయ్యారు. బిహార్‌లో వామపక్షాలు, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు బలం పెంచుకోవడంపై చర్చించారు. ప్రజలు మెచ్చే రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్నారు. ఐక్యంగా, బలంగా ముందుకెళదామని, ప్రజా ప్రభుత్వాన్ని తెద్దామని డి.రాజా అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే, జాతీయ కార్యదర్శి సంజయ్ కుమార్, జాతీయ సమితి సభ్యుడు అజయ్ కుమార్ సింగ్, ఆర్‌జెడి నాయకులు అబ్దుల్ బారి సిద్దీఖీ, సంజయ్ యాదవ్ (ఎంపి), ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మగ్నీ లాల్ మండల్, జాతీయ ప్రధాన కార్యదర్శి భోలా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులంతా ఓటేసేలా ఇసి హామీనివ్వాలి**

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరగాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆకాంక్షించారు. అర్హులైన ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోగలగాలని, ఇందుకు ఎన్నికల సంఘం హామీ ఇవ్వాలని, అది ఆ సంస్థ రాజ్యాంగబద్ధ కర్తవ్యమని అన్నారు. బిహార్ 24 స్థానాల్లో పోటీ చేయాలని సిపిఐ కోరుకుంటోందని, ఆ మేరకు ఏకాభిప్రాయం కుదురుతుందని తరువాయి 12లో

ఈ నెల 15 లోగా

## సాయుధ పోరాటాన్ని త్యజిస్తాం

పోలీసులు గస్తీని నిలుపుదల చేయండి

మావోయిస్టు మాడ్ కమిటీ లేఖ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మావోయిస్టు సాయుధ పోరాటాన్ని త్యజించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈనెల 15వ తేదీ లోగా ఆయుధాలను దీనికి సంబంధించిన పని పూర్తి చేస్తామని, అప్పటి వరకు ఎలాంటి కూంబింగ్‌లు నిర్వహించకుండా పోలీస్ గస్తీని నిలుపుదల చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మావోయిస్టు మాడ్ కమిటీ కార్యదర్శి రాణిత అలియాస్ సానిత పేరిట మంగళవారం ఓ లేఖ విడుదలైంది. ప్రస్తుతం మావోయిస్టులపై కొనసాగుతున్న తీవ్ర నిర్బంధ తరువాయి 2లో

## గాజా సంక్షోభానికి రెండేళ్లు

67 వేల మంది పాలస్తీనియన్లు మృతి

మరో 1.65 లక్షల మందికి గాయాలు

కైరోలో రెండోరోజు కొనసాగిన చర్చలు




**జెరూసలెం:** మధ్యప్రాచ్యంలో పాలస్తినాపై దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్ దురాక్రమణ కారణంగా పరాకాష్ఠకు చేరిన ప్రత్యక్షహింస, దాడులకు అక్టోబరు ఏడో తేదీతో రెండేళ్ళు పూర్తయ్యాయి. సరిగ్గా ఇదేరోజు (అక్టోబరు 7,2023)న హమాస్ ఉగ్రవాదులు సరిహద్దులను ఛేదించి ఇజ్రాయెల్‌పై దాడిచేశారు. నోవా సంగీతోత్సవంపై దాడిచేశారు. 1200 మందిని హతమార్చి 251 మందిని బందీలుగా తీసుకువెళ్ళడంతో గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. ఈ దాడుల్లో 67 వేలమంది పాలస్తినా ప్రజలు మరణించారు. మరో 1.65 లక్షలమంది గాయపడ్డారు. వికలాంగులయ్యారు. 200 మంది చిన్నారులు ఆకలి చావులకు గురయ్యారు. లక్షల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు వ్యతిరేకించినాగానీ, అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టు వారెంటు జారీ చేసినాగానీ నెతన్యాహూ తన దారుణ ప్రతీకార తరువాయి 2లో

## టూరిజంలో అవకతవకలు

టిజిటిడిసి నిధులు గోల్‌మాల్

రూ.1.05 కోట్లు కాజేసిన వైనం

ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన సిసిఎస్ పోలీసులు

సూత్రధారి తాత్కాలిక ఉద్యోగి

ఇద్దరు ఎజిఎంల సస్పెన్షన్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)లో భారీగా అవకతవకలు జరిగాయి. సంస్థలో పనిచేస్తున్నవారే నిధులను పక్కదారి పట్టించారు. ఇందులో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న జూనియర్ అకౌంటెంట్ ప్రధాన పాత్ర వహించారు. ప్రభుత్వ ఖాతాలో ఉన్న నిధులను సంస్థతో ఎలాంటి సంబంధంలేని ప్రైయివేటు వ్యక్తుల ఖాతాలోకి మళ్లించారు. ఇలా రెండున్నరేళ్ల నుంచి ఈ భాగోతం కొనసాగింది. అయినా అధికారులు గుర్తించలేక పోయారు. ఇప్పటి వరకు టిజిటిడిసికి చెందిన రూ.1.05 కోట్లు పక్కదారి పట్టించారని అధికారుల విచారణలో తేలింది. ఈ మేరకు




టిజిటిడిసి డిజిఎం టి.సమాదానమ్ హైదరాబాద్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిసిఎస్ పోలీసులు జూనియర్ అకౌంటెంట్ కె.శృతితో పాటు ఆమె భాయ్‌ఫ్రెండ్స్ పాకనటి హరికృష్ణ, బాలగాని శ్రావణ్‌కుమార్, సింతల రాహుల్, గడ్డం ప్రీతిక, ఎం.శ్రావణ్‌కుమార్, పి.మల్లిక, మేటకడప భాగ్యవతిలపై బిఎన్ఎస్ యాక్ట్ 316(5), 318(4), 336(3),340(2) రెండ్ విత్ 3(5) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. సిసిఎస్ ఎకనామిక్ ఆఫెన్స్ వింగ్ ఎస్ఐ మంద్రా శిరీష దర్యాప్తు చేస్తున్నారు.

**నిధులు మళ్లిన విధానం ఇలా..**

హిమాయత్‌నగర్‌లోని టిజిటిడిసిలో కె.శృతి ఐదేళ్ల నుంచి జూనియర్ అకౌంట్‌టెంట్ తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తుంది. టిజిటిడిసి నిధులు బ్యాంకు ఖాతా నెంబర్ 62281683607లో ఉంటాయి. టిజిటిడిసి తమ ఉద్యోగులకు, ఇతర కాంట్రాక్టర్లకు ఈ ఖాతా నుంచే నిధులను విడుదల చేస్తుంది.నిధులు ఎవరెవరికి ఏఏ అకౌంట్‌ల లోకి నిధులు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## తుదియత్నం విఫలమైతే మేక్రాన్‌కే పగ్గాలు!

**పారిస్:** ఫ్రాన్స్ ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్ను పదవికి రాజీనామా చేసిన 24 గంటల తర్వాత కూడా ఆ దేశంలో రాజకీయ సంక్షోభం మరింత ముదిరుతోందే తప్ప ఉపశమనం కలగడం లేదు. లెకార్నుకు దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ తుది అవకాశం ఇచ్చారు. బుధవారం లెకార్ను అన్ని వర్గాలతోనూ సమావేశం జరిపి చివరి ప్రయత్నాలు చేస్తారు. ఈ ప్రయత్నాలు కూడా విఫలమైతే ఇక మేక్రానే స్వయంగా ప్రధానమంత్రి పాలనా బాధ్యతలను కూడా చేపడతారు. బుధవారంనాడు లెకార్ను వీడ్కోలు విందు ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానించి తుది ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు వామపక్షాలు కూడా ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో తమ పట్టు బిగించేందుకు ముమ్మర ప్రయత్నారలు చేస్తున్నాయి. దేశంలో వామపక్షాల భాగస్వామ్యం లేకుండా పరిపాలన అసాధ్యం అని సర్వత్రా వామపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ఇదిలా ఉండగా, లెకార్ను ప్రభుత్వ పతనంపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌ను అభిశంసించడమే పరిష్కారమార్గంగా 51 శాతంమంది అభిప్రాయపడ్డారు.



## వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న భారత్‌-అమెరికా చర్చలు

**దోహా:** భారత్‌-అమెరికా ప్రతినిధుల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని భారత వాణిజ్య, పరిశ్రమలశాఖా మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. బహుశా వీలైతే ఈ ఏడాది నవంబరునెల గడువుతే దీలోపే రెండు దేశాల మధ్యా సంభాషణలు ముగుస్తాయని అన్నారు. ఖతార్ రాజధాని దోహాకు ఒకరోజు అధికారిక పర్యటనకు వచ్చిన పీయూష్ గోయల్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, వాణిజ్య ఒప్పందంపై వివిధ స్థాయిల్లో చర్చలు స్థిరంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ చర్చలు ఏ విధంగా మరింత ముందుకు తీసుకువెళ్ళాలనే విషయంపై త్వరలోనే తాము ఒక స్పష్టత ఇస్తామని కూడా చెప్పారు. నవంబరు గడువుతేదీలోపు చర్చలు ముగించాలని రెండు దేశాల ప్రతినిధులు గట్టి పట్టుదలతో ఉన్నాయని చెప్పారు. గతనెలలో గోయల్ సారథ్యంలో ప్రతినిధులబృందం చర్చల నిమిత్తం న్యూయార్క్‌కు వెళ్ళింది. ఈ సమావేశం తర్వాత రెండు దేశాలూ చర్చలు కొనసాగించాలని నిర్ణయించాయి. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం 'షట్‌డౌన్ పరిస్థితి'ని ఎదుర్కొంటున్నదని అందువల్ల ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తదుపరి ఎప్పుడు, ఎక్కడ చర్చలు జరపాలన్న విషయాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుండి అమెరికా ప్రభుత్వంలో కేవలం అత్యవసర విభాగాలు మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన శాఖలకు సంబంధించిన ఉద్యోగులు లక్షలమంది వేతనాలు లేకుండా సెలవుల్లో ఇళ్ళలోనే కూర్చుని ఉన్నారు. అమెరికా కాంగ్రెస్‌లో రెండు కీలకమైన ఆర్థిక బిల్లులను ఆమోదించే విషయంలో అధికార-ప్రతిపక్ష రిపబ్లికన్, డెమోక్రటిక్‌పార్టీల చట్టసభ సభ్యులు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ ఉండిపోవడంతో బిల్లులు మాత్రం ఆమోదం పొందడం లేదు. తాజాగా ఐదోసారి అమెరికా కాంగ్రెస్ బిల్లులను ఆమోదించడంలో విఫలం కావడంతో ఏడు రోజులుగా ఆ దేశంలో ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతోంది.

## సొంత ప్రజలపైనే బాంబులువేసి చంపుతోంది

### భద్రతామండలిలో పాకిస్థాన్‌పై భారత్ విమర్శ

**న్యూయార్క్:** పాకిస్థాన్ ప్రభుత్వం తన సొంత ప్రజలపైనే బాంబులవర్షం కురిపించి హతమారుస్తోందని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో భారతదేశం నిశిత విమర్శలు చేసింది. 'మహిళలు, శాంతి, భద్రత' అనే అంశంపై బహిరంగ చర్చ సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ప్రసంగించారు. భారత్‌పై పాకిస్థాన్ ప్రతినిధి తొలుత తీవ్ర ఆరోపణలు చేయడంతో హరీశ్ తన ప్రసంగంలో ఆ దేశ బండారాన్ని బయటపెట్టారు. 1971లో పాకిస్థాన్ ఆపరేషన్ సెర్చ్‌లైట్‌ను నిర్వహించి ఒక పద్ధతి ప్రకారం తన దేశంలో ఉన్న 4,00,000 మంది మహిళలపై అత్యాచారాలు చేసి హత్య చేసిందని, ఇందుకోసం తన సొంత సైన్యాన్నే ఉపయోగించుకుందని హరీశ్ విమర్శించారు. జమ్మూ కశ్మీరు భారత భూభాగంగా గుర్తించడానికి తిరస్కరిస్తున్న పాకిస్థాన్ ప్రతి సంవత్సరం ఎడతెగని దాడులు చేయిస్తోందని, ఇది అత్యంత దురదృష్టకరమైనదని విమర్శించారు.

"తన సొంత ప్రజలపైనే బాంబులు వేసి చంపుతున్న ఒకదేశం ఒక పద్ధతిప్రకారం సామూహిక హత్యాకాండకు పాల్పడుతోంది, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ప్రపంచాన్ని తప్పు తోవ పట్టించే ప్రయత్నంచేస్తోంది" అని విమర్శించారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను యావత్ ప్రపంచం చూస్తూనే ఉందని అన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌గా పిలుస్తున్న ఒకనాటి తూర్పు పాకిస్థాన్‌పై 1971 మార్చి 25న పాకిస్థాన్ సైన్యం అత్యంత కిరాతకంగా పౌరులను హత్యచేయడం ప్రారంభించిందని, ఆపరేషన్ సెర్చ్‌లైట్ పేరుతో దారుణాలకు పాల్పడిందన్నారు. రష్యా ప్రతినిధి అధ్యక్షతన ఈ భద్రతా మండలి సమావేశం జరిగింది. పాకిస్థాన్ తన ప్రకటనలో జమ్మూ కశ్మీరు గురించి ప్రస్తావించడాన్ని భారత ప్రతినిధి తీవ్రంగా పరిగణించి స్పందించారు. జమ్మూ కశ్మీరులో మహిళలు దశాబ్దాలుగా లైంగిక దోపిడీకి గురవుతున్నారంటూ పాకిస్థాన్ ప్రతినిధి చేసిన ఆరోపణలపై హరీశ్ స్పందిస్తూ, పాకిస్థాన్ సైన్యం చేసిన ఘోర కృత్యాలను ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు. మహిళలు, శాంతి, భద్రత విషయంలో భారత దేశం ఎంతమాత్రం వెనక్కు తగ్గకుండా కట్టుబడి ఉందన్నారు. ఈ విషయంలో తన అనుభవాలను అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకుని ఎదురవుతున్న సవాళ్ళకు ఉమ్మడి పరిష్కారాలు సాధించేందుకు భారతదేశం సిద్ధంగా ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి శాంతిదళాలలో భారతదేశం తనవంతు పాత్ర నిర్వహించడం ప్రపంచశాంతిపట్ల భారత్‌కు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని గుర్తుచేశారు.




1960వ దశకంలో భారతీదేశం కాంగోలో మహిళా వైద్యాధికారులను నియమించిందని, ఐక్యరాజ్యసమితి శాంతి దళాలలలో తమదేశ మహిళలు సేవలు అందించారని గుర్తు చేశారు. మహిళల నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు వారి సమానత్వ కోసం పాటుపడేందుకు ఇవి కేవలం చిన్న చిన్న ఉదాహరణలు మాత్రమేనన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి వచ్చిన మహిళా శాంతి దళాల అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చిన విషయాన్ని కూడా హరీశ్ గుర్తుచేశారు. ఈ సదస్సులో 35 దేశాలకు చెందిన శాంతిదళాల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు.




## బలూచిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ పేల్చివేత

**షికార్‌పూర్:** పాకిస్థాన్ సింధ్ రాష్ట్రం షికార్‌పూర్ జిల్లాలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మరోసారి పేల్చివేశారు. మంగళవారం ఉదయం 'సుల్తాన్‌కోట్ గ్రామ సమీపంలో జరిగిన ఈ ఘటనలో నాలుగు బోగీలు పట్టాలు తప్పాయి. ఎవరూ మరణించలేదు. కనీసం ఏడుగురుపైగా ప్రయాణికులు గాయపడ్డారు. పేలుడు సమయంలో రైలులో 270 మంది ప్రయాణిస్తున్నారు. దీంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై ఇప్పటివరకూ బలూచిస్థాన్ వేర్పాటువాదులు ఏడుసార్లు దాడులకు పాల్పడనట్లయింది. ఐఇడి పేలుడు పదార్థాలు ఉంచి రిమోట్ కంట్రోల్ ద్వారా రైలును పేల్చివేశారు. ఈ దాడిలో రైలు పట్టాలు, బోగీలు ధ్వంసమయ్యాయి. ఈ మార్గంలో రైళ్ళ రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను బస్సులలో వారి వారి గమ్యస్థానాలకు తరలించారు. ధ్వంసమైన రైల్వే ట్రాకును బాగుచేసే చర్యలు చేపట్టామని, ఈ పనులు పూర్తి కావడానికి పది గంటలు సమయం పడుతుందని డివిజనల్ రైల్వే అధికారి ఒకరు చెప్పారు. సింధ్ రాష్ట్ర హోంమంత్రి జియా లాంజర్ తక్షణం పూర్తి వివరాలు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. ఈ చర్యకు తామే బాధ్యులమని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ సంస్థ ప్రకటించుకుంది. బలోచ్ స్వాతంత్రం కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేసింది. గడచిన ఐదు సంవత్సరాలుగా బలూచిస్థాన్ స్వాతంత్ర్యంకోసం ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చింది.

## 53 మంది ఐరాస సిబ్బందిని చెరబట్టిన హౌతీలు

**వాషింగ్టన్:** యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులు తాజాగా మరో తొమ్మిదిమంది ఐక్యరాజ్యసమితి సిబ్బందిని బందీలుగా చేయడాన్ని సంస్థ అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజార్రిక్ తీవ్రంగా ఖండించారు. గడచిన ఆగస్టునెలలో కూడా 18 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బందిని యెమెన్‌లోని సనాలో బందీలుగా తీసుకువెళ్ళడమే కాకుండా ఐక్యరాజ్యసమితి ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆనాడు ఇజ్రాయెల్ దాడుల్లో హౌతీల ప్రధాన మంత్రి హతుడయ్యారు. ఆ వెనువెంటనే హౌతీలు సమితి సిబ్బందిని బందీలను చేశారు. ఇలాంటి చర్యలకు స్వస్తిచెప్పాలన్నారు. 2021 నుండీ ఇప్పటివరకూ హౌతీలు 53 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బందిని తమ బందీలుగా చేసుకున్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ఈ చర్యలను ఇప్పటికే ఖండించారు. యెమెన్‌లో ఉన్న సంస్థ ఆస్తులను, కార్యాలయాలు, భవంతులను హౌతీ ఉగ్రవాదులు అక్రమంగా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. తాజాగా ఎప్పుడు మళ్ళీ ఐక్యరాజ్యసమితి సిబ్బందిని బందీలుగా తీసుకువెళ్ళారన్న విషయాన్ని దుజెర్రిక్ వివరంగా చెప్పలేదు. ఐతే హౌతీలు మాత్రం ఐక్యరాజ్యసమితి వివక్షతో వ్యవహరిస్తోందని, ఇజ్రాయెల్ దాడులను ఖండించలేదని విమర్శిస్తున్నారు. యెమెన్‌లో ఇటు హౌతీల పరిపాలన, మరోవైపు సౌదీల మద్దతుతో ఈడెన్‌లో ప్రభుత్వం కొనసాగుతున్నాయి. 2014 నుండి యెమెన్‌లో అస్థిరత కొనసాగుతోంది.

## అందరి చూపు హైకోర్టు వైపే (మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచుల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి మించిందని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషన్‌ను స్వీకరించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈనెల ఎనిమిదికి తీర్పును వాయిదా వేయడంతో పాటు కీలక వ్యాఖ్యలు చేసింది. షెడ్యూల్ విడుదల చేసినా, నోటిఫికేషన్ ఇచ్చినా తుది తీర్పుకు లోబడి ఉండాలని వ్యాఖ్యానించింది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఉత్కంఠ నెలకొంది. సర్పంచుల పదవి కాలం 2024 జనవరి 30న ముగియగా, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవి కాలం ముగిసి ఏడాది గడిచిపోయింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. పాలకు వర్గాలు లేక స్థానిక సంస్థల పరిస్థితి దయనీయంగా మారింది. కనీస అభివృద్ధి పనులు చేపట్టే పరిస్థితి లేదు. ఎట్టకేలకు ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ముందుకొచ్చి షెడ్యూల్ విడుదల చేసిన వేళ రిజర్వేషన్ చిక్కుముడిగా మారి హైకోర్టు తీర్పు కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థిస్తే నవంబర్‌లో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం ఈనెల తొమ్మిదిన నోటిఫికేషన్ విడుదల కానుండగా అదే రోజు నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మొదటి దశ అక్టోబర్ 23న ఎంపిటిసి, జెడ్పిటిసిలకు ఎన్నికలు జరగనుండగా రెండవ దశ అక్టోబర్ 27న ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు నవంబర్ 11న జరగనుంది. సర్పంచ్ ఎన్నికలు మూడు దశల్లో జరగనుండగా తొలి దశకు ఈనెల 17న, రెండవ దశకు 21న మూడవ దశకు 25న నోటిఫికేషన్ విడుదల కానుంది. సర్పంచ్ ఎన్నికలు అక్టోబర్ 31, నవంబర్ నాలుగు, నవంబర్ ఎనిమిది తేదీలలో మూడు దశలలో జరగనుండగా ఎన్నికల లెక్కింపు పోలింగ్ ముగిసిన వెంటనే జరగనుంది.

స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రస్తుత జీవో ప్రకారం ఎన్నికలకు న్యాయస్థానం అనుమతిస్తే పైన పేర్కొన్న ప్రకారం ఎన్నికలు జరుగుతాయి. లేదంటే న్యాయస్థానం తీర్పుకు లోబడి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఎన్నికల భవితవ్యం ఆధారపడి ఉంది. రిజర్వేషన్ సానుకూలంగా ఉన్న అభ్యర్థులు రంగంలోకి దిగేందుకు జంకుతున్నారు. న్యాయస్థానం తీర్పు తర్వాత సానుకూలమైతే ఎన్నికల సందడి మొదలవుతుంది. లేదంటే మరో నిర్ణయం కోసం ఎదురు చూడాల్సిందే.

## దారుణ హత్య (మొదటి పేజీ తరువాయి)

వ్యవహారం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం డైట్ కళాశాల సమీపంలోని ఓ గదిలోకి కృష్ణ, ఆ విద్యార్థిని వెళ్లారు. ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తడంతో విద్యార్థినిని కృష్ణ దారుణంగా హతమార్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. హత్యకు ముందు అత్యాచారం చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, టూటౌన్ ఎస్ఐ సైదులు, ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. నిందితుడు గడ్డం కృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అడుగడుగునా జాగ్రత్త (మొదటి పేజీ తరువాయి)

బిసి రిజర్వేషన్లపై కేసు విచారణ సందర్భంగా స్వయంగా హాజరు కావలసిందిగా న్యాయ కోవిదుడు అభిషేక్ సింగ్విని ఫోన్‌లో సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం కోరారు. కాగా సోమవారం సుప్రీంకోర్టులో బిసి రిజర్వేషన్ల కేసు విచారణ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కూడిన బృందం ముందు రోజే ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులు, ఉన్నతాధికారులతో చర్చించింది. బిసి రిజర్వేషన్ల కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సోమవారం సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయ కోవిదుడు అభిషేక్ సింగ్వి, సిద్ధార్థ దవేలు హాజరు కాగా, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి వాదనలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు బుధవారం హైకోర్టులో కేసు విచారణ నేపథ్యంలో స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని సోమవారం ఢిల్లీలో సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింగ్వి ని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మంత్రుల బృందం ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.

## అవకతవకలు (మొదటి పేజీ తరువాయి)

జమ చేయాలో టిజిటిడిసి ఫైనాన్స్ విభాగం నుంచి ఒక లీస్టు శృతి వద్దకు వస్తుంది. ఈ లీస్టును శృతి బ్యాంక్ అధికారులకు ఈ మెయిల్ చేస్తుంది. ఈ లీస్టులో ఉన్న వ్యక్తుల ఖాతాలకు బ్యాంక్ అధికారులు టిజిటిడిసి ఖాతా నుంచి మళ్లిస్తుంది. ఇక్కడే శృతి తన వద్దకు వచ్చిన లీస్టును గోల్‌మాల్ చేస్తుంది. ఆ లీస్టులో తనకు తెలిసిన ఏడుమంది భాయ్‌ఫ్రెండ్ పేర్లను చేర్చేది. ఆ తరువాత ఆ లీస్టును బ్యాంక్ అధికారులు పంపేది.

లిస్టులో ఉన్న వ్యక్తుల ఖాతాలోకి బ్యాంక్ అధికారులు టిజిటిడిసి ఖాతాలోంచి నిధులను మళ్లించేవారు. ఇలా శృతి తన ఏడు మంది భాయ్‌ఫ్రెండ్‌ల ఖాతాలోకి టిజిటిడిసి నిధులు జమ అయిన తరువాత వాళ్లు ఆ నిధులను తిరిగి శృతికి చెందిన నాలుగు బ్యాంక్ ఖాతాలోకి మళ్లించేవారు. ఇలా వచ్చిన నిధులను శృతి తన సొంతానికి వాడుకుంది. అయితే టిజిటిడిసి ఎవరెవరికి ఎంత డబ్బులు చెల్లించారు అనే విషయంపై ఇటీవల ఎండిగా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతి ఆరా తీయగా రూ.రూ. 1,05,82,572 నిధులు తమకు సంబంధంలేని వ్యక్తులకు వెళ్లాయని తేలింది.దీనిపై ఆరా తీయగా నిందితులు పకనాటి హరి కృష్ణ యాక్సిస్ 922010028149275 4లోకి రూ.76,572 , బాలగాని శ్రావణ్ కుమార్ ఎస్‌బిఐ ఖాతా 35346507100లోకి రూ. 1,85,600, చింతల రాహుల్ ఎస్‌బిఐ 39116652539 ఖాతాలోకి రూ.81,91,200, గడ్డం ప్రీతిక డిబిఎస్ బ్యాంక్ ఖాతా 881037658427లోకి రూ. 3,85,600, ఎం. శ్రావణ్ కుమార్‌కు చెందిన ఎస్‌బిఐ 39692419322 3 ఖాతాలోకి రూ.86,000, పి. మల్లికా ఎస్‌బిఐ 34338491833 3 ఖాతాలోకి రూ.86,000, మెటకద్ప భాగ్యవతికి చెందిన ఎస్‌బిఐ 62283490986 ఖాతాలోకి రూ.3,86,000 డబ్బులు టిడిటిడిసి ఖాతాలోంచి వచ్చి పడ్డాయి. శృతి ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించి, తారుమారు చేసిందని విచారణలో తేలింది.

ఇద్దరు అధికారుల సస్పెండ్: ఎండి వల్లూరు క్రాంతి టిజిటిడిసి నిధులు రెండున్నర సంవత్సరాల నుంచి పక్కదారి పడుతున్నా సంబంధిత ఫైనాన్స్ అధికారులు పర్యవేక్షించలేదు. అసలత్వం ప్రదర్శించిన ఫైనాన్స్ విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌లు రాజేష్, మహేష్‌లను సస్పెండ్ చేసినట్లు టిజిటిడిసి ఎండి వల్లూరు క్రాంతి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

## పురోగతికి కృషి (మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ అభివృద్ధికి ఆయన పరిశోధనలు బాటలు పరిచాయి. నోబెల్ కమిటీ 2025లో 119వ సారి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించింది. గత ఏడాది కృత్రిమ మేధలో అగ్రశ్రేణి శాస్త్రవేత్త జాన్ హోప్‌ఫీల్డ్, జియోఫ్రీ హింటన్‌లకు నోబెల్ లభించింది. ఇంగ్లాండ్ కేంబ్రిడ్జ్‌లో జన్మించిన జాన్ క్లార్క్ (83) బర్కిలే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో భౌతికశాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేస్తూ పరిశోధనా విద్యార్థులు డెవోరెట్, మార్టినిస్‌లతో కలిసి ఒక బృందంగా ఏర్పడి సూపర్ కండక్టర్స్‌లో క్వాంటమ్ టన్నెలింగ్‌పై 45 ఏళ్ళక్రితం పరిశోధనలు ప్రారంభించారు. దీంట్లో చాలా ప్రతికూల పరిస్థితుల్లో కణాలు తరంగాల రూపం దాలుస్తాయి. అసాధ్యం అనుకున్న ప్రామాణికతలను అందుకోలేకపోయినాగానీ అవరోధాలను అధిగమించి కణాలు తరంగాల రూపంలో అనేకవైపుల నుండి ఉద్భవించి ముందుకు చొచ్చుకుపోతాయి. డిజిటల్ టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌లో అవగాహన చేసుకోవాల్సిన కీలకాంశం ఇదే. శాంతా బార్బారాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ లో శాస్త్రవేత్త మార్టినిస్, యాలేలో శాస్త్రవేత్త డెవోరెట్‌లు రీసెర్చ్ విద్యార్థులుగా ఉంటూ క్లార్క్‌తో కలిసి పరిశోధనలు చేశారు. తనకు నోబెల్ బహుమతి రావడంపై జాన్ క్లార్క్ పాత్రికేయుల ప్రశ్నలకు ఫోన్ ద్వారా స్పందిస్తూ, "ఇది నా జీవితంలో చాలా దిగ్భ్రాంతి కలిగించే విషయం" అన్నారు. తనతోపాటు ఈ పరిశోధనలలో కృషి చేసినవారికి కూడా ఈ ఘనత దక్కుతుందని చెప్పారు. "మా పరిశోధనా ఫలితం క్వాంటం కంప్యూటింగ్ ఆధారంగా జరిగిందన్నారు. "మనం చూడని ఎత్తులకు సైన్స్ ను ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు ముందుకు తీసుకువెళ్ళారని "ఫిజిక్స్ టు డే" ఎడిటర్ ఇన్ చీఫ్ రిచర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ చెప్పారు. చాలా సున్నితమైన కొలమానాలకు క్వాంటం సెన్సర్స్‌ను ఉపయోగిస్తారు. ఉదాహరణకు అయస్కాంతక్షేత్రంలో దీని ఉపయోగం ఎక్కువ. సమాచారాన్ని ఎన్‌కోడ్ చేసే క్రిప్టోగ్రఫీకి ఎంతగానో ప్రయోజనం ఉందన్నారు.

## జాతి హననాన్ని నిలిపేయాలి (మొదటి పేజీ తరువాయి)

సిపిఐ జాతీయ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ ఇజ్రాయెల్ పాలస్తీనా ప్రజలపై అనైతిక దాడులకు తెగపడుతూ 65 వేలమందిని అమానుషంగా చంపివేసిందని, ఇందులో 50 శాతం మంది చిన్నారులు, మహిళలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ సైన్యాలు ఒకవైపు బాంబుల వర్షం కురిపిస్తూ మరోవైపు గాజాలో ప్రజలకు ఎలాంటి సహాయం అందకుండా అడ్డుకుంటూ వారిని ఆకలి చావులకు గురి చేస్తోందన్నారు. అగ్ర రాజ్యాలు ఖనిజాల సంపద, ముడి చమురు కోసం చేస్తున్న ఆధిపత్య దుర్మార్గాలను ప్రజలంతా ముక్త కంఠంతో ఖండించాలని ఆయన కోరారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ యావత్ ప్రపంచం, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి యుద్ధాన్ని నిరసిస్తూ తక్షణమే నిలిపివేయాలని కోరుతున్నా ఇజ్రాయిల్, అమెరికా ఏ మాత్రం పట్టించుకోకుండా దాడులు కొనసాగించడం గర్హనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎఐటియుసి అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, కార్యదర్శి బి.వెంకటేశం, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ప్రధాన కర్యాదర్శి జి.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి అనూష, ప్రసన్న, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామరాజు, జె.కె.శ్రీనివాస్, మేడ్చల్‌జిల్లా నాయకులు ఇ.ఉమామహేష్, డి.జె.ప్రసాద్, ఎస్ఎన్. మూర్తి, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు డి.జి. నరసింహారావు, టి.సాగర్, విరసం నేత వరవరరావు, వామపక్ష పార్టీల నేతలు హమ్మేష్, గోవర్ధన్, చలపతిరావుతో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంఘీభావ ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు

పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో వామపక్ష నాయకులు, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఆశోక్‌నగర్ నాలా నుంచి ధర్నా చౌక్ వరకు భారీప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ ధర్నా చౌక్ చేరుకోగానే అనుమతులు లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. వందల సంఖ్యలో మోహరించిన పోలీసులు నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకునేందుకు యత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అప్పటికే భారీగా చేరుకున్న పోలీసులు పలువురు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలను అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సిపిఐ జాతీయ సీనియర్ నాయకులు అజీజ్ పాషా, సిపిఐహైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, కార్యదర్శి డి.జి.నరేంద్ర ప్రసాద్, ఎవైఐఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు ఎండి.అబ్బాస్, టి.సాగర్‌తో విద్యార్థి, యువజన సంఘాలతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులను కార్యకర్తలు ఉన్నారు.

## సంక్షోభానికి రెండేళ్లు (మొదటి పేజీ తరువాయి)

మారణకాండ ఆపలేదు. చివరకు నెతన్యాహూ ప్రపంచదేశాలమధ్య ఏకాకిగా మిగిలిపోయే పరిస్థితి వచ్చిన తరుణంలో ట్రంప్ గాజాలో యుద్ధం ముగించేందుకు 20 అంశాల ప్రణాళిక ప్రతిపాదించారు. ఈ ఒప్పందంపై ఇష్టంగానో,అయిష్టంగానో ఇజ్రాయెల్‌-హమాస్ అంగీకారం తెలియజేసిన తర్వాత బందీలు-ఖైదీల విడుదల ప్రక్రియను ఖరారు చేసేందుకు ఈజిప్టు,ఖతార్ మధ్యవర్తిత్వంతో కైరోలో ఇజ్రాయెల్‌-హమాస్ ప్రతినిధుల మధ్య పరోక్ష చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ చర్చలు మంగళవారంనాటికి రెండోరోజుకు చేరుకున్నాయి. 251 బందీల్లో పోయినవారు పోగా కొందరు గత మార్చినెలలో విడుదలయ్యారు. ఇంకా 48 మంది బందీలు హమాస్ వద్ద ఉన్నారు. వీరిలో కేవలం 20 మాత్రమే సజీవులుగా ఉన్నారు. వీరితోపాటు 28 మృతదేహాలను కూడా స్వాధీనం చేయాలని హమాస్‌ను ఇజ్రాయెల్ కోరుతోంది. కైరోలో చర్చలకు ఒక డెడ్‌లైన్ విధించారా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్టీ సమాధానం తప్పించుకున్నారు. ఈ పరోక్ష చర్చల్లో హమాస్ తరఫున అగ్రశ్రేణి నాయకుడు ఖలీల్ హయ్యా, అమెరికా తరఫున స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ తదితర ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ ప్రణాళికలో మొదటిదశను అమలు చేసేందుకు అనేక అంశాలపై అంగీకారం కుదిరింది. ట్రంప్ ప్రణాళికకు భారత్,చైనా సహా ప్రపంచవ్యాప్తంగా అనేకమంది నాయకులు తమ మద్దతు తెలియజేశారు. ఐతే హమాస్ ఆయుధాలను త్యజించడం, గాజాలో భవిష్యత్ పరిపాలన వంటి అనేక అంశాలపై ఇప్పటికీ అనిశ్చితి నెలకుని ఉంది. స్వతంత్ర పాలస్తీనా ఆవిర్భావానికి అంగీకరించబోమని ఇప్పటికీ నెతన్యాహూ చెబుతున్నారు. హమాస్ కూడా ట్రంప్ ప్రణాళికలో అనేక అంశాలను వ్యతిరేకించింది. వాటిపై తదుపరి చర్చలు జరగాలని కోరుతున్నది. హమాస్ ఆయుధాలు వదిలిపెడితే ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరించుకుంటుందనేది ఈ ప్రణాళికలో ఒక కీలక అంశం. ఆయుధాలను వదిలిపెట్టే విషయంపై హమాస్ స్పందించలేదు. ట్రంప్,టోనీ బ్లెయిర్ సారథ్యంలో గాజాలో కొత్త ప్రభుత్వం నడుస్తుందన్నది ట్రంప్ ప్రణాళిక ప్రతిపాదన. కాగా ప్రతికూల ఆలోచనలు చేయవద్దని, హమాస్ ఆయుధాలు వదిలిపెట్టాక విజయాన్ని ఆస్వాదించాలని నెతన్యాహూను తాను మందలించినట్లు వచ్చిన వార్తలను ట్రంప్ ఖండించారు. లేదు, లేదు, అవన్నీ అబద్ధాలు, ఈ ప్రణాళికపట్ల నెతన్యాహూ మొదటినుండీ చాలా సానుకూల దృక్పథంలో ఉన్నారని చెప్పారు. మరోవైపు ప్రపంచవ్యాప్తం గా పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ప్రజలు వేలు,లక్షల సంఖ్యలో ప్రదర్శనలు చేస్తున్నారు. బ్రిటన్‌లో ప్రధానమంత్రి కీర్‌స్టార్‌మర్ ఆదేశాలను కూడా ధిక్కరించి వేలాదిమంది లండన్‌లో విద్యార్థులు వీధుల్లోకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. విశ్వవిద్యాలయాలలో "విద్యార్థుల నిరసనలు బ్రిటీష్ వ్యతిరేకం" అని ప్రధానమంత్రి స్టార్‌మర్ విమర్శించారు. మరణించిన అమరులకు విద్యార్థులు నివాళులు అర్పించారు. పాలస్తీనియన్లకు సంఘీభావంగా లివర్‌పూల్‌లో 'బేక్ సేల్' కార్యక్రమం నిర్వహించారు.

ఇంకోవైపు ఇజ్రాయెల్‌లో కూడా వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి హమాస్ దాడుల్లో మరణించిన తమ ఆత్మీయులు,బంధువు లకు, స్నేహితులకు నివాళులు అర్పించారు. ప్రధానమంత్రి నెతన్యాహూ ఇప్పటివరకూ చేసిన తప్పిదాలకు వివరణ ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉత్తర గాజా నుండి ఇజ్రాయెల్‌లోకి రాకెట్ ప్రయోగం జరిగింది. ఈ దాడిలో ఎవరూ గాయపడలేదు.

## సిజెఐపై దాడి పిరికిపంద చర్య: సోరెన్

**రాంచీ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ఘటనను పిరికిపంద చర్యగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అభివర్ణించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్య ఆత్మపై దాడిగా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ గౌరవం, స్వాతంత్ర్యం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా మూలస్థంభం. దానిపై చేయి ఎత్తడం అంటే దేశ రాజ్యాంగంపై చేయి ఎత్తడంతో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు.

## పోరాటాన్ని త్యజిస్తాం (మొదటి పేజీ తరువాయి)

కార్యకాలాపాల నేపథ్యంలో మావోయిస్టు పార్టీ మాడ్ కమిటీ ఈలేఖను విడుదల చేయడం పట్ల తీవ్ర చర్చ సాగుతోంది. శాంతిచర్చల కోసం మే నెల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి, మా బ్యూరో ఇంచార్జ్ నేతృత్వంలో జరిపిన ప్రయత్నాలకు తాము పూర్తి మద్దతు ఇచ్చామని, పోరాటాన్ని త్యజించడానికి అంగీకరించామని పేర్కొన్నారు. కామ్రేడ్ సోను కార్యకర్తలకు చేసిన విజ్ఞప్తులను, ప్రజలకు చేసిన విజ్ఞప్తులను మేము చదివామని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విప్లవాత్మక ఉద్యమంలో అవసరమైన మార్పులు చేయడంలో సిసి విఫలమైందన్నారు. ఉద్యమం క్రమంగా బలహీన పడిందని, ప్రజలు మద్దతు కూడా తగ్గిందని, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని అందిపుచ్చుకోవడం విఫలమైనట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లో సాయుధ పోరాటాని విడిచి అన్ని స్నేహపూర్వక సంస్థలతో కలిసి ప్రజలలో పనిచేసేందుకు నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. మా నిర్ణయాన్ని డివిజన్‌లోని పార్టీకి, పీపుల్స్ కన్‌స్ట్రక్షన్ కార్మికులకు వివరించాల్సి ఉందని, ఈ సాయుధ పోరాటాన్ని సాధ్యమైనంత తక్కువ కాలంలో త్యజించడానికి సిద్ధంగా ఉన్నామని, మాడ్ ప్రాంతంలో చట్ట విరుద్ధమైన ఎటువంటి కార్యకలాపాలు జరగవని ప్రకటిస్తూనే, పోలీసు గస్తీని ఈ నెల 15వరకు ఆపాలాని, సాయుధ పోరాటాన్ని నిలుపుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ లేఖలో రాణిత అలియాస్ సనిత పేర్కొన్నారు.

## వివరాలు ఇవ్వండి (మొదటి పేజీ తరువాయి)

కారణాలు తెలియజేయలేదని చెప్పిన తర్వాతే న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలను జారీచేసింది. ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ నిర్వహించాలని ఎన్నికల సంఘం జూన్ 24న తీసుకున్న నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్ల బ్యాచ్‌ను విచారించిన ధర్మాసనం ఓటర్లను మినహాయించిన ఏ సమాచారాన్ని అయినా గురువారం (అక్టోబరు 9)నాటికి ఎన్నికల సంఘానికి సమర్పిస్తుందని, ఆ సమయంలోనే ఈ పిటిషన్లపై తదుపరి విచారణ జరుగుతుందని పేర్కొంది. అత్యున్నత న్యాయస్థానం దీనిపై మాట్లాడుతూ అందరి దగ్గర ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ ఉన్నదని, సెప్టెంబరు 30న తుది జాబితా కూడా ప్రచురించబడిందని, అవసరమైన వాటిని తులనాత్మకమైన విశ్లేషణ ద్వారా అందించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాలవల్ల ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా జరిగేందుకు వీలు ఏర్పడిందని ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ రాకేష్ ద్వివేదికి జస్టిస్ బాగ్చీ వెల్లడించారు. ప్రారంభంలోనే, ఆర్‌జెడి తరపున వాదించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఎన్నికల సంఘం అవసరమైన నియమాలను పాటించలేదని, ఓటర్ల జాబితాను శుభ్రపరచడానికి బదులుగా సమస్య జఠిలం అయ్యిందని వాదించారు. ముసాయిదా జాబితా ప్రచురించబడిన తర్వాత దాఖలు చేసిన అభ్యంతరాలను తొలగించిన 3.66లక్షల ఓటర్ల జబాబితాను ఎన్నికల సంఘం ఇవ్వలేదని ప్రశాంత్‌భూషణ్ ధర్మాసనానికి సమర్పించారు. బిహార్‌కు చెందిన యాక్టివిస్ట్ తరపున న్యాయవాది వృందా గ్రోవర్ హాజరయ్యారు. బిహార్ ఎన్నికల ప్రధానాధికారి వెబ్‌సైట్ కేవలం విభజించబడిన డేటాను మాత్రమే ఇస్తోందని వాదించారు. 243మంది శాసనసభ్యులు ఉన్న బిహార్ అసెంబ్లీకి నవంబరు 6న తొలివిడత 121 సీట్లకు ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించనుంది. మిగతా 122సీట్లకు నవంబర్ 11న పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబరు 14న ఓట్ల లెక్కింపు జరుపనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి దురదృష్టకరం: వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఖండించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని సంరక్షించేందుకు ప్రధాన రాజకీయ పక్షాలు పాటు పడాలని, కానీ దేశంలో అలాంటి పరిస్థితులు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నేతలు విద్వేషపూరిత భావాలు వ్యక్తపరుస్తూ, ప్రజలను రెచ్చగొడుతున్నారని, అందుకే ఇలాంటి దాడి చేసే ఆలోచనలు వస్తున్నాయని, తమ వెనుక నాయకులు ఉన్నారనే ధీమా ఉండటమే ఈ దాడి జరిగేందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# డిజిటల్ వ్యవసాయంలో అగ్రగామిగా తెలంగాణ

### జర్మనీ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలన్నదే సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తమ సంకల్పమని వివరించారు. సాగులో నూతన ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. కృత్రిమ మేధ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటి) లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌ను రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం సచివాలయంలో జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' ప్రతినిధుల బృందంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంది. రాష్ట్ర జనాభాలో సుమారు 55 శాతం మందికి జీవనోపాధి కల్పిస్తోంది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు తన చేయూతను అందిస్తోంది. మరో వైపు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ కు రాష్ట్రం గ్లోబల్ హబ్ గా మారింది. ఇలాంటి తరుణంలో డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను ఆదర్శంగా నిలపాలని సంకల్పించాం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'రోజురోజుకూ వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. పైగా... సాగులో పురుగు మందుల వినియోగం పెరిగి పర్యావరణానికి ఎంతో హానీ జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పెట్టుబడి వ్యయం, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలంటే కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను వ్యవసాయానికి అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగానే మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది' అని వివరించారు. 'అత్యాధునిక సెన్సార్ల ద్వారా నేల స్వభావాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించొచ్చు. ఫలితంగా రసాయనాల కొనుగోలు ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుంది. రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. సుస్థిరమైన, క్లైమేట్‌రెసిలియెంట్ వ్యవసాయ పద్ధతులకు మార్గం సుగమం అవుతుంది' అని చెప్పారు. అనంతరం... రాష్ట్రంలో గత రెండేళ్లుగా వేములవాడకు సమీపంలోని మూడు గ్రామాల్లో 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' ఆధ్వర్యంలో అమలవుతున్న 'యాక్సిలరేటింగ్ క్లైమేట్ రెసిలియెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చొరవ చూపాలని సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పోరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, జర్మనీ రాయబార కార్యాలయం(న్యూఢిల్లీ) ఫుడ్ అగ్రికల్చర్ డివిజన్ హెడ్ వోల్కర్ క్లైమా, ఫ్రాన్ హోఫర్ హెచ్ హెచ్ఐ ప్రతినిధులు డా.సెబాస్టియన్ బోస్సే, డా.రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టు దిగ్గజం రాజ్ బహదూర్ గౌర్‌కు నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కమ్యూనిస్టు దిగ్గజం, కార్మిక అగ్రనేత డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్‌కు సిపిఐ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. రాజ్ బహదూర్ గౌర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి సాబీర్ పాషా, రమావత్ అంజయ నాయక్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లివుల్లా ఖాద్రి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

## భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు ఈ నెల 26న రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రైలు 'భవ్య గుజరాత్' ప్యాకేజ్ (9 రాత్రులు 10 రోజులు) ప్యాకెజ్‌తో ఉంది. మధ్యాహ్నం 03:00 గంటలకు రేణిగుంట రైల్వే స్టేషన్ నుండి ఈ రైలు సికింద్రాబాద్‌కు మరుసటిరోజు ఉదయం 08:00 గంటలకు, నిజామాబాద్ ఉదయం 11:30 గంటలకు, నాందేడ్ మధ్యాహ్నం 02:00 గంటలకు, పూర్ణా జంక్షన్ మధ్యాహ్నం 02:50 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ద్వారకా, సోమనాథ్, అహ్మ దాబాద్, ఎకతానగర్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ రైలు ప్యాకేజ్ ధరలు స్లీపర్ కోచ్ రూ.18,400, త్రీటైర్ ఎసి రూ.30,20, టూటైర్ ఎసిరూ.39,900 ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో రోజుకు మూడు భోజనాలు, వసతి, రవాణా సదుపాయం, ప్రతి బోగీలో ఐఆర్‌సిటిసి సిబ్బంది అందుబాటులో ఉంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ : www.irctctourism.com ఫోన్ నంబర్లు: 9701360701, 9281030749, 9281030750, 9281495843పై సంప్రదించాలని ఆయన తెలిపారు.

# ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ప్రకారం కాళేశ్వరం పునరుద్ధరణ

### పెండింగ్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత
### ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్షా సమావేశం..



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారం కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరించనున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత–చెవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుతో పాటు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్ఎల్‌బిసి) టన్నెల్‌ను ఎట్టి పరిస్థితుల్లోను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి తన చాంబర్‌లో మంగళవారం ఉన్నతాధికారులతో విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రథమ ప్రాధాన్యత కింద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో తుమ్మడిహట్టి నిర్మాణం చేపడుతుందన్నారు. ఇందుకు ఇంజనీరింగ్ బృందాలు రెండు ప్రత్యామ్నాయ కాలువ మార్గాలను పరిశీలిస్తున్నాయన్నారు. ఇందులో మైలారం నుండి 71.5 కిలోమీటర్ల గ్రావిటీ కాలువ,14 కిలోమీటర్ల సొరంగం ద్వారా సుందిల్లాకు నీరు తరలించడం, మరో మార్గం ప్రకారం మధ్యలో పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఎల్లంపల్లి ద్వారా నీటిని మళ్లించడం ఈ రెండు ప్రత్యామ్నాయాలో అన్నివిధాలుగా అనుకూలమైన మార్గాన్ని ఎంచుకోనున్నట్లు తెలిపారు. భూగర్భ ఎస్ఎల్‌బిసి టన్నెల్ తెలంగాణ నీటి పారుదల నిర్మాణంలో కీలక భాగమని, దీనిని డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సాంకేతిక, పరిపాలనా అడ్డంకులను తొలగిస్తున్నామని, ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఉన్నత స్థాయి పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జాతీయ సంస్థలు మరియు నిపుణ సంస్థలను పునరుద్ధరణ పనుల్లో పాల్గొనాలని కోరామని చెప్పారు. ప్రముఖ ఐఐటీ ప్రధాన సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించే అవకాశం ఉందని, ఇది తెలంగాణ నీటి పారుదల శాఖకు చెందిన చీఫ్ డిజైన్ ఆర్గనైజేషన్ (సిడిఓ)తో కలిసి పని చేస్తుందని వివరించారు. వర్షాకాలానికి ముందు పరీక్షలు పూర్తచేసి వర్షాకాలం అనంతరం పూర్తి పునరుద్ధరణ పనులను ఏడాదిలో పూర్తి చేయనున్నామని తెలిపారు. పునరుద్ధరణ ప్రక్రియ ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులకు అనుగుణంగా ఉంటుందని, ఏదైనా వ్యత్యాసం లేదా ఆలస్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వారానికి ఒకసారి పురోగతి సమీక్షలు నిర్వహించి సాంకేతిక ఫలితాలను పద్ధతిగా నమోదు చేయాలని ఆదేశించారు. న్యాయ పరమైన అంశాల పరంగా కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ II (కెడబ్ల్యూడీటీ II) ముందు జరుగుతున్న విచారణల పురోగతిని సమీక్షించారు. సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తెలంగాణ వాదనలు ముగించారని, ఆంధ్రప్రదేశ్ తమ సమర్పణలను ప్రారంభించిందని తెలిపారు. ప్రతి సమావేశానికి సంబంధించిన సవివరమైన నివేదికలను సిద్ధం చేయాలని, ఢిల్లీలోని న్యాయ బృందంతో, రాష్ట్ర సుప్రీంకోర్టు న్యాయవాదులతో సమన్వయం చేసుకోవడం ద్వారా వాదనల్లో ఏకరూపత ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమ్మక్క–సారక్క ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యూసి)ను సంప్రదించి నీటి కేటాయింపు మరియు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టిఏసీ) ఆమోదం కోరిందని, ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని అన్నారు. సీతమ్మసాగర్, మొడికుంటవాగు, చనక–కోరటా పంపిణీ వ్యవస్థలు కాళేశ్వరం ప్రాజెక్టుల పెట్టుబడి ఆమోద దరఖాస్తులు కేంద్రానికి సమర్పించామని, వాటి సమీక్ష ప్రధాన్ మంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) పరిధిలో తుది దశకు చేరుకుందని తెలిపారు. దేవదుల ప్రాజెక్టు శాఖ ప్రధాన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఒకటని, ప్యాకేజీతో పాటు అదనపు మూడవ దశ ప్యాకేజీలకు ఆమోదం లభించిందని తెలిపారు. డిండి ప్రాజెక్టుపై సమగ్ర సమీక్షా నివేదిక సిద్ధం చేయాలని, ఇందులో భౌతిక పురోగతి, నిధుల వినియోగం, పెండింగ్ పనులు ఉండాలని ఆదేశించారు. నీటి పారుదల రిజర్వాయర్ల మట్టిని, అవక్షేపాలను తొలగించే ప్రతిపాదనతో అదనపు ప్రభుత్వ వ్యయం లేకుండా రిజర్వాయర్ల సామర్థ్యాన్ని మెరుగుపర్చే స్వయం సమర్థ విధానాన్ని రూపొందించడమే లక్ష్యమని తెలిపారు.

# 'ఇందిరమ్మ ఇండ్ల'పై ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరా

### బెంగుళూరులో ఖర్గేను పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్న ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న 'ఇందిరమ్మ ఇండ్ల పథకం' నిధుల చెల్లింపులు, లబ్ధిదారుల ఎంపిక విధానం, ఒక్కో ఇంటికి యూనిట్ కాస్ట్ తదితర అంశాలను మల్లికార్జున్ ఖర్గే అడిగి తెలుసుకున్నట్టు మంత్రి పొంగులేటి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో గడచిన పది సంవత్సరాలలో పేదలు ఆశించిన మేరకు ఇండ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఇందిరమ్మ ఇండ్లకు డిమాండ్ అధికంగా ఉన్నదని మంత్రి పొంగులేటి వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మొదటి దశలో ఈ ఏడాది రూ. 22,500 కోట్లతో నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 4.50 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, లబ్దిదారుల ఎంపిక పూర్తయిందని, దాదాపు మూడు లక్షలా ఐదు వేల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్దిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, పేదరికమే అర్హతగా ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అడవులను నమ్ముకొని జీవించే చెంచులకు కూడా తొలిసారిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక 'కాల్ సెంటర్'ను ఇటీవల ఏర్పాటు చేశామని , కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపైన 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరు బాగుందని ఇలాగే ముందుకు సాగాలని ఖర్గే అభినందించినట్టు మంత్రి పొంగులేటి తెలిపారు.

**ఖర్గేను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం బెంగళూరులో పరామర్శించారు. ఇటీవల పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని, పూర్తి ఉత్సాహంతో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి ఆయన మార్గదర్శకత్వం అత్యంత అవసరమన్నారు.



## కొత్త సంస్కరణలతో ఉప ఎన్నికలు

### పార్టీల ప్రతినిధులతో ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో, ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం సహా పలు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. రానున్న ఉప ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన నూతన సంస్కరణలతో నిర్వహించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సంస్కరణలు తొలిసారిగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో, అలాగే దేశవ్యాప్తంగా జరగనున్న 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు. సిఈఓ సుదర్శన్‌రెడ్డి ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలతో ఏర్పాట్లను సమీక్షించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు సిఈఓ లోకేశ్ కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఉప సిఈఓలు హరి సింగ్, సత్యవాణి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ముఖ్యంగా తీసుకొచ్చిన చర్యలు ఇవి..**

- ☞ ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు.
- ☞ ఓటర్లు తమ అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు ఈవిఎంలపై రంగు ఫోటోలు ఉంచడం.
- ☞ మహిళా ఓటర్ల పాల్గొనడం పెంచేందుకు మహిళా సిబ్బందిని అదనంగా నియమించడం.
- ☞ వృద్ధులు, దివ్యాంగుల కోసం సౌకర్యాలు, వీల్ చెయిర్లు, ర్యాంపులు, పిక్అప్, డ్రాప్ సదుపాయాలు.
- ☞ రియల్‌టైమ్ ఓటింగ్ టర్నౌట్ మానిటరింగ్ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డులు,మొబైల్ యాప్‌లు.
- ☞ సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో కృత్రిమ మేధస్సు(ఎఐ)ఆధారిత పర్యవేక్షణ, జిపిఎస్ ట్రాకింగ్.
- ☞ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) ఉల్లంఘనలపై కఠిన చర్యలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ.
- ☞ పర్యావరణహిత ఎన్నికలు, పేపర్ వినియోగం తగ్గించడం, డిజిటల్ సమాచార మార్పిడి ప్రోత్సాహం.

# సిజెఐపై దాడి ఆక్షేపణీయం

### హైకోర్ట్ ఎదుట ఐఎఎల్ నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు న్యాయవాది రాకేష్ కిషోర్ బూటును విసిరి దాడికి యత్నించిన ఘటనను నిరసిస్తూ తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్, న్యాయవాద సంఘాలు హైదరాబాద్‌లోని హైకోర్ట్ ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.జగన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ పొన్నం అశోక్, చిక్కుడు ప్రభాకర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రఘునాథ్, ఎస్.జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎఎల్ అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ భారత న్యాయవ్యవస్థ, విశ్వసనీయతను దెబ్బతీయడం, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను విఘాతం కలిగించే పద్ధతులు, న్యాయ మూర్తులపైన మానసిక ఒత్తిడి ద్వారా ప్రయోజనాలు పొంది, అనుకూల తీర్పులు కావాలనుకుని, చేసే విఘాత చర్యలు దేశ సమగ్రతకు నష్టదాయకమని అన్నారు. ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని, రక్షించుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ పార్టీలు, న్యాయవాదులు, సముచిత పాత్రను నిర్వర్తించడం ఒక్కటే మార్గమని ఆయన చెప్పారు. సుప్రీంకోర్టులో జరిగిన ఘటన అత్యంత హేయమైనదని, న్యాయవ్యవస్థను, న్యాయవాదుల సమగ్రతను దెబ్బతీసే విధంగా ఉన్నదని, ఈ ఘటనను న్యాయవాదులంతా ముక్తకంఠంతో ఖండించడం హర్షణీయమని తెలిపారు. ఘటనకు బాధ్యులైన న్యాయవాదిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎ.జగన్ మాట్లాడుతూ సమాజంలో బాధ్యత కలిగిన న్యాయవాదులు న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ దాడి ఘటనను ఖండించారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

# రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం మడమతిప్పని పోరాటం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి రిజర్వేషన్లపై చట్టబద్ధతకు, హక్కుల సాధనకు ఎంతవరకైనా పోరాడుతామని పలువురు వక్తలు తెలిపారు. అన్ని బిసి కుల సంఘాలను కలుపుకొని జెఎసిగా ఏర్పాటై, రాజ్యాధికారమే ధ్యేయంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంకంటే బలమైన బిసి ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లో బిసి ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ''బిసిలకు 42శాతం రిజర్వేషన్లు – న్యాయ వివాదాలు పరిష్కారంపై బిసి సంఘాల సమాలోచన'' కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా బిసి జాతీయ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం ఛైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి ఎస్‌సి, ఎస్‌టి జెఎసి ఛైర్మన్ డా.విశారదన్ మహారాజ్, బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందన్నారు. మండల కమిషన్‌కు వ్యతిరేకంగా కమండల ఉద్యమం నడిపిన నీచ చరిత్ర బిజెపిదని విమర్శించారు. ఏ ఉద్యమం చేయకపోయినా ఆగమేఘాల మీద ఈడబ్ల్యూఎస్ బిల్లును ప్రవేశపెట్టి, నాలుగురోజుల్లో అమలు చేసిన కేంద్రం మెజార్టీ వర్గమైన బిసిలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. సమావేశంలో బిసిపిఎఫ్ అధ్యక్షులు కుమార్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ప్రణీల్ చందర్, సర్పంచ్‌ల సంఘం జెఎసి ఛైర్మన్ యాదయ్య గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **RACHAPALLY RAJU,** S/o. **MOGILI,** HNO: 3-92, V:- BIJIGIRI SHARIF, M:- JAMMIKUNTA, D:- KARIMNAGR, TELANGANA STATE - 505475. HAVE changed my minor son's name from **RACHAPALLY HARSHITH** (old name) to **RACHAPALLY RISHIRAJ VARMA** (new name) For All Purpose

# 'గ్రూప్ –1' నియామకాల్లో 'సుప్రీం' ఆదేశాలు అమలు

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యాయస్థానాలు తుది తీర్పు వచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ అభ్యర్థుల మెయిన్ సమాధాన షీట్లను డిస్పోజ్ చేస్తే, నిరుద్యోగులతో కలిసి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను స్తంభింపచేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గ్రూప్ 1 నియామకాల్లో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేసినప్పటికీ, ఆ ఉద్యోగాలపై ఎలాంటి హక్కులేదని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించిందంటేనే, ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని తప్పులను చేసిందో సుప్రీం కోర్టు ఎత్తిచూపినట్టేనని కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బిఎస్‌పి నాయకులు సురేశ్ గౌడ్, తలారి బాలరాజ్ కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు రంగు నవీన్ ఆచారి, సంపత్ గౌడ్, నరేశ్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం, కాళేశ్వరం**
మహాదేవపూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

Rc.No.108/2025 (e-టెండర్ & సీల్డ్ టెండర్ - కం - బహిరంగ వేలం ప్రకటన) తేది: 07.10.2025

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సదరు దేవస్థానం, యొక్క ఈ దిగువ లైసెన్సు హక్కుల కొరకు తేది: 15.10.2025 బుధవారం సాయంత్రం 3.30 గం.ల నుండి ఈ దేవస్థాన కార్యాలయం వద్ద e-టెండర్ & సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించబడును.

| క్ర.సం. | పాట వివరము | షాపు నెంబర్ | టెండర్ షెడ్యూల్ ధర | కాలపరిమితి | డిపాజిట్ సొమ్ము |
| --- | --- | --- | --- | --- | --- |
| 1. | హోటల్ నడుపుకొనే హక్కు | New Complex Shop No. 5&6 | 500/- | 01.11.2025 నుండి 30.09.2027 | 1,00,000/- |

టెండర్ షరతులు:
**1.** సీల్డ్ టెండరు దరఖాస్తు తీసుకొను చివరి తేది: 14.10.2025 సా. 4.00 గం.ల వరకు. **2.** సీల్డ్ టెండర్ తేది: 15.10.2025 సాయత్రం. 03.00 గం.ల నుండి 03.30 గం.ల వరకు స్వీకరించబడును. అనంతరం సాయంత్రం 3.30 గంటల నుండి బహిరంగ వేలం నిర్వహించబడును. తరువాత సీల్డ్ టెండర్ మరియు e-టెండర్ ఓపెన్ చేయబడును. **3.** సీల్డ్ టెండర్ డిపాజిట్ సొమ్ము EO, SKMSD వారి పేరున తీసిన డి.డి. లేదా తాత్కాలిక నగదు రసీదు జతపరుచ వలెను. **4.** e-టెండర్‌లో https://tender.telangana.gov.in ద్వారా పాల్గొనవచ్చును. **5.** ఇట్టి టెండర్లలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. మిగతా షరతులు టెండర్ షెడ్యూల్ లో పొందుపరచ బడును

DIPR R.O. No. : 8866-PP/CL/ADVT/1/2025-26, Date: 07-10-2025 సం/- కార్యనిర్వహణాధికారి



# జనరల్
STATE & REGIONAL NEWS

## నవంబర్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రత్యేక రైలులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల యాత్ర నవంబర్‌లో ప్రారంభించనున్నామని భారతీయ రైల్వేస్ భారత్ గౌరవ్ ట్రైన్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేశ్ తెలిపారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన యాత్ర వివరాలను వెల్లడించారు. ఈ యాత్రలో తమిళనాడు, కేరళలో ఉన్న ఆలయాలను దర్శించుకోవచ్చన్నారు. మొదటి యాత్ర నవంబర్ 16న, రెండో యాత్ర 26న ప్రారంభం కానున్నదన్నారు. 16న యాత్రలో తిరుకడైయూర్, చిదంబరం, అరుణాచలం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరువనంతపురం, చొట్టనిక్కర, గురువాయూర్‌లను, 26న యాత్రలో పంచద్వారక, మహదేవ్, జ్యోతిర్లింగాలను సందర్శించవచ్చన్నారు. యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి ఉన్న వారు రిజర్వేషన్లకు, వివరాలకు 9355021516ను, www.tourtimes.inl ను సంప్రదించాలని సూచించారు.





### సిజెఐ జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాదిపై

## ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కింద కేసు నమోదు చేయాలి : డిహెచ్‌ఎంసి

ప్రజాపక్షం/హైదరాబాద్ : సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.గవాయ్‌పై దాడికి యత్నించిన సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ కిషోర్‌పై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. సిజెఐ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ డి హెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం హిమాత్ నగర్ వై జంక్షన్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసురత్నం, అనిల్ కుమార్‌లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటు విసిరి దాడికి పాల్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జస్టిస్ గవాయ్ ఎల్లప్పుడూ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా తీర్పులు ఇచ్చారని తెలిపారు. ఈ దాడి కేవలం జస్టిస్ గవాయ్ మాత్రమే కాదని, భారత రాజ్యాంగం, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలపైన జరిగిన దాడి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు బాబు,రాజు, మనమ్మ, లక్ష్మి రాజమ్మ, లలిత,కలమ్మ పాల్గొన్నారు.

### ధాన్యం దిగుబడిలో తెలంగాణ

# సరికొత్త రికార్డ్ సృష్టించబోతోంది

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ధాన్యం దిగుబడిలో తెలంగాణా రాష్ట్రం మరో సరికొత్త రికార్డు సృష్టించబోతుందని పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వానా కాలం సీజన్ లో 148 లక్షల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యం దిగుబడి రానుందని, దేశ చరిత్ర లోనే ఇప్పటి వరకు ఇంతటి దిగుబడి ఏక్కడ నమోదు కాలేదన్నారు.వానాకాలం ధాన్యం కొనుగోలు పై పౌర సరఫరాల కేంద్ర కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ తదితర అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల విస్తరణతో తెలంగాణా రాష్ట్రం సాధించిన వృద్ధి ధాన్యం దిగుబడిలో ప్రస్ఫుటమౌతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 67.57లక్షల ఎకరాలలో జరిగిన వరి సాగులో 40.75 లక్షల ఎకరాలలో సన్నాలు,26.82 లక్షల ఎకరాలలో దొడ్డు వడ్ల సాగు చేశారన్నారు.ఇందులో సన్నాలు 90.46 లక్షల మెట్రిక్ టన్నులు,దొడ్డు రకం 57.84 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం కలిపి 148.30 లక్షల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణా రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఇంత పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి అరుదైన రికార్డుగా ఆయన అభివర్ణించారు.అనేక సవాళ్ళను ఎదుర్కొని అరుదైన రికార్డు నెలకొల్పిన ఘనత తెలంగాణా రైతాంగానికి చెందుతుందన్నారు.

అదే సమయంలో కొనుగోళ్లలోను రాష్ట్రం యావత్ భారతదేశానికి మార్గదర్శనంగా నిలుస్తోందన్నారు.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని చెప్పారు. కనిష్ట మద్దతు ధర కింద కొనుగోలు మొత్తానికి రూ.21,112 కోట్ల ఖర్చు అంచనా కాగా ఇందులో నేరుగా రైతులకు చెల్లింపుల కింద రూ.19,112 కోటు చెల్లించన్నుట్లు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వానాకాలం, యసంగి పంటలకు రైతులకు బోనస్ చెల్లింపులకు గాను రూ.3,159 కోట్లు అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం సబ్సిడీ నిమిత్తం చెల్లించాల్సిన రూ. 6,500 కోట్లు తక్షణమే విడుదల మంత్రి డిమాండ్ చేశారు. దీంతో రైతులకు మద్దతు ధర చెల్లించడంలో జాప్యం కాకుండా ఉండేందుకు దోహదపడుతుందని మంత్రి తెలిపారు.



### బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైకోర్టులో బిసి రిజర్వేషన్లపై విచారణకు సంబంధించి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కీలక సూచనలు చేశారు. పంచుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి అధికారిక నివాసంలో మంగళవారం రాత్రి తెలంగాణ కాంగ్రెస్ బిసి నేతల సమావేశం జరిగింది.తెలంగాణ కాంగ్రెస్ బిసి నేతల సమావేశంలో మంత్రి కొండా సురేఖ సుదీర్ఘంగా తన వ్యూహాన్ని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన దిశానిర్దేశం ప్రకారం నడుచుకోవడంపై బిసి నాయకుల సమావేశంలో తన ఆలోచనలను కొండా సురేఖ పంచుకున్నారు. హైకోర్టులో బుధవారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో వేసిన పిటిషన్ పై వాదనలు ఉండడంతో ప్రభుత్వం నుండి హైకోర్టులో బలమైన వాదనలు వినిపించేలా సమావేశంలో చర్చించారు. సమావేశంలో పాల్గొన్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె కేశవ రావు, ఎంపీలు సురేష్ షెట్కర్, అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వి హనుమంతరావు, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, రాజ్ ఠాకూర్, హైదరాబాద్ గద్వాల విజయలక్ష్మి , కార్పొరేషన్ చైర్మన్లు,ఇతర బీసీ నేతలు పాల్గొన్నారు.



## ఘోష్ నివేదికపై చర్యలు వద్దు

గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ నివేదికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై రెండు వారాల్లోగా కౌంటర్ వేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. మరో రెండు వారాల్లోగా పిటిషనర్లు రిప్లై కౌంటర్లు వేయాలంది. తొలుత గడువు కావాలని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తిని అనుమతిచ్చింది. విచారణ వచ్చే 12కు వాయిదా వేసింది. అప్పటి వరకు జస్టిస్ ఘోష్ నివేదిక ఆధారంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ సిఎస్ ఎస్‌కె.జోషి, అప్పటి సిఎం ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్‌పై ఏవిధమైన చర్యలు తీసుకోరాదని ప్రభుత్వానికి ఆదేశించింది. ఈ మేరకు గతంలోని మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. కమిషన్ సాక్షులుగా తమను పిలిచిందని, అభియోగాలు చేసే ముందు తమకు నోటీసులు ఇవ్వలేదని, ఏకపక్షంగా తమపై అభియోగాలు మోపుతూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందంటూ కెసిఆర్, హరీశ్, ఎస్‌కె.జోషి, స్మితా సబర్వాల్ వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలన్నింటినీ కలిపి ధర్మాసనం విచారించింది, ప్రభుత్వ వినతి మేరకు విచారణ వాయిదా వేసింది.

### భూసేకరణలో రైతులకు నష్టపరిహారంతో పాటు...

## ఉద్యోగం, ఇంటి స్థలం నిర్ణయం హర్షనీయం

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో పరిశ్రమలు, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం చేపట్టే భూసేకరణ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. భూములు ఇచ్చే రైతులకు.. బదులుగా ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే ఆలోచన బాగుందన్నారు. మంగళవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో రైతు కమిషన్ బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తోపాటు సభ్యులు కెవిఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఐటీ,ఇండస్ట్రీస్ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్,టిజిఐఐసిఎండి శశాంక్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లాలో 2005 నుండి హార్డ్ వేర్ పార్క్, ఫ్యాబ్ సిటీ, ఫార్మా సిటీ ల కోసం ప్రభుత్వాలు చేపట్టిన భూసేకరణపై చర్చించారు. చిరకాలంగా పెండింగ్ లో వున్న భూ సేకరణ విషయంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టిందన్నారు. ఐతే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రైతుల అభీష్టం మేరకు ఫార్మా సిటీని రద్దు చేయడమే కాకుండా , రైతాంగానికి అన్యాయం జరగకుండా దేశంలో ఎక్కడా లేనివిధంగా భూ నష్టపరిహారంతో పాటు రైతులను దృష్టిలో పెట్టుకొని ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఈ మూడు ప్రాజెక్టుల అంశంలో కొందరు రైతులకు ఇంకా నష్టపరిహారం అందలేదని, మరి కొన్ని కేసులు కూడా ఉన్న విషయాలను మంత్రి శ్రీధర్‌బాబుకు రైతు కమిషన్ గుర్తు చేసింది. వారందరికీ కూడా న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కమిషన్ కోరింది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల జిల్లా ఫిర్యాదు కమిటీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో ఫిర్యాదు కమిటీని నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ ఎన్నికల సమయంలో నగదు స్వాధీనం, విడుదల, ఎఫ్‌ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి బృందాల పనితీరును పర్యవేక్షించనుంది. అలాగే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలును పరిశీలిస్తుంది.

**కమిటీ సభ్యులు ..**

కె.ఎ.మంగతాయారు, అదనపు కమిషనర్ (ఎస్టేట్స్), జిహెచ్‌ఎంసి కమిటీ చైర్‌పర్సన్
మొబైల్ : 9177608271
ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, ఎలక్షన్ వ్యయ పర్యవేక్షణ నోడల్ ఆఫీసర్ కమిటీ కన్వీనర్
మొబైల్ : 9121240116
వసుందర, డిప్యూటీ డైరెక్టర్, డిటిఓ, హైదరాబాద్ కమిటీ సభ్యురాలు
మొబైల్ : 9849044893
ఫిర్యాదుల కమిటీ కార్యాలయం
జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం, ట్యాంక్‌బండ్ మూడవ అంతస్తులో అదనపు కమిషనర్ (ఎస్టేట్స్) ఛాంబర్‌లో ఈ కమిటీ పని చేస్తుంది.

**పరిమిత మొత్తంలోనే నగదు తీసుకవెళ్లాలి : జిల్లా ఎన్నికల అధికారి**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో నగరంలోని ప్రజలు ప్రయాణాల్లో పరిమిత మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులు మాత్రమే తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. నగరంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, (ఎఫ్‌ఎస్‌టి), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్‌ఎస్‌టి) నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని, అనుమానాస్పదంగా కనిపించే వారిని, సరైన ఆధారాలు లేనిపక్షంలో వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుంటారన్నారు. స్వాధీనం చేసుకున్న నగదు విషయంలో సరైన ఆధారాలు చూపిన పౌరులకు, జిల్లా ఫిర్యాదుల కమిటీ పరిశీలన అనంతరం ప్రస్తుతం ఉన్న ఎన్నికల నిబంధనల మేరకు నగదు తిరిగి అందజేస్తుందన్నారు. పౌరులు తమ సమస్యలు, ఫిర్యాదులు కమిటీ కార్యాలయానికి వెళ్లి నివేదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ తెలిపారు.



## టిటిడిపి నేతలతో చంద్రబాబు భేటీ

### తెలంగాణలో పార్టీ కమిటీల నియామకంపై చర్చ

**అమరావతి :** తెలంగాణ తెలుగుదేశం నేతలతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశం అయ్యారు. తెలంగాణ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడి ఎంపిక, పార్టీ సంస్థాగత నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. ఇప్పటికే కసరత్తు పూర్తియిన నేపథ్యంలో తెలంగాణలో మండల అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అధ్యక్షుడితో పాటు స్టేట్ కమిటీ నియమించాలన్న అంశంపైనా సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. తెలంగాణలో 1.78 లక్షల సభ్యత్వం చేసినట్లు చంద్రబాబుకు నాయకులు వివరించారు. రాష్ట్ర అధ్యక్షుడి నియామకం గురించి నేతలు ప్రధానంగా ప్రస్తావించారు. నియామకం ఆలస్యమైతే ఈ లోపు ముఖ్య నాయకులతో కలిపి రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న చంద్రబాబు...కమిటీల నియామకం పూర్తి చేసుకుని పార్టీ యాక్టివిటీ పెంచాలని సూచించారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఇచ్చేవారికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ...

# కాంగ్రెస్‌లో ఊహించని ట్విస్ట్

టికెట్ రేసులో లేనన్న బొంతు రామ్మోహన్
నవీన్ యాదవ్‌పై మధురానగర్ పిఎస్‌లో క్రిమినల్ కేసు నమోదు
అధిష్టానానికి ఆశవాహుల జాబితా

ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ అధికార కాంగ్రెస్ పార్టీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగానే, టికెట్ ఆశిస్తున్న ఇద్దరు కీలక నేతలకు సంబంధించిన వార్తలు పార్టీలో కలకలం రేపుతున్నాయి. బరిలో ఉంటారని భావించిన ముఖ్య నేతల్లో ఒకరు పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించగా, మరొకరు క్రిమినల్ కేసులో చిక్కుకున్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్‌ను మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాను అభ్యర్థిత్వ రేసులో లేనని ఆయన స్పష్టం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను టికెట్ కోసం ఎవరినీ అడగలేదని, పార్టీ అధిష్టానం ఎవరిని బరిలోకి దింపినా వారి గెలుపు కోసం పూర్తిస్థాయిలో పనిచేస్తానని ఆయన తెలిపారు. పార్టీ సిఫారసు చేసిన జాబితాలో ఆయన పేరు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఒకవైపు బొంతు రామ్మోహన్ ఇలా ప్రకటించగా, మరోవైపు టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నెల 4న యూసుఫ్‌గూడలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓటరు కార్డులను పంపిణీ చేశారన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు సోమవారం నవీన్ యాదవ్‌పై బిఎన్‌ఎస్ సెక్షన్లు 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా గోపీనాథ్ సతీమణి సునీతను ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్ నవీన్ యాదవ్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ సిఎన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మురళి గౌడ్, బొంతు రామ్మోహన్‌లు ఇప్పటి వరకు టికెట్ రేస్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో, కాంగ్రెస్ అధిష్టానం జూబ్లీహిల్స్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. జూమ్ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చేసిన సర్వే రిపోర్టులు, అభ్యర్థుల సామాజిక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఆశవాహుల పేర్లతో ఎఐసిసికి సిఫారసు చేయాలని నేతలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.



## శ్రీకాంత్ భరత్‌ను అరెస్ట్ చేయాలి

### వాసవి క్లబ్ ఇంటర్నేషనల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : జాతిపిత మహాత్మా గాంధీ పై అసభ్యకర అనుచిత వ్యాఖ్యలు చేసిన టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ భరత్ ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. హైదరాబాదులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచమంతా శాంతి దూతగా పిలుచుకునే పూజ్య బాపూజీ మహాత్మా గాంధీ గురించి వివిధ సామాజిక మాధ్యమాల్లో శ్రీకాంత్ భరత్ చేసిన వ్యాఖ్యలను తొలగించాలని అతనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భారత ప్రజల ఆరాధ్య దైవంగా జాతీయ పితగా కొలవబడుతున్న మహాత్మా గాంధీ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడడం ఉన్మాద చర్య అవుతుందని వారు అభివర్ణించారు. ఉన్మాదిగా వ్యవహరించిన శ్రీకాంత్ భరత్‌ను కఠినంగా శిక్షిస్తే ఇక ముందు మిగతావారు అదుపులో ఉంటారని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న తమ క్లబ్ ర్యాలీగా పోలీస్ స్టేషన్కు వెళ్లి వినతిపత్రం ఇస్తుందని దీనిపైన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. సెక్రెటరీ గార్లపాటి శ్రీనివాస్ సర్వీస్ సెక్రటరీ బోడా ప్రకాష్ కోశాధికారి సుజాత రమేష్ యాదవ్ నాగేశ్వరరావు రేణికుంట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి

ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : పెంచిన బస్ చార్జీలు వెంటనే తగ్గించాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు డి .సుధీర్ రెడ్డి ,కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ డిమాండ్ చేశారు . బస్ చార్జీల పెంపుపైన ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి అసెంబ్లీ వరకు వారు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించారు . అనంతరం అసెంబ్లీ వద్ద ఉన్న బస్‌స్టాప్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వాహనాల పన్ను పెంచారని, మద్యం ధరలను పెంచారని, ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చార్జీలను పెంచుతున్నారని దుయ్యబట్టారు. చార్జీలను తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడిని పెంచుతామని సుధీర్‌రెడ్డి ,కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ తెలిపారు.

**9న బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన : తలసాని శ్రీనివాస్ యాదవ్**

రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 9న బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, బస్సులో ప్రయాణించి, ఆర్‌టిసి ఎండికి వినతి పత్రం సమర్పించనున్నామని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎ ముఠాగోపాల్, ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కలిసి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కెటిఆర్,హరీశ్ రావుతో సహా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు ఆయా ప్రాంతాలనుంచి ఆర్‌టిసి ఎండి కార్యాలయానికి చేరుకుంటారని, ఆ తర్వాత ఆర్‌టిసి ఎండికి వినతిపత్రం అందజేస్తారని తలసాని వివరించారు.

## 'బిసిలకు 42శాతం రిజర్వేషన్లను కాపాడుకొంటాం'



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : బిసిల 42శాతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్ల పరిరక్షణకు జిఒ 9ను కాపాడుకోవడానికి సంబంధించిన పిటిషన్లలో తాను ఇంప్లీడ్ అవుతున్నానని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రొసీజర్, మెరిట్‌పై వచ్చిన అంశంపై సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పూర్తి కావాలనే హైకోర్టు తీర్పు ప్రకారం జిఒ ఇచ్చామని ప్రభుత్వ వాదనను పూర్తిగా సమర్థిస్తున్నట్లు తెలిపారు. బిసి రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలు అవలంబిస్తున్న ద్వంద వైఖరులను ఎండగడుతామన్నారు. సమావేశంలో బిసి ఐక్య కులాల వేదిక అధ్యక్షులు పాండు యాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నరహరి, సురేందర్, పి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### భారత్ వృద్ధిరేటు అంచనాను 6.5 శాతానికి పెంచిన ప్రపంచ బ్యాంకు


**న్యూఢిల్లీ:** భారత్ వృద్ధిరేటు అంచనాను ప్రపంచబ్యాంకు 6.5 శాతానికి పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధిరేటును 6.3 శాతంగా తొలుత ప్రపంచబ్యాంకు అంచనావేసింది. ప్రపంచంలో శరవేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్‌ను ప్రపంచబ్యాంకు అంచనావేస్తున్నది. దేశంలో వినియోగ వృద్ధి పెరుగుదల గణనీయంగా కొనసాగుతుందని అంచనావేసింది. అదేసమయంలో భారత్ చేస్తున్న ఎగుమతులపై అమెరికా విధించిన 50 శాతం సుంకాలపై కూడా రాబోయేకాలంలో ఎదురయ్యే సమస్యల గురించి ప్రపంచ బ్యాంకు హెచ్చరిక చేసింది. దీని పర్యవసారంగా 2026–27 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధిరేటు అంచనాలను 6.5 శాతం నుండి 6.3 శాతానికి కుదించింది. ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా అభివృద్ధికి సంబంధించి అక్టోబరునెలకుగాను ఈ అంచనాలు వేసింది. జిఎస్‌టి శ్లాబుల మార్పువల్ల వినియోగం పెరుగుతుందన్న అంచనాతో ఈ మార్పులు చేసింది.

## 'ట్రిపుల్ ఆర్' పనుల విషయంలో మాటలు తప్ప.. పనులు లేవు

మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ట్రిపుల్ ఆర్ పనుల విషయంలో మాటలు చెబుతూనే ఉన్నారని, ఇప్పటికీ ఆ పనులు ప్రారంభం కాలేదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నార్త్ సైడ్ రింగ్ రోడ్డుకు టెండర్లు ఆహ్వానించి, ఎందుకు తెరవడం లేదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ విషయంలో ఆరు సంవత్సరాలుగా కేంద్రం, ప్రస్తుత రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూన్నాయనిఆరోపించారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్‌కు చెందిన 8, బిజెపికి చెందిన 8 మంది ఎంపిలు కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని నిలదీసే దమ్ము లేదన్నారు. రెండు సంవత్సరాల కాలంలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంఒక్క రూపాయి ఖర్చు చేయలేదని, ఒక్క ఎకరా కూడా భూ సేకరణ చేపట్టలేదని అన్నారు. 80శాతం భూ సేకరణ చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుందని, రైతులకు డబ్బులు ఇవ్వకుండా భూ సేకరణ ఎలా సాధ్యమని వేముల ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ చింతా ప్రభాకర్, మాజీ ఎంఎల్‌ఎ లక్ష్మా రెడ్డి , బిఆర్‌ఎస్ నాయకులు కె.వాసుదేవ రెడ్డి ,రాఘవ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు : మోదీ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. 2001లో సరిగ్గా ఇదే రోజు నాటి చిత్రాలను షేర్ చేశారు. ఆ రోజు ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. '2001 ఇదే రోజున గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశాను. నా తోటి భారతీయులు నిరంతరం అందిస్తోన్న మద్దతుకు కతజ్ఞత తెలియజేస్తున్నాను. ప్రభుత్వాధినేతగా 25వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నాను. ఈ ప్రయాణంలో ప్రజల జీవితాలు మెరుగుపర్చడం కోసం, దేశ పురోగతికి నావంతు ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నాను' అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన నాటి చిత్రాలను షేర్ చేశారు. మోదీ 2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తన గుజరాత్ మోడల్‌తో 2014 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి... ఎన్డీయేను విజయతీరాలకు చేర్చారు. వరుసగా మూడుసార్లు ప్రధాని పదవి చేపట్టారు.

### ఉమ్మడి బలం, వ్యూహాత్మక దూరదృష్టి వల్లే...

# ఉగ్రవాద మౌలిక సదుపాయాలు ధ్వంసం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడి
65వ జాతీయ డిఫెన్స్ కాలేజి కోర్స్ అధ్యాపకులు, సభ్యులను ఉద్దేశించి కీలక ప్రసంగం



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశ సాయుధ బలగాలు తమ ఉమ్మడి బలాన్ని, వ్యూహాత్మక దూరదృష్టిని ప్రదర్శించాయని, దీని ఫలితంగా నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేశామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడులు నాలుగు రోజులపాటు తీవ్ర ఘర్షణకు దారితీశాయి. ఇది మే 10న సైనిక చర్యలను నిలిపివేయడంతో ఒక అవగాహనతో ముగిసింది. మంగళవారం నాడు ఇక్కడి రాష్ట్రపతి భవన్‌లో 65వ జాతీయ డిఫెన్స్ కాలేజి కోర్స్ అధ్యాపకులు, కోర్స్ సభ్యులను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ మారుతున్న భౌగోళిక రాజకీయ పర్యావరణ భద్రతా సందర్భాలు డైనమిక్ ప్రతిస్పందనలు కోరుతున్నాయని చెప్పారు. భారతదేశం సాయుధ దళాలలను మల్టీ డొమైన్ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్లకు సామర్థ్యంగల సాంకేతిక అభివృద్ధి చెందిన పోరాట సన్నద్ధ శక్తిగా మార్చడంలో నిమగ్నమై ఉందని రాష్ట్రపతి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సాయుధ దళాలు ఉమ్మడి వ్యూహాత్మక దూరదృష్టి యొక్క బలాన్ని ప్రదర్శించాయి. నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చడం. సరిహద్దు వెంబడి లోతైన ప్రాంతాలలో చొరబడటానికి విజయవంతమైన ప్రచారం వెనక ఒక సినర్జీ ఉందని ముర్ము చెప్పారు. సాయుధ దళాల నాయకత్వం పట్ల హృదయపూర్వక ప్రశంసలను రాష్ట్రపతి వ్యక్తపరిచారు. సైనిక వ్యవహారాల శాఖకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ కార్యదర్శిగా వ్యవహరించడంతో ఉమ్మడిత్వాన్ని ప్రోత్సహించే ప్రక్రియ ప్రారంభమైందని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్స్, ఇంటిగ్రేటెడ్ యుద్ధ సమూహాల ఏర్పాటు ద్వారా బలగాలను పునర్‌నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని గమనించడానికి నేను చాలా సంతోషిస్తున్నాను' అని ముర్ము చెప్పారు. మన జాతీయ ప్రయోజనాలను నిర్వచించడంలో సార్వత్రిక విలువలు ప్రధానమైనవని, భారతీయ సాంప్రదాయం ఎల్లప్పుడూ మొత్తం మానవాళిని ఒకే కుటుంబంగా చూస్తుందని ముర్ము వివరించారు. 'వసుధైక కుటుంబం' అనే మన ప్రాచీన నానుడిలో ప్రపంచం మొత్తం ఒక్కటే అనే భావన వ్యక్తీకరించబడిందని, సోదర భావం, శాంతి విశ్వాస అంశాలు మనకు ఆభరణాలుగా ఉన్నాయి కానీ మన దేశానికి వ్యతిరేకంగా ఉన్న శక్తులను ఓడించడానికి యుద్ధానికి సిద్ధంగా ఉండటానికి భారతదేశం అధిక ప్రాముఖ్యతను ఇస్తుందని ఆమె చెప్పారు. 'యుద్ధాన్ని నివారించడానికి సామరస్యపూర్వక పరిష్కారాన్ని సాధించడానికి చేయాల్సిన ప్రతి ప్రయత్నమూ జరిగిందన్నారు. శాంతి కోసం ప్రయత్నాలను కృష్ణుడు అనే పాత్ర నడిపించిందని గుర్తుచేశారు. అందుకే ఆయనను దైవిక అస్తిత్వంగా భావిస్తామని రాష్ట్రపతి ముర్ము వెల్లడించారు. 'యుద్ధం దుర్భరంగా మారినప్పుడు కృష్ణుడు అత్యంత బలహీనమైన యోధులలో ఒకరైన అర్జునుడితో అన్ని సందేహాలను వదిలించుకుని ధైర్యంగా పోరాడమని ఉద్బోధించారని, అందువల్ల, యుద్ధం శాంతిపట్ల సమగ్ర భారతీయ విధానం శాంతి,అహింస విలువలకు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తుంది అని ముర్ము చెప్పారు. యుద్ధం అనివార్యమైనప్పుడు పోరాడటానికి ఇది బలంగా స్ఫూర్తిని ఇస్తుంది అని రాష్ట్రపతి విపులీకరించారు.

# మానవత్వం, రాజ్యాంగం ఖూనీ

రాయ్‌బరేలీలో దళితుడి హత్య కిరాతకం
సమాజంపై చెరగని మరక
ఖర్గే, రాహుల్



**న్యూఢిల్లీ :** మూక ఉన్మాదానికి ప్రస్తుత కాలం భయానక గుర్తుగా మిగులుతుందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. న్యాయాన్ని అణచివేయడం, మూక హత్యలకు పాల్పడటం మూములైపోయిందని ఆందోళన వ్యక్తంచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో 38ఏళ్ల దళితుడు హరీం వాల్మీకి హత్య కిరాతకమని, సమాజంపై చెరగని మరకని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఇది రాజ్యాంగాన్ని, మానవత్వాన్ని ఖూనీ చేయడమేనన్నారు. అణగారిన వర్గాలపై హింస పెరుగుతుండటంపై ఆవేదన వ్యక్తంచేశారు. 'మానవులంతా సమానమని చెప్పే రాజ్యాంగం మన దేశానిది. ప్రతి పౌరుడి భద్రత, హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛకు హామీనిచ్చే చట్టాలు మనకున్నాయి. అయితే రాజ్యాంగానికి, దళిత సమాజానికి విరుద్ధమైన ఘటన రాయ్‌బరేలీలో జరిగింది. ఇది అత్యంత హేయం. దేశ ఆత్మను కళంకితం చేసింది' అని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. దళితులు, మైనారిటీలు, పేదలపై నేరాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. వెనుకబడిన వర్గాలపై హింస నిత్యకృత్యంగా మారిందంటూ హత్రాస్, ఉన్నావో ఘటనలు, రోహిత్ వేముల ఆత్మహత్య, ఒడిశామధ్యప్రదేశ్‌లో దళితులపై భౌతిక దాడులు, హర్యానాలో పెహ్లూ ఖాన్, ఉత్తరప్రదేశ్‌లో అఖ్లాక్ మూక హత్యలను గుర్తుచేశారు. శాంతి భద్రతల సంస్థాగత వైఫల్యానికి ఈ ఘటనలు ఆధారాలన్నారు. 'ప్రస్తుతం దళితులు, గిరిజనులు, ముస్లింలు, వెనుకబడిన వర్గాలు, పేదల ఇలా బలహీనమైన ప్రతి ఒక్కరి గొంతు అణచివేయబడుతోంది. వారిపై దాడులు జరుగుతున్నాయి. వారి భాగస్వామ్యాన్ని హరిస్తున్నారు. వారి జీవితాలకు విలువ లేదన్నట్లు హింస, ద్వేషం, మూక దాడులతో రెచ్చిపోతున్నారు. రాజ్యాంగాన్ని బుల్డోజర్‌తో భర్తీ చేస్తున్నారు. న్యాయం స్థానంలో భయం కనిపిస్తోంది' అని రాహుల్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. తాజాగా జరిగినది ఒక వ్యక్తి హత్య కాదని... మానవత్వం, రాజ్యాంగం, న్యాయం హత్యకు గురయ్యాయని ఆయనన్నారు. హరీం వాల్మికి కుటుంబానికి తప్పక న్యాయం జరుగుతుందని అభయమిచ్చారు. భారత భవిష్యత్తు సమానత్వం, మానవత్వంపై ఆధారపడి ఉందని వక్కాణించారు. దేశంలో రాజ్యాంగం ఆధారిత పరిపాలన సాగుతోంది తప్ప మూక పాలన కాదని రాహుల్ అన్నారు. 2014 నుంచి మూక హత్యలు, దాడులు, 'బుల్డోజర్' అన్యాయం, మూక పాలన పేట్రేగిపోయాయని, ఇవి మన కాలానికి భయానక గుర్తులుగా మారాయని ఖర్గే, రాహుల్ వ్యాఖ్యానించారు. హింస ఎప్పుడు సభ్య సమాజానికి చిహ్నం కాబోదన్నారు. హరీం వాల్మికి ఘటన నైతికపరంగా అనేక ప్రశ్నలకు తావిస్తోందని అన్నారు. అంబేద్కర్ కలలు కన్న దేశం... మహాత్మా గాంధీ 'వైష్ణవ్ జన్' విన్ ఇది కాదని, అందులో సామాజిక న్యాయం, సమానత్వం, దయకరుణ ఉన్నాయని, ఇటువంటి నేరాలకు స్థానం లేదని చెప్పారు. మానతత్వమే భవిష్యత్తుకు హామీ ఇవ్వగలదని రాహుల్, ఖర్గే నొక్కిచెప్పారు. అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతుల సాధికారతకు తమ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. అన్యాయాన్ని ఐక్యంగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడి హక్కులు, గౌరవ మర్యాదలకు సంపూర్ణ భద్రత లభించేంత వరకు ఈ పోరాటం జరగాలన్నారు. ఇదిలావుంటే, డ్రోన్లను దొంగలించినట్లు పుకార్లు రావడంతో తన అత్తారింటికి వెళుతుండగా హరీం వాల్మికిపై గ్రామస్తులు మూక దాడి చేసి అతనిని చంపేశారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేశారు. కాగా, బాధితుడి సోదరుడితో రాహుల్ ఫోన్‌లో మాట్లాడారని, వారి కుటుంబానికి భరోసానిచ్చారని కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు అజయ్ రాయ్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

## బిహార్‌లో ఎంతమంది పౌరులు కానివారిని తొలగించారు?

ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఫైర్

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా నుండి పౌరులు కాని వారిని తొలగించడానికి ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా అవసరమని కాంగ్రెస్ పేర్కొంది. కానీ బిహార్‌లో ఎంత మంది పౌరులు కాని వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించారో దేశానికి అవగాహన కల్పించే సమగ్రత లేదా ధైర్యం ఎన్నికల కమిషన్‌కు లేదని విమర్శించింది. బిహార్‌లో ఎంత మంది పౌరులు కాని వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించారో ఎన్నిక సంఘం తెలియజేసి ఉంటే, అది ఇప్పటికే ఉన్నదానికంటే మరింత బహిర్గతమయ్యేదని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. బిహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు విచారణ మంగళవారం తిరిగి ప్రారంభమవుతుందని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఒక వార్తాపత్రికలో ప్రచురించి ఎస్ఐఆర్ విశ్లేషణను కూడా ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. ఎన్నికల కమిషన్ నిర్వహించిన మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియ సంపూర్ణత, సమానత్వం, ఖచ్చితత్వం అనే మూడు అంశాలలోనూ విఫలమైందని ఈ చక్కటి విశ్లేషణ చూపిస్తుంది' అని రమేష్ అన్నారు. బిహార్‌లో ఇసి నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రతిపక్షం నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల సంఘం అధికార బిజెపి ఆదేశం మేరకు పనిచేస్తుందని వారు ఆరోపించారు. ఏ అర్హత కలిగిన పౌరుడిని ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి అనుమతించబోమని, అదే సమయంలో, ఏ అనర్హుడైన వ్యక్తిని జాబితాలో ఉండనివ్వమని కమిషన్ నొక్కి చెప్పింది.

## ఎయిర్ ఇండియా విమానాన్ని ఢీ కొట్టిన పక్షి

**చెన్నై :** ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. కొలంబో నుంచి చెన్నై వచ్చిన ఫ్లైట్‌ను పక్షి ఢీ కొట్టింది. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ అయిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టారు. విమానం 158 మంది ప్రయాణికులతో కొలంబో నుంచి చెన్నైకి వచ్చింది. ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ అయిన తర్వాత పక్షి ఢీ కొన్న విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, ఈ ప్రమాదంలో ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఇంజినీర్లు తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటన నేపథ్యంలో విమానం తిరుగు ప్రయాణాన్ని సంస్థ రద్దు చేసింది. ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేసి 137 మంది ప్రయాణికులను కొలంబోకు పంపినట్లు సంబంధిత అధికారి వెల్లడించారు.

## కరూర్ బాధితులకు విజయ్ ఓదార్పు

**చెన్నై :** కరూర్‌లో టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈనేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చారు. త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి టివికెకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు.. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు (ఎస్ఒపి) రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఇలాంటి బాధాకరమైన పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. ఇలాంటి సమయంలో నేను కరూర్‌కు వెళితే.. అసాధారణ పరిస్థితులకు దారితీయొచ్చు. త్వరలోనే బాధిత కుటుంబాలను కలుస్తా' అని ఇటీవల వెల్లడించారు. కాగా.. కరూర్‌లో ఘటనాస్థలిని సోమవారం ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తమిళగ వెట్రి కళగం సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## కేజ్రీవాల్‌కు ప్రభుత్వ బంగ్లా కేటాయింపు

**న్యూఢిల్లీ :** ఏడాది కాలంగా అధికారిక నివాసం కోసం ఎదురుచూస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేషనల్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక బంగ్లా కేటాయించింది. ఆయన కోరినట్టు బిఎస్‌పి అధినేత్ర మాయావతి నివసించిన బంగ్లాకు బదులుగా సెకెండ్ లార్జెస్ట్ కేటగిరి కింది లోధి ఎస్టేట్ టైప్–7 బంగ్లాను కేటాయించింది. ఈ బంగ్లాలో ఇంతకుముందు మాజీ ఐఎఇఎస్ అధికారి, బిజెపి నేత ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు. కేజ్రీవాల్ 2024 సెప్టెంబర్ 17న ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. నవంబర్ 4న ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని అధికారిక బంగ్లాను ఖాళీ చేసి ఆప్ పంజాబ్ రాజ్యసభ ఎంపి అశోక్ మిట్టల్ ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్నారు. బంగ్లా కేటాయింపులో జరుగుతున్న జాప్యంపై ఆయన ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. గుర్తింపు పొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడి హోదాలో తనకు తగిన ఇల్లు కేటాయించాలని కోరారు. గత మేలో బిఎస్‌పి అధినేత్రి మాయావతి ఖాళీ చేసిన భవనం తనకు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే ఆ బంగ్లాను గత జులైలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించారు.

# సిజెఐపై దాడిని నిరసిస్తూ ఆప్ నిరసనలు



**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి అని వివిధ రాజకీయ పక్షాలు ఆరోపించాయి. సిజెఐపై దాడిని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మంగళవారం తూర్పు ఢిల్లీలోని మయూర్ విహార్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించింది. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ చిత్రపటాలను చేత పట్టుకుని... ఆప్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ నేతత్వంలోని పార్టీ కార్యకర్తలు 'జై భీమ్' నినాదాలు చేశారు. 71 ఏళ్ల న్యాయవాది అయిన దాడి చేసిన వ్యక్తిని ఖండిస్తూ నిరసనకారులు 'హల్లా బోల్', 'చీఫ్ జస్టిస్ కా అప్మాన్ నహి సహేగా హిందూస్తాన్' అని నినాదాలు చేశారు. భరద్వాజ్ బూట్ల దండను ధరించారు. సోమవారం సుప్రీం కోర్టులోని తన కోర్టు గదిలో సిజెఐ గవాయ్ వైపు ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించాడు. దాడి నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవాది రాకేశ్ కిశోర్ లైసెన్సును సస్పెండ్ చేసింది.

**మహారాష్ట్రలో ఎన్‌సిపి(ఎస్‌పి) నిరసనలు**

సిజెఐ బి.ఆర్.గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసిరే ప్రయత్నాన్ని ఖండిస్తూ ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు మంగళవారం ముంబై, మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేయడానికి చేసిన ప్రయత్నమని విమర్శించారు. వందలాది మంది నిరసనకారులు హుతాత్మ చౌక్ వద్ద గుమికూడారు. వారిలో కొందరు తరువాత దక్షిణ ముంబైలోని మంత్రాలయ సమీపంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్త ఒకరు మాట్లాడుతూ తాము మొదట హుతాత్మ చౌక్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించాలనుకున్నామని, కానీ అనుమతి నిరాకరించారని చెప్పారు. ఎన్‌సిపి (ఎస్‌పి) రాష్ట్ర అధ్యక్షుడు శశికాంత్ షిండే, పార్టీ ముంబై అధ్యక్షుడు రాఖీ జాదవ్, ఇతర మద్దతుదారులు దాడిని ఖండిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మరికొంతమంది నిరసనకారులు డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన నినాదాలు చేశారు. అలాగే ఛత్రపతి శంభాజీనగర్‌లో పార్టీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోహిత్ పవార్ మాట్లాడుతూ సిజెఐ బిఆర్ గవాయ్‌పై దాడిని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. 'ఇది చాలా ఖండించదగిన సంఘటన. చిన్న విషయాలకు కూడా వెంటనే ట్వీట్ చేసే బిజెపి నాయకులు... ప్రజల ఆగ్రహం వెల్లువెత్తిన ఏడు నుంచి ఎనిమిది గంటల తర్వాత మాత్రమే దీని గురించి ట్వీట్ చేశారు. దీనిని ఏమని అర్థం చేసుకోవాలి?' అని ఆయన అన్నారు.

### నాలుగు రాష్ట్రాలలోని 18 జిల్లాల్లో

# నాలుగు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

**న్యూఢిల్లీ:** నాలుగు రాష్ట్రాలలో నాలుగు రైల్వే ప్రాజెక్టులను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ఉన్న 18 జిల్లాల మీదుగా 894 కి.మీ మార్గంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ మంగళవారంనాటి సమావేశంలో ఆమోదం తెలియజేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. రూ.24,634 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ నాలుగు రైల్వే ప్రాజెక్టులవల్ల దాదాపు 3,633 గ్రామాలలో ఉన్న 85.84 లక్షలమంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. వీటిల్లో విదిష, రాజ్‌నందగావ్ జిల్లాలు కూడా కలిసే ఉన్నాయి. వార్ధా–భూతవాల్ మధ్య మూడు, నాలుడు లైన్ ప్రాజెక్టుల ద్వారా మహారాష్ట్రలో 314 కి.మీ, అదే రాష్ట్రంలో గోండియా–దంగర్‌గర్ మధ్య నాలుగోలైను కింద 84 కి.మీ రైల్వేలైను నిర్మితమవుతుంది. గుజరాత్, మధ్యప్రదేశ్‌లలోని వదోదర–రత్నామ్ మధ్య మూడు, నాలుగు లైన్ల కింద 259 కి.మీ మార్గం, మధ్యప్రదేశ్‌లోని ఇతార్సి–భోపాల్–బినాలను అనుసంధానించే 84 కి.మీ మార్గం ఏర్పడుతుంది. రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ విషయాలు చెప్పారు. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్తర ప్రణాళికలో భాగంగా ఈ ప్రాజెక్టులకు ఆమోదం తెలియజేశారు. ప్రయాణికులు, సరుకురవాణా సేవలు సజావుగా సాగిపోవడానికి ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి చెప్పారు. పర్యాటక రంగానికి కూడా ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయన్నారు. సాంచి స్తూం, టైగర్ రిజర్వ్, భీంబేత్క రాక్ షెల్టర్, హజారా ఫాల్స్, నవగాన్ నేషనల్ పార్క్‌లకు వెళ్ళడానికి పర్యాటకులకు ఈ మార్గాలలో రైళ్ళ రాకపోకలు చాలా ఉపయోగపడతాయి. అదేవిధంగా ఈ మార్గాలలో బొగ్గు, సిమెంటు, బొగ్గు బూడిద, ఆహార ధాన్యాలు, స్టీల్ వంటి అనేక సరుకులు రవాణా చేయవచ్చు. ఏడాదికి 78 మిలియన్ టన్నుల సరుకులనుఈ మార్గంలో రవాణా చేయడం సాధ్యపడుతుంది.

## బిహార్ ఎన్నికకు 1,200 సిఎపిఎఫ్ కంపెనీలు

**న్యూఢిల్లీ:** బిహార్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం 1,200 కేంద్ర సాయుధ బలగాలు (సిఎపిఎఫ్)ను మోహరించనున్నట్లు అధికారి ఒకరు మంగళవారం తెలిపారు. ఎన్నికలకు ముందు మోహరింపులో భాగంగా ఇప్పటికే రాష్ట్రానికి 500 కంపెనీలు చేరుకోగా, మరికొన్ని కంపెనీలు రానున్నాయి. కేంద్ర హోం వ్యవహారాల శాఖ (ఎంహెచ్‌ఎ), ఇసి నుంచి తుది అనుమతి తర్వాత 1,200 కంపెనీలను మోహరింపజేయనున్నారు. కాగా ఎన్నికల బందోబస్తు కోసం దాదాపు 1,800 కంపెనీలను కేటాయించాల్సిందిగా ఈసీని కోరినట్లు అధికారులు వివరించారు. 243 మంది సభ్యుల బీహార్ శాసన సభకు నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ సోమవారం ప్రకటించింది. ఓట్ల లెక్కింపు నవంబరు 14న నిర్వహిస్తారు. బిహార్ ఎన్నికలకు సిఎపిఎఫ్‌కు సంబంధించిన బలగాల్లో ఎక్కువ భాగం సహస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి), అలాగే కేంద్ర రిజర్వు పోలీసు దళం (సిఆర్‌పిఎఫ్), సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్), ఇండోటిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటిబిపి), కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్), రైల్వే భద్రతా దళం (ఆర్‌పిఎఫ్) ఉన్నాయి.

## చెరువులో 500 ఓటరు కార్డులు

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని ఓ చెరువులో వందలాది ఓటరు కార్డులు పడి ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఛతర్‌పూర్ జిల్లా బిజావర్‌లోని చెరువులో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు అక్కడికి వచ్చారు. చెరువులో సుమారు 500 ఓటరు కార్డులు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా రాజకీయ దుమారం రేపింది. ఓటరు కార్డులు చెరువులో ఉండటంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు . దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు దీప్తీ పాండే విజ్ఞప్తి చేశారు. కార్డులు భద్రపరిచామని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు.

## తొక్కిసలాట పిటిషన్‌పై 10న 'సుప్రీం' విచారణ

**న్యూఢిల్లీ :** కరూర్ తొక్కిసలాటపై సిబిఐ దర్యాప్తును నిరాకరిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అక్టోబర్ 10న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం తెలిపింది. శుక్రవారం జాబితా చేయమని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఘటనపై సిబిఐ దర్యాప్తు కోరుతూ బిజెపి నేత ఉమా ఆనందన్ పిటిషన్ దాఖలు చేశారు. కరూర్ జిల్లా వేలుసామిపురంలో టివికె అధ్యక్షుడు విజయ్ బహిరంగ ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. 41 మంది మరణించారు. వారిలో చాలా మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. సిబిఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రత్యేక పిటిషన్‌ను ప్రధాన ధర్మాసనం తోసిపుచ్చింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (నార్త్‌జోన్) అస్రాగార్గ్‌ను సిట్‌కు నేతత్వం వహించాలని పేర్కొంది. కోర్టుకు కాలానుగుణ నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

# టూరిస్టు బస్సుపై విరిగిపడిన కొండచరియలు

18 మంది ప్రయాణికులు మృతి
శిథిలాల కింద చిక్కుకున్న మరికొంత మంది
హిమాచల్ ప్రదేశ్ బిలాపూర్ జిల్లాలో ఘటన



**బిలాస్‌పూర్ :** హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. మంగళవారం సాయంత్రం ఒక ప్రైవేట్ బస్సుపై భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఘటనలో 18 మంది మరణించగా, అనేక మంది శిథిలాల కింద చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. 30–35 మంది ప్రయాణికులతో బస్సు మరోటన్ నుండి ఘుమర్విన్‌కు వెళుతుండగా ఝండుట్ట అసెంబ్లీ సెగ్మెంట్‌లోని భలుఘాట్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల నుంచి 18 మృతదేహాలను వెలికితీశామని, ముగ్గురిని రక్షించి ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు. పోలీసులుష జిల్లా పరిపాలన అధికారులు ఘటనా స్థలంలో పర్యవేక్షించారని, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు కూడా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయన్నారు. బస్సుపై కొండచరియలు విరిగిపడడంతో ప్రయాణికులు బతికే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని సహాయక చర్యలో పాల్గొన్న ప్రత్యక్ష సాక్షి ఒకరు అన్నారు. సోమవారం నుండి ఆ ప్రాంతంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఘటన పట్ల ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, ఉప ముఖ్యమంత్రి ముఖేష్ అగ్నిహోత్రి ఈ ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. 'బిలాస్‌పూర్ జిల్లాలోని ఝండుట్ట అసెంబ్లీ నియోజకవర్గంలోని బలుఘాట్ (భల్లా వంతెన) సమీపంలో కొండ చరియలు విరిగిపడిన వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది' అని సిఎం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రక్షణ చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ప్రాణనష్టం పట్ల విచారం వ్యక్తం చేశారు. మరణించిన ప్రతి ఒక్కరి బంధువులకు లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా సహాయాన్ని ప్రకటించారు. 'హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అని పిఎంఒ ప్రకటన తెలిపింది. మరణించిన ప్రతి ఒక్కరి బంధువులకు పిఎంఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 ఇవ్వబడుతుంది' అని అది తెలిపింది.

ప్రజాపక్షం
బుధవారం, 08 అక్టోబరు

# రాజ్యాంగ విలువలపై దాడి

సోమవారంనాడు సుప్రీంకోర్టులో – కోర్టు నెం.1లో కేసులు విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై రాకేశ్ కిశోర్ అనే హిందూ మతోన్మాద అడ్వొకేట్ తన బూటును విసిరేందుకు చేసిన విఫలయత్నం భారత రాజ్యాంగ విలువలపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి. ఇది దశాబ్దకాలంగా హిందూ మతోన్మాదశక్తులు సాగిస్తున్న విద్వేష ప్రచార పర్వ సోపానం; భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంగా పీఠికలో నిర్దేశించిన "సోషలిస్టు సెక్యులర్, డెమొక్రటిక్ రిపబ్లిక్" పదబంధంనుంచి సోషలిస్టు సెక్యులర్ తొలగించాలని హిందుత్వ శక్తులు గావిస్తున్న ప్రచారం తలకెక్కించుకున్న ఉన్మాది చేష్ట. జస్టిస్ వినోద్ చంద్రన్ తో బెంచిలో సహన్యాయమూర్తి. "సనాతన ధర్మానికి అవమానాన్ని సహించను"ని హిందూ మతోన్మాదం తలకెక్కించుకున్న ఆ అడ్వొకేట్ గొంతెత్తాడు. హిందుత్వ పేరుతో సనాతన ధర్మ పునరుద్ధరణ వాదనకు జీవం పోస్తున్న ఆర్ఎస్ఎస్ కుటుంబం, ఇతర హిందూ మత సంస్థలు బిజెపి రూపంలో సమాజాన్ని మతమార్గాల్లో విభజించి ఏలుబడి సాగిస్తున్న దేశంలో ఇప్పుడు సనాతన ధర్మానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి? తిరోగమన సనాతన ధర్మ పునరుద్ధరణను కోరుకోవటం కొందరు తమ హక్కుగా భావిస్తున్నప్పుడు, దాన్ని తిరస్కరించే వారికీ అది ప్రజాస్వామిక హక్కు కాదా? సనాతన ధర్మం అనేది కేవలం దేవుడు, పూజలు, ఆచార వ్యవహారాలు పాటించటం కాదు. అదొక సామాజిక–సాంస్కృతిక జీవన విధానం. అందులోని ఎన్నో స్త్రీ వ్యతిరేక, దళిత వ్యతిరేక, బ్రాహ్మణాధిపత్య ఆదేశాలకు వ్యతిరేకంగా ఈ దేశంలో ఎన్నో సంఘ సంస్కర్త బోధనలు నడిచాయి, విజయాలు సాధించాయి. ఆ సంస్కరణలకోసం నడుంకట్టినవారూ హిందువులే. అందువల్ల కాలగమనంలో సమాజ పురోగమనానికి, వృద్ధి చెందుతున్న ప్రాపంచిక దృక్పథానికి అవరోధంగా ఉన్న ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు తిరస్కరణకు గురవుతాయి. ఛాందసవాదులు కొంతకాలం ప్రతిఘటించవచ్చు, కొన్ని సందర్భాల్లో తాత్కాలికంగా పైచేయి కూడా సాధించవచ్చు. కాని అంతిమంగా తలవంచక తప్పదు. సనాతన ధర్మ అనుకూలత – వ్యతిరేకత అనేది భావ సంఘర్షణ. స్వేచ్ఛగా అటువంటి చర్చ జరిగినప్పుడే సత్యం పైచేయి సాధిస్తుంది. కాదని అడ్డంగా నిలబడితే జగన్నాథ రథ చక్రాలు తొక్కుకుంటూ ముందుకెళతాయి. ఇది చారిత్రక సత్యం.

ఇంతకూ ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, సెప్టెంబర్ నెలలో పురాతన ఖజురాహో దేవాలయం నుంచి విరిగిపడిన విష్ణుమూర్తి విగ్రహ పునరుద్ధరణను ఆదేశించాలని ఒక పరమ భక్తుడు సుప్రీంకోర్టును ఆశ్రయించినపుడు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ చేసిన వ్యాఖ్యలు ఈ అపరాధ అడ్వొకేట్ దుశ్చర్యకు హేతువుగా చెప్పబడుతున్నది. వాట్సప్ సోషల్ మీడియాలో వచ్చిన అపవ్యాఖ్యానాలు తన దృష్టికి వచ్చాక జస్టిస్ గవాయ్, తనకు అన్ని మతాల పట్ల సమాన గౌరవం ఉందని, తాను పరిపూర్ణమైన లౌకికవాదినని కోర్టులోనే వివరణ ఇచ్చారు. కోర్టులో జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం ఆయన మనోనిబ్బరాన్ని భంగపరచలేదు. యథావిధిగా తన విచారణ కొనసాగించారు. ఈ ఘటన సర్వత్రా ఖండనలకు గురైంది. అటువంటి గర్హనీయమైన చర్యలకు మన సమాజంలో స్థానం లేదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సిపిఐ, సిపిఐ(ఎం)లు ఈ దాడి యత్నాన్ని యావత్ న్యాయవ్యవస్థపై, రాజ్యాంగ విలువలపై దాడిగా ఖండించాయి. 'రాజ్యాంగ పరిరక్షకుడు సామాజిక అడ్డంకులను బద్దలుకొట్టిన వ్యక్తి (గవాయ్)ని బెదిరించటానికి, అవమానించటానికి ఒడిగట్టిన చర్య'గా ఖర్గే ఖండించారు. ఈ మతిమాలిన చర్య గత దశాబ్దంలో ద్వేషం, మతోన్మాదం, విభజనవాదం మన సమాజాన్ని ఎంతగా ఆవహించిందో తెలియజేస్తున్నదన్నారు. ఈ దాడి యత్నం, "భారత రాజ్యాంగానికి బదులు మితవాద ప్రవర్తన నియమావళిని బద్దులు కావాలని యావత్ న్యాయవ్యవస్థకు సవాలు విసరటం" అన్నారు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా.

నరేంద్రమోదీ పరిపాలనలో ఇతర రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ తమ అదుపాజ్ఞల్లోకి తెచ్చుకున్నారు. పత్రికారంగం, ఎలక్ట్రానిక్ మీడియా కూడా చాలావరకు ప్రభుత్వం చెప్పుచేతల్లోకి వచ్చాయి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం రక్షణ ఆశలు ప్రజలకు మిగిలిన ఆశల్లా ఒక్క న్యాయ వ్యవస్థ. దాన్ని లొంగదీసుకునే ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించకపోతే భవిష్యత్ అంధకారమయమౌతుంది. ఈ గురుతర బాధ్యత లౌకిక, ప్రజాతంత్ర శక్తులపై, శ్రమజీవులు, బడుగు బలహీన తరగతులపై ఉంది. లౌకిక ప్రజాతంత్ర పార్టీలు అప్రమత్తంగా ఉండాలి. రాజ్యాంగ రక్షణ ఉద్యమాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాలి.

# ఉత్తర భారతంలో మత విద్వేషాలకు కొత్త సాకులు


రామ్ పునియాని

భారత రాజకీయాల పాలిట మత ఘర్షణలు శాపంగా మారాయి. ఇది వందేళ్ళుగా సాగుతున్నది. చాలామంది పండితుల ప్రకారం ఈ ఘర్షణలు సాధారణంగా ప్రణాళిక ప్రకారమే సాగుతాయి. ఈ అల్లర్లు జాతిపరమైన విభజనకు దారితీసి కాంగ్రెస్‌ను బలహీనపరిచి జాతిమతతత్వ పార్టీలు లబ్ధి పొందుతాయని పండితులు అభిప్రాయపడుతుంటారు. హిందూ–ముస్లిం అల్లర్లు కాంగ్రెస్‌కు ఎన్నికల్లో నష్టం కలిగించటమే కాకుండా, ''కాంగ్రెస్ వంటి బహుళ–జాతుల పార్టీలను బలహీనపరిచి, జాతి–మతతత్వ పార్టీలను ఈ అల్లర్లు బలోపేతం చేస్తున్నాయని'' వారు పేర్కొంటుంటారు. ఈ పరిశీలనను నిజం చేస్తూ హింసను రెచ్చగొట్టి, ఎన్నికల లబ్ధిని పొందేందుకు మరిన్ని సాకులను సృష్టిస్తున్నారు.

విద్వేషాలను పెంచే ఘటనలకు కారణాలైన సుదీర్ఘ జాబితాలో మసీదుల ఎదుట భారీ సంగీతం వాద్యాలు మోగించటం, మందిరాలలోకి ఎద్దు మాంసం విసరడం, పుకార్లను వ్యాపింపచేయటం వంటి కొత్త సాకులు చేరుతున్నాయి. వీటికి ముస్లిం రాజులను రాక్షసులుగా చిత్రీకరించటం, వారి చేత మందిరాలు ధ్వంసమవటం, ఖడ్గం ద్వారా ఇస్లాం వ్యాప్తి, వారి భారీ కుటుంబాలు దేశంలో హిందువులను మైనారిటీలుగా మార్చే ముప్పు ఉందనడం వంటివి అదనంగా చేరి, విద్వేష సృష్టి ప్రక్రియలకు తోడయ్యాయి. గడిచిన కొన్ని దశాబ్దాలలో గోవు, ఎద్దు మాంస భక్షణ, లవ్ జిహాద్, అనేక ఇతర జిహాద్‌లు, వాటిలో ముఖ్యమైనవిగా కరోనా జిహాద్, ల్యాండ్ జిహాద్‌లు చేరగా, తాజాగా చేరిన వాటిలో 'పేపర్ లీక్ జిహాద్' ఉంది.

ఇవన్నీ ఇలా ఉండగా, తాజాగా ''ఐ లవ్ మొహమ్మద్'' అనే నిరపాయ నినాదం చుట్టూ హింసను నిర్మిస్తుండటాన్ని దేశం గమనిస్తున్న విషయం గుర్తు చేసుకోవాలి. ఇది కాన్పూర్‌లో మహమ్మద్ ప్రవక్త జన్మదినంగా జరుపుకునే మిలాద్–ఉన్– నబీ రోజున నిర్వహించిన ఊరేగింపు సందర్భంగా మొదలైంది. 'ఐ లవ్ మహమ్మద్' అనే బ్యానర్‌ను ప్రదర్శించడం పట్ల కొంత మంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది మతపరమైన పండుగలలో కొత్త సంప్రదాయానికి దారి తీస్తుందని వారి వాదన. పోలీసులలో ఒక వర్గం ఈ వాదనను అంగీకరించి, పోస్టర్‌లు ప్రదర్శించిన వారికి వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. ఇది నిబంధనలను సంపూర్ణంగా ఉల్లంఘించడమే. ఎందుకంటే, శాంతియుత ప్రదర్శనలో ప్రవక్తపై వారి గౌరవాన్ని వ్యక్తం చేయడం నిబంధనల ఉల్లంఘన కాదు. దీని చుట్టూ అలుముకున్న హింస ఉత్తర్ ప్రదేశ్‌లోని అనేక జిల్లాలకు విస్తరించింది.

ఇందులో కాన్పూర్ ఘటన మొదటిది కాగా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీ, బారాబంకీ, మవు జిల్లాలు, ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్, ఉద్ధంసింగ్ నగర్ జిల్లాలు, అనేక ఇతర ప్రాంతాలలో అది పునరావృతమైంది.

పోస్టర్‌ల చించివేతకు దారితీసి, హింస కొనసాగి వాతావరణాన్ని మరింత దిగజార్చింది. అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఎపిసిఆర్) నివేదిక ప్రకారం 'ఐ లవ్ మహమ్మద్'కు సంబంధించి 21 ఎఫ్ఐఆర్‌లు నమోదవగా, 1324 మంది పేర్లు అందులో పేర్కొనగా, 38 అరెస్టులు చోటు చేసుకున్నాయి. బరేలీలో కొద్ది రోజుల పాటు ఇంటర్‌నెట్‌ను నిలిపివేయటంతో పాటు స్థానిక ముస్లిం నాయకుడు మౌలానా తౌకీర్ రజా ఖాన్‌ను వారం రోజుల పాటు గృహ నిర్బంధంలో ఉంచారు. ముస్లింలను వివక్షాపూరితంగా వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. కాన్పూర్ ఘటనపై వినతిపత్రం సమర్పిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అయితే, ఆయనే రాకపోవడంతో హింసాకాండ చోటు చేసుకుంది. ఇటువంటి బాధ్యతారహిత చర్య అనేకమంది ముస్లింల అరెస్టులకు దారి తీసింది.

ఈ మొత్తం పరిణామాల క్రమం ముస్లింలకు వ్యతిరేకంగా నెలకొన్న స్వాభావిక ద్వేషాన్ని బైటపెడుతోంది. చాలా సందర్భాలలో మతతత్వ నాయకుల సంజ్ఞలతో మతతత్వ శక్తులు విద్వేష ప్రచారాన్ని ఉధృతం చేయడం హింసకు దారితీస్తుంది. మోదీ పదేపదే ఇదే పని చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇది జరుగుతుంటుంది. ఈసారి వారి ప్రచారంలో ఘుస్‌పైటియా (చొరబాటుదారులు) అనే పదాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. ఈ విధానం ముస్లింలు, ప్రత్యేకించి బిహార్, అస్సాంలో ఉండే వారి పట్ల శాపంగా మారింది. ఇది బిహార్‌లో ప్రమాదకరమైన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)ను సమర్థించుకోవడంలో ఒక అంశంగా వాడుకుంటున్నారు. దీని ద్వారా 47 లక్షల మంది ఓటర్లను తొలగించగా, తదుపరి భారతదేశం అంతటా చేపట్టాలని భావిస్తున్నారు.

ఈసారి అత్యధిక మత ఘటనలు జరిగిన ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన ప్రకటనలు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి తగని విధంగా ఉన్నాయి. 'గజ్వా–ఎ–హింద్' నినాదాలు చేయాలని కలలుగంటున్నవారికి 'నరకానికి టిక్కెట్లు' ఇస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ 'గజ్వా–ఎ–హింద్' నినాదం ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చింది? భారతీయ ముస్లింలలో ఒక వర్గం నిరపాయమైన







'ఐ లవ్ మహమ్మద్' అనే నినాదమిచ్చారే తప్ప గజ్వా .. అని కాదు. గజ్వా నినాదాన్ని హిందు మితవాదపక్షంలో తాలిబాన్ వంటి వారు మొత్తం ముస్లిం వర్గాన్ని నిందించేందుకు వాడుతున్నారు. ఖురాన్‌లో ఎక్కడా 'గజ్వా–ఎ–హింద్' అనే పదం ప్రస్తావన లేదు. ఒక సందేహాస్పద హాదిల్‌లో ఈ పదం ఉన్నప్పటికీ, అందులో హింద్ అనే పదం భారత్‌ను కాకుండా బస్రాను ఉద్దేశించినది. భారత్‌కు వ్యతిరేకంగా జరిగే ప్రతి యుద్ధాన్ని పాకిస్థాన్‌లో అనేకమంది అతివాదులు గజ్వా అంటుంటారు.

'ఐ లవ్ మహమ్మద్' అనే ఈ మొత్తం వ్యవహారం ముస్లింలను మరింత భయాందోళనలకు, బెదిరింపులకు గురిచేస్తుంది. వారి ప్రవక్త పట్ల ప్రేమను ప్రదర్శించడం ప్రజాస్వామిక భావ వ్యక్తీకరణ కిందకే వస్తుంది. పాకిస్థాన్‌లో తాలిబాన్ తరహా శక్తులు భారత్‌తో ప్రతి సంఘర్షణను గజ్వా అంటుంటారు. ఇక్కడ మన ప్రధాన మంత్రి సైతం ఇదే దిశగా విషయాలను తీసుకెళ్తున్నారు. ఆసియా కప్ క్రికెట్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయం తరువాత ఆయన దానిని ఆపరేషన్ సిందూర్‌కు కొనసాగింపుగా పేర్కొన్నారు.

ఈ పరిస్థితిలో ముస్లిం సమాజం ఏ విధంగా స్పందిస్తుంది? ఇలాంటి శాంతియుత ప్రదర్శనలను నిర్వహించడం పూర్తిగా సర్వసాధారణమే. ఇది రామనవమి ఊరేగింపు సందర్భంగా భారీ శబ్దాలతో డిజెలు, మసీదులపై కాషాయ జెండాలు కట్టడం వంటి వాటికి పూర్తి భిన్నమైనది. మన హిందువుల పండుగలలో కొన్నిటిని ఆయుధంగా మార్చుకుంటున్నారు! ఇర్ఫాన్ ఇంజనీర్, నేహా దభాడే రచించిన 'వెపనైజేషన్ ఆఫ్ హిందూ ఫెస్టివల్స్ (హిందూ పండుగల ఆయుధీకరణ)' అనే పుస్తకంలో, క్షేత్రస్థాయిలో పరిశీలన తరువాత రామనవమి ఊరేగింపులను మసీదులు, ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలలో రచ్చ చేసేందుకు ఉపయోగించడాన్ని వారు వివరించారు. దానికి మరోముఖమే ముస్లిం పండుగలను భయకంపితంగా చూపించడం. మిలాద్–ఉన్–నబీలో 'ఐ లవ్ మహమ్మద్' అనేది ఇందుకు బాధాకరమైన ఉదాహరణ.

ఇటీవల ముస్లింల పండుగల పట్ల చూపుతున్న ద్వేషపూరిత స్పందనలు హృదయాలను మరింత వేరు చేస్తాయి, మత సముదాయాలను మరింత విభజించటానికి దారి తీయడమే కాకుండా, భారత రాజ్యాంగంలో అంతర్భాగమైన సౌభ్రాతృత్వ విలువలను నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. అలాగే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు రాజ్యాంగ నైతికతను ఉల్లంఘిస్తున్నాయి. ముస్లిం సమాజం వాస్తవికంగా ఉంటూ, హిందూ మతతత్వ శక్తులు తమపై విరుచుకుపడేందుకు లేదా తమను మరింత రాక్షసంగా చిత్రించేందుకు సాకులకు అవకాశం ఇవ్వకుండా ఉండాలి.

# ప్రతి సందర్భంలో యాది...బాలగోపాల్

ఇటీవల కొంతమంది మిత్రులం ఒక చిన్న చర్చ చేసుకుంటున్న సందర్భంలో మా మిత్రుడు హరికృష్ణ 'సామాజిక పరిణామక్రమంలో ప్రతి తరము ఒక సంధి దశలోనే ఉంటుంది. ప్రతి దశ సంధి దశే.' అన్న మాటలు ఇప్పుడు పదే పదే బాలగోపాల్‌ను గుర్తు చేస్తున్నాయి. ప్రతి సంధి దశలో వచ్చే సందేహాలను నివృత్తి చేయగలిగే మనుషుల కోసం, ప్రతి తరంలో తలెత్తే సమస్యలకు పరిష్కారం మార్గాలను సూచించగలిగే మెదళ్ల కోసం సమాజం ప్రతిసారి ఎదురుచూస్తూనే ఉంటుంది. అట్లా ఇవ్వాల ప్రత్యేకించి తెలుగు సమాజంతో సహా దేశవ్యాప్తంగా ప్రతి సందర్భంలో బాలగోపాల్‌ను యాది చేసుకుంటున్న సంఘటనలు, సందర్భాలు ఎన్నో. ప్రపంచమంతటా కార్పొరేట్ శక్తులు రాజకీయాలను శాసిస్తున్న క్రమంలో వాటి ఒత్తిళ్లకు లొంగుతున్న పాలకవర్గాలు సాంప్రదాయిక ఆలోచనలతో సమాజాన్ని తిరోగమనంలోకి తీసుకువెడుతూ వారి లోపాలను కప్పి పుచ్చుకోవడానికి ఆ తిరోగమన చర్యలను లేవనెత్తినవారిని, వేలెత్తి చూపి ప్రశ్నించిన వారిని ద్రోహులుగా చిత్రిస్తున్న సంఘటనలు ప్రపంచ దేశాలన్నిటిలో ఒకే విధంగా కనపడుతున్న దృశ్యాలు. అగ్ర రాజ్యం, ఆధునిక రాజ్యం అని చెప్పుకునే అమెరికా నుండి ఇండియా వరకు ఏదైనా ఒకటే చరిత్ర. అదే సమయంలో ఒక దేశంలోని వనరుల కొరతకు, నిరుద్యోగం పెరుగుదలకు, భారమవుతున్న పేద, మధ్యతరగతి జీవన ప్రమాణాలకు అసలు కారణం పాలకుల అసమర్థ పాలన, పెట్టుబడిదారులకు కుళ్ళుగుత్తగా వనరుల అప్పగింత ప్రధాన కారకాలని ఒప్పుకోక ఇతర దేశస్థుల మీద, ఇతర మతస్తుల మీద, ఇతర కులాలకు అందిస్తున్న ప్రత్యేక సదుపాయాల వల్లనే సమాజంలోని మిగతా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రచారం ఎక్కువగా చేసుకుంటున్న సందర్భంలో ఉన్నాం.

ఒకచోట విపరీత ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా తిరగబడుతున్న దృశ్యం చూస్తున్నా ఆ పక్కనే మతం పేరుతోనో, వర్గం పేరుతోనో, జాతివాదం పేరుతోనో మరింకే పేరుతోనే ప్రజల మీద పరోక్ష నియంతృత్వాన్ని అమలుపరుస్తున్న దృశ్యాలను చూస్తున్న దశలో ఉన్నాం. మా కాలంలో విప్లవాలు చేశాం అని చెప్పుకునే సిక్స్‌టీ నుండి సిక్స్‌టీన్ జెంజీ ఉద్యమంకు మరలిన సంధి దశలో ఉన్నాం. ఈ అన్ని సందర్భాల్లో కూడా ముఖ్యంగా తెలుగు సమాజం చాలా సంక్లిష్ట సందర్భాలను, చాలా సందేహాలను ఎదుర్కొంటున్నది. ఆయా సందర్భాలలో చాలామంది మేధావులు వారికి తోచిన విధంగా వారు స్పందిస్తున్నారు. వారు కూడా బాలగోపాల్ ఉంటే ఏమనేవాడో అని ఆలోచిస్తున్నారు అంటే బాలగోపాల్ అవసరం ఇంకా ఈ సంధి దశలో ఉన్నదనే వాస్తవాన్ని తెలుపుతుంది. మణిపూర్‌లో అల్లర్లు జరిగినపుడు, మతత్వతం పేరుతో బుల్డోజర్ రాజకీయాలు నడుపుతున్నపుడు, వందేళ్ల ఆర్ఎస్ఎస్ అంటూ ప్రచారాలు చేసుకుంటున్న కాలంలో వందేళ్ల ఆర్ఎస్ఎస్ అబద్ధాలను బాలగోపాల్ కాలికి బలపం కట్టుకుని తిరిగి ప్రచారం చేసేవాడు అనేది మేధావులందరి మాట. భవిష్యత్తు భారత దేశ రాజకీయాలను బాలగోపాల్ ఇరవై ఏళ్ల క్రితమే ఊహించాడు కూడా. బాలగోపాల్ అన్న తన మాటలు 'వ్యవస్థ పట్ల ప్రజలలో ఏ విశ్వాసం (దేశభక్తి)కలిగించనిదే ఏ వ్యవస్థా నిలవదు. విశ్వాసం కలిగించడానికి నిజమైన ఆదర్శాలు, నిజమైన సామాజిక న్యాయం, నిజమైన సార్వజనీన ప్రగతి కొరవడినపుడు మతతత్వాన్ని, జాతీయవాదాన్ని పాలకులు ఆశ్రయిస్తారు.' ఇప్పుడు జరుగుతున్నదిదే. దేశంలోనే కాదు ప్రపంచ రాజకీయాలలో కూడా. ఐతే ఇటువంటి సందర్భంలో ప్రజాస్వామిక విలువలు తగ్గిపోతున్నపుడు దాన్ని తిరిగి నిలబెట్టడానికి బదులు వీలైనంత ఎక్కువగా వాడుకుని లాభపడటం కోసం మాత్రమే ప్రజాస్వామ్యం అనేది ఉన్నదనే ఆలోచన ధోరణి నేటి తరంలో ఎక్కువ అయినది. ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడి గద్దెనెక్కే నేతలు అధికారంలోకి చేరుకున్నాక దాని గురించి మాట్లాడటం కూడా తప్పుగా చూస్తూ వాటిని గురించి మాట్లాడి న వారిని రకరకాల పేర్లతో శిక్షించాలని చూస్తున్నారు. ఐతే నేతలే కాదు సామాన్య ప్రజానీకం కూడా అటువంటి ఆలోచనలతోనే మెజారిటీ సమాజం ఉన్నదిప్పుడు. ప్రసార సాధనాలు సైతం రాజకీ య పార్టీల ప్రచార గొంతుకలుగా, వారి భావజాల ప్రసార సాధనాలుగా మారిన ఇటువంటి సమయంలో బుద్ధిజీవులుగా చెప్పుకునే వారు కూడా వారివారి ప్రయోజనాల దృష్టితో పనిచేస్తునపుడు కూడా బాలగోపాల్ చెప్పిన 'ప్రజాస్వామ్యాన్ని వాడుకోవడమే తప్ప దానికి బలం చేకూర్చే కర్తవ్యం తమది కాదని ఈ దేశంలో అందరూ అనుకుంటున్నారు. ఈ విషయంలో అందరికంటే ఎక్కువ బాధ్యత బుద్ధిజీవులు, పత్రికలు, ప్రసార సాధనాలపై పెట్టక తప్పదు' అన్న మాటలు గుర్తొచ్చిన ప్రతిసారి వారిని యాది చేసుకుంటున్నది ప్రజాస్వామిక విలువల కోసం తండ్లాడుతున్న సమూహం. ఇప్పుడు పని చేస్తున్న బుద్ధిజీవులు, కాస్తో కూస్తో ప్రజల పక్షాన నిలబడుతున్న పత్రికలు, ప్రసార సాధనల బాధ్యతను మరింతగా గుర్తు చేస్తున్నది అతని స్ఫూర్తి. దానిని కొనసాగించవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నది ఇప్పుడు.



అభివృద్ధి పాలకులు దోపిడీకి వాడుతున్న పర్యాయపదం ఐపోయింది. ఈ అభివృద్ధి అనకొండ ఎపుడూ బడుగు బలహీన వర్గాల పేదలనే మింగుతుందెందుకో అర్థం కాదు.అభివృద్ధి డేగ కళ్ళు ఎప్పుడూ బక్క పేదల భూముల మీదనే ఎందుకుంటాయో మాత్రం అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.పాలకులు మాత్రం ప్రజాప్రయోజన రాగమెత్తుకుంటారు సుతిమెత్తగా. కాదని అడ్డుపడితే తంతారు. నిజానికి ప్రభుత్వమే పేదల భూములను అభివృద్ధి పేర దోచుకునే పెద్ద దొంగ.లేకుంటే విస్తృత ప్రజల ప్రయోజనాలకోసం తమ జీవితాలను కోల్పోతున్న ప్రజలను గౌరవంగా చూసి వారికి గౌరవప్రదమైన ప్రత్యామ్నాయాన్ని చూపించి వారి నుండి భూములను తీసుకోవాల్సిన ప్రభుత్వాలు బలవంతంగా భూసేకరణ చేయడాన్ని దోసుకోవడం కాక ఇంకేమనాలి. ప్రజల భూములను కోర్టులో కేసులు వేసి బాలగోపాల్ కాపాడిన సందర్భాలెన్నో!

ఆపరేషన్ కగార్ పేరుతో హత్యచేసి ఎన్కౌంటర్ అని మాట్లాడుతున్న ప్రభుత్వాల దమన నీతిని బాహాటంగా ఎండగట్టేవాడు. ప్రపంచమంతా ఇస్లామిక్ ఫోబియాతో భయపడుతున్నపుడు దానివెనక ఉన్న రాజకీయ, సామాజిక కోణాలను విప్పి ప్రజలకు అర్థం చేయించేవారు. బాబాలకు బెయిల్లు వచ్చి స్వేచ్ఛగా బయట తిరుగుతున్నపుడు కొందరు విచారణే లేకుండా ఎందుకు జైల్లో మగ్గుతున్నారో నిత్యం గొంతు చించుకుని అరుచు. ఆర్థిక నేరగాళ్లంతా దేశం బయట జల్సాలు చేస్తుంటే వినోదం చూస్తున్న ప్రభుత్వాలు ప్రజల హక్కుల కోసం మాట్లాడిన వారిని మాత్రం జైల్లో వేస్తున్నపుడు ప్రభుత్వాల ద్వంద్వ నీతిని ప్రజలముందు నగ్నంగా నిలబెట్టు. న్యాయస్థానాల అసహజ న్యాయ తీర్పులను ఖండిస్తే కోర్టు ధిక్కరణకు గురవుతామేమో అన్న భయంతో ఉన్న సందర్భంలో సుప్రీం కోర్టు తీర్పులలో గల అన్యాయాలను సైతం ముఖం మీదనే చెప్పేవాడు. బిసిలకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో వాటాకోసం అప్పుడే అది ఎట్లా సమర్థనీయమో కోర్టులకు చెప్పినవాడు ఇప్పుడు వాటి సాధన కోసం తానే న్యాయస్థానాలలో పోరాడేవాడు. బాలగోపాల్ ను స్మరించుకోవడం అంటే అతని ఆలోచనలను, ఆశయాలను సాధించడానికి మరొక్కసారి మనల మనం సిద్ధం చేసుకోవడమే. ఈ సమాజంలో ప్రజాస్వామిక విలువలను కాపాడటానికి, దానికి బలం ఇవ్వడానికి కృషిచేయాల్సిన బాధ్యత బుద్ధిజీవులపైన ఎక్కువగా ఉన్నదని చెప్పిన బాలగోపాల్ మాటలను ఆచరణలో పెట్టడమే మనం ఆయనకు ఇచ్చే నివాళి.

**(అక్టోబర్ 08 బాలగోపాల వర్ధంతి. 12 అక్టోబర్ 2025 ఆదివారం నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో బాలగోపాల్ 16వ సంస్మరణ సభ... అందరూ ఆహ్వానితులే.)**

**దిలీప్. వి**

# పెట్టుబడిదారీ వ్యవస్థ మీద తిరగబడ్డ వీర యోధుడు చేగువేరా

అతనో మడమ తిప్పని పోరాట యోధుడు. సాహసం ఆయన ఊపిరి. ప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప వీరుడు – అతడే చేగువేరా. వీరు జూన్ 14, 1928న జన్మించారు. వీరి అసలు పేరు ఎర్నెస్టో గెవారా. ఇతడు దక్షిణ అమెరికా ఖండపు విప్లవకారుడు, రాజకీయ నాయకుడు.ఇతడు పెట్టుబడిదారీ వ్యవస్థ తో పాటు సామ్యవాదం లోని సాంప్రదాయ వాదా న్ని కూడా వ్యతిరేకించాడు.ఫీడెల్ కాస్ట్రో నాయకత్వంలోని క్యూబా ప్రభుత్వంలో కాస్ట్రో తరువాత అంతటి శక్తిమంతుడైన నాయకుడుగా చలామణీ అయ్యాడు. ఇతడు 1961 నుండి 1965 వరకు పరిశ్రమల మంత్రిగా పనిచేసి క్యూబా ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికలను చాలావరకు నిర్దేశించాడు.ఇతడు అర్జెంటీనా లోని రొసారియా అనే పట్టణంలో 1928 జూన్ 14న ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. 1953లో బ్యూనస్ ఎయిర్స్ విశ్వవిద్యాలయం నుండి వైద్య విద్యలో పట్టా పొందాడు. ఆ తదుపరి మోటారు సైకిల్ పై దక్షిణ అమెరికా ఖండమంతటా పర్యటిస్తున్న సమయంలో ప్రజల జీవన స్థితిగతుల గురించి తెలుసుకున్నాడు. హింసాత్మక విప్లవమొక్కటే సామాజిక అసమానతలను తొలగించగలదని భావించాడు.



1954లో గౌటెమాల దేశంలో ప్రజాబాహుళ్యపు అభ్యున్నతికి కృషి చేస్తున్న సామ్యవాద అనుకూల ప్రభుత్వంతో కలసి పనిచేశాడు. కానీ అదే సంవత్సరం అమెరికా సాయంతో జరిగిన కుట్ర మూలంగా ఆ ప్రభుత్వం కూలదోయబడటంతో మెక్సికో వెళ్ళిపోయాడు. ఈ ఘటనతో అతని హింసాత్మక విప్లవ దృక్పథం బలపడింది.

మెక్సికోలో ఫీడెల్ కాస్ట్రో నాయకత్వంలో అప్పటికి ప్రవాసం వచ్చిన క్యూబా విప్లవకారులతో చేతులు కలిపాడు. 1950 వ దశకం చివరలో అప్పటి క్యూబా నియంత బాటిస్టాకు వ్యతిరేకంగా కాస్ట్రో ఆధ్వర్యంలో జరిగిన గెరిల్లా పోరాటం 1956–1959 లో ముఖ్య పాత్ర పోషించాడు. డాక్టర్ గా, మిలిటరీ కమాండర్ గా సేవలందించాడు. ఈ సమయం లోనే ఇతను 'చే' గా పిలువబడ్డాడు.గెవారా ఎవరినైనా పలకరించే సమయంలో చే అనే అర్జెంటీనా శబ్దాన్ని ఎక్కువగా వాడుతుండటంతో క్యూబన్ విప్లవకారులందరూ అతన్ని 'చే' అని పిలువనారంభించారు. అలా ఆ పేరు స్థిర పడిపోయింది.ఈ పోరాటం విజయవంతమై కాస్ట్రో 1959 జనవరిలో క్యూబా ప్రభుత్వాధికారాన్ని చేపట్టినపుడు గెవారా పరిశ్రమల మంత్రిగా,క్యూబా జాతీయ బాంకు ప్రెసిడెంట్ గా పనిచేసాడు. క్యూబా ప్రతినిధిగా అనేక దేశాలు పర్యటించాడు. ఈ పర్యటనలలో భాగంగానే చే 1959 జూలై నెలలో భారతదేశంలో కూడా పర్యటించాడు. తృతీయ ప్రపంచ దేశాల మీద అమెరికా పెత్తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన చే గెవారా క్యూబా సామ్యవాద దేశంగా మారటానికి దోహదపడ్డాడు.

గెరిల్లా యుద్ధం గురించి వివరించే తన రచనలలో వర్ధమాన దేశాలలో రైతాంగ విప్లవోద్యమాలు నిర్మింపబడాలని కోరుకున్నాడు. పేద దేశాలలో విప్లవాన్ని వ్యాప్తిచేయ తలపెట్టిన చే 1965లో క్యూబాలో తన అతున్నత స్థానాన్ని, హోదాని, పలుకుబడిని అన్నింటిని వదలి పెట్టి కాస్ట్రో వారిస్తున్నా వినకుండా దేశం నుండి అదృశ్యమయ్యాడు.కొద్దిమంది అనుచరులతో రహస్యంగా ఆఫ్రికా దేశమైన కాంగోలో కొంత కాలం గడిపాడు. ఆ సమయంలో ఆ దేశం యొక్క తూర్పు ప్రాంతంలో గెరిల్లా తిరుగుబాటుకు ప్రయత్నించి విఫలుడయ్యాడు. 1966 చివరిలో మరలా దక్షిణ అమెరికా చేరి బొలీవియా దేశంలో మిలిటరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవకారులకు నాయకత్వం వహించాడు. ఈ సమయంలోనే బొలీవియన్ సైన్యం చేతికి చిక్కి వారిచే 1967 అక్టోబర్ 9 న వల్లెగ్రాండె అనే ప్రాంతంలో చంపబడ్డాడు. ఆనాటి నుండి చే గెవారా విప్లవానికి, తిరుగుబాటుకు చిహ్నమై ఎందరికో ఆరాధ్యుడయ్యాడు. వారి సమగ్ర జీవితం అందరికి స్ఫూర్తి కావాలి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజల గుండెలలో వీరు, వీరి రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. చేగువేర లాంటి నాయకుడు ఇక భవిష్యత్ లో పుట్టక పోవచ్చు.చెగువెర అంటేనే ఒక సాహసం,వీరోచిత పోరాటం,, పీడిత ప్రజల పక్షాన వుండే జన కెరటం. వారి జీవితం ప్రపంచవ్యాప్తంగా యువతకు స్ఫూర్తిదాయకం.

**కామిడి సతీష్ రెడ్డి,**
9848445134

**(అక్టోబర్ 9న దక్షిణ అమెరికా ఖండపు విప్లవ కెరటం చేగువేరా వర్ధంతి సందర్భంగా)**

# భారత వాయుసేనకు సెల్యూట్

దేశ భూతల సరిహద్దుల్లో ఇండియన్ ఆర్మీ, సముద్ర జలాలు/తీర ప్రాంతాల కాపలాలో భారత నావికా దళం, గగనతల నిఘా నేత్రంగా భారతీయ వైమానిక దళం అనబడే త్రివిధ దళాలు అనుక్షణం దేశ భద్రతలో కీలకపాత్రను పోషిస్తున్నాయి. గగన తలంలో భరతమాత రక్షణ కవచంగా విశిష్ట సేవలు అందిస్తూ, ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన రక్షణ శక్తిగా భారతీయ వైమానిక దళం లేదా వాయుసేన (ఇండియన్ ఏయిర్ ఫోర్స్) పేరొందింది. బ్రిటీష్ ప్రభుత్వ పాలనలో రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌ను లొంగదీసుకోవడమే లక్ష్యంగా 08 అక్టోబర్ 1932 రోజు భారత వైమానిక దళం ఏర్పాటు చేయబడింది. ప్రతి ఏట 15 జనవరి రోజు భారతీయ ఆర్మీ దినోత్సవం, 04 డిసెంబర్ రోజు భారతీయ నావికా దళ దినోత్సవాలను నిర్వహించుకుంటున్నాం. వీటికి తోడుగా 07 డిసెంబర్ రోజు భారతీయ సాయుధ దళాల దినోత్సవం (ఇండియన్ ఆరమ్డ్ ఫోర్సెస్ డే) నిర్వహిస్తున్నారు. భారత ద్వీపకల్పంలో మూడు వైపుల సముద్ర జలాలు, నాలుగవ వైపు ఉత్తరాన హిమాలయ పర్వతాలు పెట్టని గోడల్లా దేశానికి సహజ రక్షణను కల్పిస్తున్నాయి.

**4వ అతి పెద్ద వాయుసేన – ఇండియన్ ఎయిర్ ఫోర్స్ :**

ప్రపంచంలో 4వ అతి పెద్ద వాయుసేనగా (అమెరికా, రష్యా, చైనా) తదుపరి నిలిచిన భారతీయ వాయుసేన నినాదంగా టచ్ ది స్కై విత్ గ్లోరీ (గౌరవం లేదా కీర్తితో ఆకాశాన్ని తాకుదాం) అనబడే అంశాన్ని తీసుకున్నారు. భారతీయ వైమానిక దళంలో ఏడు కమాండ్ విభాగాలతో (47 వింగ్స్, 19 ఫార్వర్డ్ బేస్ సపోర్ట్ యూనిట్స్) 1,70,000 మంది సుశిక్షితులైన సైనికులు, 1,500 ఎయిర్ క్రాఫ్టులు రక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాయి. భారత రాష్ట్రపతి సుప్రీం కమాండర్‌గా, ఆపరేషనల్ అధిపతిగా ఎయిర్ ఛీఫ్‌ల నాయకత్వంలో సేవలు అందిస్తున్న వాయుసేన ప్రధాన కార్యాలయం న్యూ ఢిల్లీలో ఉన్నది. గగన సీమలో నిరంతరం గస్తీ తిరగడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పౌర సమాజాన్ని రక్షించడం అనే ప్రధాన విధులను కూడా వాయుసేన సమర్థవంతంగా నిర్వహిస్తున్నది. భారత వాయుసేనలో అత్యాధునిక ఆయుధ సంపత్తిలో భాగంగా మిగ్ విమానాలు, సుఖోయ్, తేజాస్, జాగ్వార్, బోయింగ్ 707, హెలికాప్టర్లు, మెసైల్స్ లాంటివి అనేకం ఉన్నాయి. భారత వాయుసేన పాల్గొన్న ముఖ్య సంక్షోభాలు లేదా యుద్ధాల్లో ఇండో–చైనా వార్ (1962), ఆపరేషన్ కాక్టస్(1988), ఆపరేషన్ విజయ్(1961, 1999), కార్గిల్ వార్ (1999), ఇండో–పాక్ వార్ (1947, 1965, 1971, 1999), కాంగో క్రైసిస్ (1960–65), ఆపరేషన్ పూమలై(1987), ఆపరేషన్ పవన్(1987), ఆపరేషన్ మేఘదూత్(1984), గోవా దండయాత్ర (1961) లాంటివి పేర్కొనవచ్చు.

ఆపరేషన్ సిందూర్ పోరాటంలో భాగంగా భారత త్రివిధ దళాలు పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించడం, పాక్ కాళ్ల బేరానికి రావడం చూసాం, త్రివిధ దళాలను చూసి గర్వపడ్డాం. నేడు జరుగుతున్న యుద్ధాల్లో వాయుసేన మాత్రమే గెలుపోటములను నిర్ణయిస్తుంది. భారతీయ వాయుసేన వ్యవస్థాపక దినోత్సవం రోజున పెరెడ్లు, త్యాగధనులకు శ్రద్ధాంజలి, యువతకు స్ఫూర్తి రగిల్చే కార్యక్రమాలు, వాయుసేన సత్తాను చాటే ప్రదర్శనలు లాంటివి నిర్వహిస్తారు. అసాధారణ వీరత్వానికి ప్రతీకలుగా మన వైమానిక దళాలు అపార శక్తిని ప్రదర్శిస్తూ, దేశాన్ని కంటికి రెప్పవలె కాపాడడంలో విజయవంతం కావడం హర్షణీయం. మన త్రివిధ దళాలకు జై జవాన్, జై కిసాన్, జై హింద్ అంటూ దిక్కులు పిక్కటిల్లే విధంగా నినదిద్దాం.

**(08 అక్టోబరు భారత వైమానిక దళ దినోత్సవం సందర్భంగా)**

## రిజర్వేషన్లు అడ్డుకుంటే గుణపాఠం

బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మెడల శ్రీనివాస్ సాగర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** బిసి రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలని కొత్త కొత్త ఎత్తుగడలతో రెడ్డి జాగృతిల పేరుతో వివిధ సంఘాల నాయకుల పేరుతో పిటిషన్లను దాఖలు చేసి అడ్డుకోవాలని చూస్తే భవిష్యత్తులో బీసీలు తగిన గుణపాఠం చెప్తామని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మెడల శ్రీనివాస్ సాగర్ ఖండించారు. 6 శాతం లేని మీరు 10 శాతం ఈడబ్ల్యూఎస్ పేరుతో అప్పనంగా బిసి, ఎస్సీ, ఎస్టీలకు చెందవలసిన విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లను పొందుతూ 60 శాతం ఉన్న బిసిలు 42 శాతం పట్టబద్ధంగా అడుగుతుంటే ఇన్ని అడ్డంకులు సృష్టించడాన్ని బిసి సమాజం మొత్తం గమనిస్తుందని భవిష్యత్తులో తగిన సమయంలో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతామన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లామని ఓ పక్క ప్రభుత్వం చెప్తూనే మరోవైపు రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నట్లుగా అనిపిస్తుందని ఆయన అన్నారు.

## రైతులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల సమీపంలో గల రైతులకు పత్తి మిల్లులో సన్మానం కాటన్ డే సందర్భంగా భాగ్యలక్ష్మి కాటన్ మిల్‌లో రైతులకు ఘన సన్మానం నిర్వహించారు. కాటన్ డే సందర్భంగా పత్తి మిల్లు యజమానులు అక్కడ ఉన్న పలు రైతులను శాలువతో సత్కరించి కాటన్ డే యొక్క విశిష్టతను వివరించారు. రైతులు దీరాల సుధాకర్ రెడ్డి, రహమాన్ ఖాన్, రఘువీర్‌తో పాటు పలు రైతులను మిల్లు యజమాన్ని శ్రీనివాస్, లాహోతి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



## ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ మాగనూరు :** మాగనూరు మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా రాజు, (సాక్షి) నూతన అధ్యక్షుడిగా దండు రాము, (నమస్తే తెలంగాణ) ప్రధాన కార్యదర్శిగా పి. సురేష్, (ఆంధ్ర ప్రభ) కార్యదర్శిగా శివ, (దిశ) ఉపాధ్యక్షులుగా నగరం రాజు, (ప్రజాపక్షం)గొల్ల నరేష్, (నవ తెలంగాణ ) కోశాధికారిగా శ్రీనివాస్, (ప్రజాజ్యోతి)సలహాదారుడుగా చంద్రశేఖర్ గౌడ్ , ( మన తెలంగాణ) కార్యవర్గ సభ్యులుగా ప్రభుదాస్ రెడ్డి, నాగేష్, రమేష్ గౌడ్, కథలప్ప, ఆంజనేయులు, అశోక్, భాస్కర్ తో పాటు తదితరులను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతన అధ్యక్షుడుగా ఎన్నికైనా దండు రాము మాట్లాడుతూ అందరిని కలుపుకొని నడుస్తానని తనను అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎంబిబిఎస్‌లో సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



**ప్రజాపక్షం/మక్తల్ :** నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీట్ సాధించిన డి.నందిని మక్తల్ పట్టణ కేంద్రంలోని బ్రిలియంట్ హైస్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ సుజాత ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడుతూ 2021–22 విద్యా సంవత్సరంలో బ్రిలియంట్ స్కూల్లో టెన్త్ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. నందిని మంచి ప్రజ్ఞాశాలిని, క్రమశిక్షణ కలిగిన విద్యతోనే నీట్ యూజీ పరీక్షలలో 455 మార్కులు సాధించి మెడికల్ సీట్ సాధించుకున్నందుకు అభినందిస్తూ శాలువా, మెమెంటోతో సత్కరించారు. విద్యార్థిని ప్రోత్సహిస్తూ ముందు చదువులు చదివిస్తున్న నందిని తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ఎంబిబిఎస్‌లో సీట్ చదివి, వైద్యురాలిగా ఉన్నత విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/వంగూర్ :** కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు బండెల్లి శివరాములు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆశ కార్యకర్తలు మండల అధ్యక్షురాలు సుమతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శివరాములు మాట్లాడుతూ గత 15సంవత్సరాలనుండి ఆశా కార్యకర్తలు ప్రజలకు సేవలందిస్తే వారిని గుర్తించకపోవడం బాధాకరమన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి కనీసవేతనం చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సూర్యకళ, వెంకటమ్మ, నిర్మల, పార్వతమ్మ, తిరుపతమ్మ, రేవతమ్మ పాల్గొన్నారు.

## దాడి ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

**ప్రజాపక్షం/మక్తల్:** దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై ఒక సనాతన దుర్మార్గుడు రాకేష్ కిషోర్ కోర్టు హాలులో న్యాయవాదులందరూ చూస్తుండగానే దాడికి పూనుకున్న అత్యంత హేయమైన, దుర్మార్గమైన చర్యను ఖండిస్తూ భారత రాజ్యాంగానికి మక్తల్ మండల్ తహసీల్దార్ ద్వారా మెమోరాండం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మతోన్మాది, సనాతన దుర్మార్గుడు న్యాయవాది మునుగులో రాజ్యాంగబద్ధమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై చేసిన దాడిని స్వతంత్ర న్యాయవ్యవస్థపై మన భారత రాజ్యాంగంపై, దళిత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. ఇటువంటి సనాతన దుర్మార్గ న్యాయవాది రాకేష్ కిషోర్ ను వెంటనే అరెస్టు చేసి, దేశ ద్రోహం కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అలాగే బార్ కౌన్సిల్ ఇండియా అతని లైసెన్సుని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీ రాజ్, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు విజయ్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు పరంధాములు టీచర్, డీవీస్ నాయకులు తిమ్మరాజు, ఆర్యబ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, గొల్లపల్లి అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శి రవికుమార్, కోశాధికారి త్రిమూర్తి, నాయకులు పట్ల రాజేష్, తల్వార్ నరేష్, శ్రీహరి బ్యాగరి, రవికుమార్, జగ్గలి రమేష్, కర్రెమ్ సురేష్, సందీప్, నాగేష్, గొల్లపల్లి ఎల్ల లింగప్ప, అక్షయ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు



**ప్రజాపక్షం/ మాగనూర్ :** మాగనూర్ మండల కేంద్రానికి చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తన నివాసంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాగనూర్ గ్రామానికి చెందిన గాలెల అశోక్ గౌడ్ , రాధిక దంపతులు, బడిసె మారెప్ప గౌడ్, బింగి తాయప్ప, మంగలి గోపాల్, నవీన్ గౌడ్, కెసిఆర్‌పై అభిమానంతో బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీల అమల్లో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డిఎల్ సాయిబన్నా, పూల రాములు, వడ్ల మారెప్ప, నగరం లక్ష్మన్, వాకిటి రాజు, ఆడివప్ప, గజపతి, ఏగునూర్ వెంకటేష్, నారాయణ, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్ల బైపాస్ రోడ్డు నిర్మాణానికి డిపిఆర్



ఈ ఏడాది బడ్జెట్లోనే నిధులు మంజూరు చేస్తామన్న కేంద్రం :ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జాతీయ రహదారి నెంబర్ 167 విస్తరణతో పాటుగా జడ్చర్ల బైపాస్ నిర్మాణాన్ని డీపీఆర్ రూపొందించాల్సిందిగా కన్సల్టెన్సీకి ఆదేశించామని, వీటి నిర్మాణానికి అవసరమైన నిధులను ఈ ఏడాది బడ్జెట్‌లోనే కేటాయిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ చెప్పారని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గడ్కరీ తనకు లేఖ రాసారని వెల్లడించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గత మే నెలలో రాష్ట్ర పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో పాటుగా షాద్‌నగర్ ప్రాంతంలో ఆయనను కలిసి జడ్చర్ల బైపాస్ రోడ్డు నిర్మాణ అవశ్యకతను గురించి తెలిపి, జడ్చర్లకు బైపాస్ రోడ్డు మంజూరు చేయాలంటూ వినతిపత్రాన్ని కూడా సమర్పించిన విషయం తెలిసిందే. ఇటీవలే మరోసారి ఢిల్లీలో కూడా ఈ విషయంగా గడ్కరీతో కలిసి జడ్చర్ల బైపాస్ రోడ్డు గురించి చర్చించారు. ఈ సందర్భంగా జడ్చర్ల పట్టణం మీదుగానే హైదరాబాద్‌బెంగుళూరు జాతీయ రహదారి నెం.44, రాయచూరుకోదాడ జాతీయ రహదారి నెం.167 పట్టణం మధ్యలో నుంచి వెళుతుండటంతో రోజూ వేల సంఖ్యలో వాహనాలు జడ్చర్ల గుండా రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుందని, దీనివల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని గడ్కరీకి అనిరుధ్‌రెడ్డి వివరించామని మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి గుర్తు చేశారు. దీంతో పాటుగా హైదరాబాద్ తర్వాత అంతటి స్థాయిలో పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్లకు బైపాస్ రోడ్డు అత్యవసరమని అందుకే వెంటనే బైపాస్ మంజూరు చేయాలని తాను కోరగా ఈ విషయంగా గడ్కరీ అప్పట్లోనే సానుకూలంగా స్పందించారని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే నితిన్ గడ్కరీ తనకు అధికారికంగా లేఖ రాసారని, అందులో 167 వ నెంబర్ జాతీయ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించడానికి, అలాగే జడ్చర్ల బైపాస్ రోడ్డుకు సంబంధించిన పనులపై అధ్యయనం చేసి డీపీఆర్ డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించడానికి కన్సల్టెంట్‌ను నియమించడం జరిగిందని వారి నుంచి డీపీఆర్ వచ్చిన తర్వాత, ఈ పనులను చేపట్టడానికి ఈ ఏడాది బడ్జెట్లోనే నిధులు కేటాయిస్తామని కూడా గడ్కరీ స్పష్టం చేసారని వివరించారు. దీంతో జడ్చర్ల బైపాస్ నిర్మాణానికి మార్గం సుగమమైందని అభిప్రాయపడ్డారు. జడ్చర్ల బైపాస్ నిర్మాణంతో జడ్చర్ల పట్టణం మరింత విస్తరించడంతో పాటుగా పట్టణ ప్రగతి కూడా పరుగులు పెడుతుందని అభిప్రాయపడ్డారు. జడ్చర్ల బైపాస్ రోడ్డు మంజూరు కోసం తనకు ఎంతగానో సమకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తనతో పాటుగా ఈ రోడ్డు మంజూరుకు కృషి చేస్తున్న ఎంపీ డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# వేతనాలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం



శ్రీ శాంతి ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలి

మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న శ్రీ శాంతి ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండు చేశారు. మంగళవారం నాడు జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంఒకు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఆసుపత్రి 83 పడకల నుండి 50 పడకలకు కుదింపు నిర్ణయం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపి అనంతరం ఆసుపత్రి ఆర్ఎంఒ డా.హరినాథ్ కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కార్మికులు దసరా పండుగకు ఆసుపత్రి కార్మికుల పస్తులు ఉండారాదని ప్రభుత్వం నాలుగు నెలల వేతన బడ్జెట్ విడుదల చేసినప్పటికీ శ్రీ శాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, వైద్య అధికారుల అలసత్వం కారణంగా కార్మికులకు పెండింగు వేతనాలు అందక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఇప్పటికి జీతాల చెల్లింపుల విషయంలో స్పష్టత రావడం లేదని ఆరోపించారు. జడ్చర్ల ఏరియా 100 పడకల ఆసుపత్రిగా ప్రభుత్వం ప్రారంభించి కేవలం 83 పడకలకు మాత్రమే అనుమతులు ఇచ్చిందని తాజాగా ఎలాంటి ముందస్తు ప్రకటనలు చేయకుండా అసంబద్ధంగా 83 పడకల నుండి 50 పడకలకు ఆసుపత్రి సామర్థ్యం తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నుండి 50 పడకల సామర్థ్యం తగ్గిస్తూ నాలుగు నెలల వేతన బడ్జెట్ విడుదల చేశారని దీంతో కార్మికులు ఆరు నెలల వేతనాలు కోల్పోవడమే కాకుండా ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పని చేసిన కార్మికులు ఉద్యోగులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. కనుక తక్షణమే జిల్లా కలెక్టర్, స్థానిక గౌరవ శాసనసభ్యులు స్పందించి ఆసుపత్రి పడకల సామర్థ్యం తగ్గకుండా చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ఆగడాలపై విచారణ జరిపి ఏజెంట్ లైసెన్సులు రద్దు చేయాలని, పెండింగులో ఉన్న కార్మికుల జీతాలు తక్షణమే అందించాలని లేనిచో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు నరసింహ, నవీన్, పేర్మల్, రామకృష్ణ, రవీందర్, శేఖర్, మనెమ్మ, పద్మ, భార్గవి, నీరజ, చెన్నమ్మ, నరసమ్మ, స్వాతి, అంజలి, మంగమ్మ, అలివేళ, విజయలక్ష్మి , సుక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో అన్నిస్థానాల్లో పోటీ

**ప్రజాపక్షం/వెల్దండ :** స్థానికసంస్థల ఎన్నికల్లో అన్నిస్థానాల్లో బిజెపిపార్టీ పోటి చేస్తుందని జాతీయ బిసీ కమీషన్ మాజీసభ్యులు తల్లోజుఆచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన బిజెపి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాలన్నింటికి బిజెపి బలపర్చిన అభ్యర్థులు పోటిలో ఉండాలని అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా కేంద్రంలో బిజెపి చేపట్టిన ప్రజాకర్షక పథకాలు, తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చర్చించాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి కండే హరిప్రసాద్, బిజెపి నాయకులు ఎన్నంశేఖర్‌రెడ్డి, బండల రామచంద్రారెడ్డి, బాలస్వామి, రవికుమార్, పెద్దయ్యగౌడ్, పరమేష్ గౌడ్, జగదీష్, దేవేందర్, ముంగల్ శెట్టి, లాలుప్రసాద్, గంగోజు రాజుచారి, జంగయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

## మతోన్మాదిని కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/మక్తల్:** మనువాదుల నుండి రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు దాడిని ఖండిస్తూ, భారతదేశ అత్యున్నత స్థాయి అయినటువంటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయి మరియు జస్టిస్ వినోద్‌లపై ఆర్ఎస్ఎస్ మతోన్మాది రాకేష్ కిషోర్ తన కాలిబూటుతో దాడి చేయడం కోసం ప్రయత్నం చేయడానికి ప్రజాపంతం మాస్ లైన్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని వారు అన్నారు. ఒక వైపు భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా సనాతన ధర్మం పేరుతో మతోన్మాదులు దాడుల మీద దాడులు చేస్తున్నారని వారు అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కి రక్షణ లేకపోతే భారతదేశంలో ప్రజలు వారికి ఎవరు రక్షణ కల్పిస్తారని వారు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటామని చెప్పుకుంటూనే మతోన్మాదులకు పరోక్షంగా అన్ని సౌకర్యాలు తలపిస్తుందని వారు అన్నారు. నేడు దేశంలో ఇటువంటి దాడులు అనేకం పెరిగిపోయాయని వారు అన్నారు. కనీసం మనుషులను మనిషిగా చూడడానికి సహించని మనువాదాన్ని వ్యతిరేకించాలని వారు అన్నారు. భారతదేశం అనేక మతాలకు నిలయంగా ఉందని సెక్యూలర్ దేశమని దీన్ని మర్చిపోయి సనాతన ధర్మాన్ని కించపరచాలంటే మతం ముసుగులో దాడి చేయడం పిరికిపంద చర్యని తక్షణమే రాకేష్ కిషోర్‌ను లాయర్ రుచి నుండి శాశ్వతంగా తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇటువంటి వైఖరికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని కాపాడాలని హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలకు చేయూత

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ సమస్యలతో ఏ విద్యార్థి కూడా చదువును మధ్యలో ఆపివేయకుండా ఉన్నత స్థాయి చేరేవరకు చదువుకోవాలనే ఉద్దేశంతో ఓ యువకుడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత అందించాడు. 2024లో వారియర్స్ డిఫెన్స్ అకాడమీలో ఉచిత శిక్షణ పొంది కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన పెద్దమెట్ల అశోక్ (2014లో పళ్ళ పరిమలాపురం పాఠశాల 5వ తరగతి పూర్వ విద్యార్థి) నారాయణపేట జిల్లా కేంద్రంలోని పళ్ళ పరిమళ పురం పాఠశాలలో చదువుకుంటున్న 120 మంది విద్యార్థులకు మంగళవారం టై, బెల్ట్, షూస్, ఐడి కార్డులను తనవంతుగా అందించి సేవా దృక్పథాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా యువకుడు మాట్లాడుతూ తాను కూడా ఉద్యోగం సాధించేందుకు ఎంతో కష్టపడ్డానని. ఏ విద్యార్థి కూడా చదువును మధ్యలో ఆపివేయకుండా లక్ష్యం చేరేవరకు తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకువచ్చే వరకు శ్రద్ధతో చదువుకోవాలన్నారు. తనలాగా సమజంలోని యువకులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనందించి విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తమవంతు కృషి చేయాలని కోరారు. తనకు తన మిత్రులు వెంకటేష్, ప్రసాద్ కూడా ప్రోత్సహంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం సోనీ, లక్ష్మి కళ్యాణి, ప్రియాంక, లాలప్ప, వారియర్స్ డిపెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు (ఆర్మీ) , వాచ్ పాయి తదితరులు పాల్గొన్నారు.



# ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి



కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన ఆదర్శ ప్రాయుడు అని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వాల్మీకి మహర్షి జీవితం, బోధనలను గౌరవించడానికి వాల్మీకి జయంతిని నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రామాయణం రచించిన ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను, ఎస్.డి.సి. రాజేందర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, కలెక్టరేట్ ఏవో జయసుధ, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖలీల్, డిపిఆర్ వోఎం. ఏ.రషీద్, సీపీవో యోగానంద్, వసతి గృహ వార్డెన్లు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని, మంగళవారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పోలీసు అధికారులు సిబ్బంది పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, ఎస్బిఎస్ఐ నరేష్, ఆర్ఎస్ఐ లు శివ శంకర్, శిరీష, డిపిఓ సూపరిడెంట్ శంకర్ లాల్, స్టాఫ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** రామాయణం రచించిన ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి ఇందిర, డిపిఓ పార్థసారథి, కలెక్టరేట్ ఏ.ఓ సువర్ణ రాజ్, తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండలంలోని చిన్న పొర్ల గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. కృష్ణ నది తీరం నుంచి జల్ది బిందెలలో పవిత్ర జలాన్ని తీసుకువచ్చి వాల్మీకి మహర్షి విగ్రహానికి అభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాలిపటేల్ రవీందర్ రెడ్డి, పూజారి రామారావ్, సంజప్ప, దొబ్బలి హన్మంతు గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఉట్కూర్ మండల కొత్తపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత విద్య రంగంలో ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు నక్క రమాదేవి యన్. మహేష్‌లను గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని గంగారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మహర్షివాల్మీకి ఆరాధన ఉత్సవాన్ని ఘనంగా మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మహానీయుల స్ఫూర్తివేదిక రాష్ట్రచైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్, ఉపాధ్యాయులు రత్నశేఖర్, రాజప్ప, అశోక్‌కుమార్, కొములయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నందకిశోర్, రాముడునాయక్, ఇందుమతి, ఊర్మిళ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల ప్లాట్ల పనులను వేగవంతంగా పూర్తి చేసి

# త్వరితగతిన కేటాయించేలా చర్యలు



కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించే ప్లాట్ల పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరితగతిన కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్ట తండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనం, పార్కులను, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, ఓవర్ హెడ్ ట్యాంక్, మిషన్ భగీరథ పైపులు వంటి మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు కేటాయించే స్థలాలను అన్ని రకాల పనులను వేగవంతంగా పూర్తి చేసి నవంబర్ చివరి వరకు నిర్వాసితులకు ప్లాట్లను కేటాయించే విధంగా పనులన్నింటినీ పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు, విద్యుత్, పంచాయతీరాజ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఎన్నికలు**

స్థానిక సంస్థల ఎన్నికలను ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కొరకు ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించుటలో అధికారుల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వోద్దని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికలు నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు, మార్గదర్శకాలపై సమగ్రమైన అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఎన్నికల విధులు చాలా కీలకమని చిన్న పొరపాటుకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించుటకై అధికారులు కార్యోన్ముఖులు కావాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులు నిర్వహణపై హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏదేని సందేహాలు ఉంటే శిక్షణా కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్స్ ఎన్నికల నిర్వహణ ప్రిసైడింగ్ అధికారుల విధుల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఓ పార్థసారథి, మాస్టర్ ట్రైనర్ బాలు యాదవ్, ఇతర ఎన్నికల శిక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిత్రియాల గ్రామంలో దొంగల బీభత్సం

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో మంగళవారం 11 గంటల సమయంలో గ్రామానికి చెందిన జూలూరు మహేష్ తండ్రి కిష్టయ్య ఇంట్లో దొంగలు పడి మూడున్నర తులాల బంగారం, 65 తులాల వెండి, రూ. 61వేల నగదు అపహరణకు గురైనట్లు జూలురు మహేష్ మంగళవారం చందంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డిండి సిఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ టీంలతో తనిఖీ నిర్వహించారు. అనంతరం ఫింగర్ ప్రింట్ బృందాలతో వేలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులకు త్వరలోనే పట్టుకుంటామని, గ్రామంలో ఎవరైన కొత్త వ్యక్తులు తీరుతున్నట్లు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** మేస్త్రీ పనితో పొట్టకూటి కోసం పనిచేసుకుంటూ బతుకుతున్న ఓగుర్తు తెలియని వ్యక్తిని అనుకోని రోడ్డు ప్రమాదంతో మృత్యువు వెంటాడింది. పోలీసులు తెలిపిన విషాద సంఘటన వివరాల ప్రకారం మృత్యువాత పడ్డ వ్యక్తి పేరు శ్రీను అని, ఇతను ఒంగోల్ నుండి మేస్త్రి పని నిమిత్తం భువనగిరి నుండి తుర్కపల్లి మండలం రామోజీ నాయక్ తండాకు వస్తున్న తరుణంలో పెద్దతాండ గ్రామా శివారులో రోడ్డు ప్రమాదం జరిగి సదరు వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని, వెంటనే అతన్ని గాంధీ హాస్పిటల్‌కి తరలించడం జరిగిందని తెలిపారు. కాగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి గాంధీ హాస్పిటల్ చనిపోయాడని తెలిపారు. మృతుని మెడ మీద అమ్మ అని, కుడి చేతి మీద లవ్ సింబల్, స్టార్ గుర్తులతో పచ్చబొట్టులు ఉన్నాయని తెలిపారు. ఎవరికైనా మృతుడు శ్రీను వివరాలు తెలిస్తే క్రింది 8712662479, 8712662805. నంబర్లకు సమాచారం ఇవ్వాలని తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ ప్రజలను కోరారు.

## స.హ చట్టం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుంది

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు, పబ్లిక్ అథారిటీలపై ఉందన్నారు. ఆయా పబ్లిక్ అథారిటీలు వారి దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులు కోరితే ఇవ్వాలని, ఏ పద్ధతిలో వారు సమాచారం కోరితే ఆ పద్ధతిలో ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎట్టి పరిస్థితులలో తప్పుడు సమాచారం ఇవ్వవద్దని హెచ్చరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులు, యంత్రాంగంలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఆర్‌డిఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఫ్ఓ సతీష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్ట్ కు భారీ వరద..

ఇన్ ఫ్లో...229950 క్యూసెక్కులు..

22 గేట్ల ద్వారా నీటి విడుదల...

**ప్రజాపక్షం/నందికొండ:** మూడు రోజులు శాంతించిన కృష్ణమ్మ మళ్ళీ తన ఉగ్రరూపాన్ని చూపించింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం ప్రాజెక్టు 6 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి 229950 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేస్తున్నారు.ఆదివారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీ టిమట్టం 587.50 అడుగులుగా ఉండి 50 వే ల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వద్ద ప్రాజెక్టు అధికారులు మొత్తం గేట్లను మూసివేశారు అయితే అప్పటి నుండి మంగళవారం వరకు వేలల్లో కొనసాగిన ఇన్ ఫ్లో ఒకేసారి లక్షా ఎనబై వేల క్యూసెక్కులకు పెరగడం అదే సమయంలో ప్రాజెక్టు నీటిమట్టం కూడా గరిష్ట సాయికి చేరుకోవటంతో వెంటనే మొదట 4 గేట్లను తరువా త 16 గేట్లను ఆ తరువాత22 గేట్లను 5అడుగుల మేర పైకి లేపి 177518 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు.అయితే కుడి ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 229950 క్యూసెక్కు ల నీరు మొత్తం అవుట్ ఫ్లో గా విడుదలవుతుంది.సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు మంగళవారం సాయంత్రానికి 589.70 అడుగులుగా ఉండి నీటి నిల్వ 312.0450 టీఎంసీలకు 311.1486 టీఎంసీలుగా ఉన్నది.

## శంకరమ్మకు చివరి వీడ్కోలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బచ్చనగోని గాలయ్య మాతృమూర్తి బచ్చన గోని శంకరమ్మ పార్థివ దేహం పై సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావులు పూలమాలలు సమర్పించి ఆమెకు చివరి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో పార్టీ నాయకత్వం చివరి మజిలీ వరకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు చెడే చంద్రయ్య, బొలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కురుమిద్ద శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, బోడ సుదర్శన్, ఎండి ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మహేందర్, బొలుగురి నరసింహ, గురుజ రామచంద్రం, తిరుపారి వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, బబ్బూరి శ్రీధర్, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ, పట్టణ సిపిఐ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ సిద్ధం కావాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గోద శ్రీరాములు పిలుపు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీకి చేసి విజయానికి సంసిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. తుర్కపల్లి మండల కేంద్రంలో వల్లపు భగవంతు అధ్యక్షతన కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణలు హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల షెడ్యూల్ వచ్చినందున ఆలేరు నియోజకవర్గంలోని గ్రామ శాఖలన్ని సమావేశం జరుపుకొని ఎన్నికలకు సిద్ధం కావాలని తెలిపారు. బలమున్నచోట్ల సర్పంచ్, ఎంపీటీసీలకు, పోటీ చేయుటకు నాయకత్వం సిద్ధం కావాలని కోరారు. ఎన్నికలలో మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శి గుంటిపల్లి సత్తయ్య, కలకుంట్ల సత్యనారాయణ, భూమయ్య, పేద్దులు, బుఖ్య హరి, భానోత్ యాదగిరి, దొనికెల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలుగుతండాలో ఉద్రిక్తత

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పిఏ పల్లి మండలంలోని పలుగు తండాలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది.తండాకు చెందిన రామావత్ బాలాజీ నాయక్ నూటికి పది నుండి 16 రూపాయల వరకు వడ్డీ ఇస్తానని చెప్పి పేద ప్రజలకు ఆశ చూపి ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని కోట్ల రూపాయలను వసూలు చేశాడు.మొదట్లో వడ్డీ సక్రమంగానే చెల్లించి నమ్మకం కలిగించుకున్నాడు. తదానంతరం కొద్ది నెలలుగా ఇచ్చిన డబ్బులు గాని వడ్డీ గానీ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందిన పలువురు బాధితులు మంగళవారం నాడు పలుగుతండాలోని తన విలాసవంతమైన భవనాన్ని ధ్వంసం చేయడంతో పాటు ఇంట్లోనే సామాగ్రిని ఆరుబయట వేసి తగలబెట్టారు.

# పొరపాట్లకు తావివ్వొద్దు

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా, అలాగే నోటిఫికేషన్ జారీలో ఎలాంటి తప్పులు, కొట్టివేతలు, దిద్దివేతలు ఉండొద్దు : కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ, జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంగళవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నామినేషన్లు మొదలుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎలాంటి తప్పు జరగకుండా చూసుకోవాలని, ముఖ్యంగా నామినేషన్ల సందర్భంగా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి రాజ్యాంగపరమైన అంశాల పట్ల పొరపాట్లకు తావివ్వద్దన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలపట్ల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మొదటి విడత అక్టోబర్ 9న, రెండవ విడత ఎన్నికలకు అక్టోబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మాస్టర్ ట్రైనర్ రమేష్ జడ్‌పిటిసి, ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియపై పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నోటీసు జారీ చేయడం మొదలుకొని నామినేషన్ల స్వీకరణ, తీసుకోవల్సిన జాగ్రత్తలు, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, బరిలో ఉన్న అభ్యర్థుల ప్రకటన తదితర అన్ని అంశాలను వివరించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా, అలాగే నోటిఫికేషన్ జారీలో ఎలాంటి తప్పులు ఎలాంటి కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆదేశాల ప్రకారం 9వ తేదీ ఎంపిటిసి, జడ్‌పిటిసి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీతోపాటు, ఓటరు జాబితాను సైతం ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్ని మండలాల ఆర్‌ఓలు, సహాయ రిటర్నింగ్ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, స్వీకరించాల్సిన ధృవపత్రాలు ఇతర అన్ని అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సీఇఓ, ఇంచార్జి డిఆర్‌డిఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఫ్ఓ సతీష్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# 1 క్వింటా 20 కేజీల గంజాయి సీజ్

ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

జిల్లా ఎస్‌పి కె నరసింహ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** నిషేధిత గంజాయి రూ.60లక్షల విలువైన 1 క్వింటా 20 కేజీలను కోదాడ పట్టణ, సిసిఎస్ పోలీసులు స్వాధీనం చేసుకొని ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్‌పి కె నరసింహ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 23వ తేదీన కోదాడ పట్టణ పరిధిలోని 65వ జాతీయ రహదారి వెంబడి దాదాపు 110 కేజీల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలిపెట్టి వెళ్ళగా కోదాడ పట్టణ పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపగా, మూడు ప్రత్యేక బృందాలుగా పోలీసులు ఏర్పడి విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సిసి ఫుటేజ్, నమ్మదగిన సమాచారంతో పోలీసులు మంగళవారం జాతీయ రహదారి సమీపంలోని కట్టకొమ్ముగూడెం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఓ కారును వెంబడించి పట్టుకోగా హైదరాబాద్‌లోని ఏ.ఎస్.రావు నగర్‌కు చెందిన కరణం రమేష్, ఏపి రాష్ట్రంలోని విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన చాపల అశోక్, అదే గ్రామానికి చెందిన చాపల ఎరకమ్మ అలియాస్ రోహిణిలను పట్టుకొని వారి వద్ద నుండి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా గత నెల కోదాడ పట్టణ పరిధి 110 కేజీల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేస్తుండడంతో తాము గంజాయితో దొరుకుతామనే భయంతో దానిని వదిలేసి వెళ్ళినట్లు అంగీకరించారు. ఈ గంజాయిని ఒరిస్సా నుండి కిలో రూ. 5 వేలు చొప్పున కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు ఒప్పుకున్నారు. వీరి నుండి 120 కేజీల గంజాయిని సీజ్ చేయడంతో పాటు టిఎస్ 08 ఎఫ్ ఆర్ 6521 నంబర్ గల కారును, 8 సెల్‌ఫోన్లను సీజ్ చేసి అనంతరం కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన చేధించడంలో ప్రతిభ కనబర్చిన కోదాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ, కోదాడ టౌన్ ఎస్ఐ హనుమాన్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ బాల్తు శ్రీనివాస్, కానిస్టేబుళ్ళు ఎస్ యల్లారెడ్డి, కె సతీష్, యం వెంకటేశ్వర్లు, కె రాంబాబు, ఎస్‌కె ఫరీద్‌లను అభినందించి రివార్డులను ఎస్‌పి నరసింహ అందజేశారు.

# మా భూములు మాకే కావాలి



**ప్రజాపక్షం/చింతపల్లి:** శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన రైతులకు మా భూములు ఇవ్వద్దని మంగళవారం వర్కాల గ్రామ రైతులు తమ భూములలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వర్కాల గ్రామానికి చెందిన రైతులు సర్వే నెంబర్ 173లో 43 మంది రైతులు కొన్ని దశాబ్దాల కాలం నుండి 45 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అప్పటి ప్రభుత్వం రైతుల పేదరికన్ని గుర్తించి అసైన్డ్ భూమికి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చినప్పటి నుండి భూమిని చదును చేసి బోరు, బావులను తొవ్వించి సాగు యోగ్యమైన భూమిగా మార్చుటకు లక్షల రూపాయలు వెచ్చించి ఖర్చు చేశామన్నారు. లక్షల రూపాయలు అప్పులైనప్పటికీ భూమినే నమ్ముకుని సేద్యం చేసుకూంటూ కాలం వెళ్లదీస్తున్నామన్నారు. శివన్న గూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన భూనిర్వాసిత రైతులకు మా భూములను ప్రభుత్వం కేటాయించాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం తీసుకునే ఈ నిర్ణయం వల్ల మా జీవితాలు తారుమారు అవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాలు భూముని నమ్ముకుని సేద్యం చేసుకుంటున్నామని, జీవితాలు అంధకారంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మా పొట్ట కొట్టకుండా ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకొని భూ నిర్వాసితులకు మరొక ప్రాంతంలో భూమిని కేటాయించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

## అమరుల ఆశయ సాధనకు కృషి



స్థూపావిష్కరణ చేస్తున్న ఉజ్జిని యాదగిరిరావు

**ప్రజాపక్షం/చింతపల్లి :** అమరవీరుల అడుగుజాడల్లో పయనించి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల పరిధిలోని హరిజనపురం గ్రామ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకులు ఏదుళ్ళ రాములు స్మారక స్థూపాన్ని మంగళవారం యాదగిరిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ రాములు చిన్నతనం నుండి వామపక్ష భావజాలానికి ఆకర్షితులై భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారన్నారు. సిపిఐ నిర్వహించిన ఎన్నో పోరాటాలలో రాములు పాల్గొన్నారన్నారు. ఎన్నో ప్రలోభాలకు గురిచేసినా, ఎన్ని ఇబ్బందులకు గురైనా తన తుది శ్వాస విడిచే వరకు ఎర్రజెండా పక్షాన నిలిచిన గొప్ప వ్యక్తి అన్నారు. రాములు ఆశయ సాధనకు ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, కార్యవర్గ సభ్యులు షేక్ శంశోద్దిన్, మల్లోజు శేఖరచారి, వింజమూరి నరసింహ, యాచారం శ్రీశైలం, కుటుంబ సభ్యులు ఎదుళ్ళ గణేష్, ధర్మయ్య, మధు, వెంకటరత్నం, బాదం మల్లేష్, జక్కుల లింగం, ఈధ క్రిస్టోఫర్, జక్కుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయా...?

ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ కాలనీలో అన్నెపర్తి మమత భర్త ఆంజనేయులు, అన్నెపర్తి మమత భర్త యాదగిరిలకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం జిల్లా కలెక్టర్ హనుమంత్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయా, ఎన్ని బిల్లులు వచ్చాయి అని అడిగి తెలుసుకొని త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేయాలని సూచించారు. బిల్లులు పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారులకు తెలిపి బిల్లులు క్లియర్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రికి వచ్చే బాధితులకు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు. రికార్డును పరిశీలించి ఆసుపత్రిలో ప్రసవాలను పెంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చండీ రాణి, ఎంపివో సలీం, హౌసింగ్ ఏఈ కావ్యశ్రీ, పంచాయతీ సెక్రటరీ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కండక్టర్ ఇంట్లో చోరీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియన వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం పట్టణం లోని హౌజింగ్‌బోర్డు కాలనీలో చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చామల పార్వతి రోజు మాదిరిగానే ఉదయం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లారు. విధులు ముగించుకోని రాత్రి ఇంటికి చేరుకున్న ఆమెకు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించివెంటనే ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండి, ఇంట్లోని వస్తువులన్ని చిందరవందరగా పడి ఉండడంతోపాటు ఇంటి వెనుక తలుపు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన తీరును గమనించి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కాగా ఈ చోరీలో ఆరు తులాల బంగారంతోపాటు రూ.80వేలు నగదు అపహరణకు గురయ్యాయని బాధితురాలు తెలిపారు. బాధితురాలు పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## సిజెఐ గవాయ్‌పై దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడి

ఐఎఎల్ నల్లగొండ జిల్లా కమిటీ ఖండన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భారత అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయిపై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య అని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సనాతన ధర్మం పేరుతో ఏకంగా దేశ న్యాయ వ్యవస్థ పైనే దాడి చేయడం దుర్మార్గమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకమైన దాడులు రాజ్యాంగ ప్రాథమిక సిద్ధాంతాలలో ఒకటైన సెక్యులరిజం నైతికతను భంగం చేసే చర్యగా వారు ఆరోపించారు. ఇటీవల కాలంలో న్యాయవాదుల పైన న్యాయమూర్తుల పైన దాడులు పరిపాటిగా మారిందని, దీనికి అడ్డుకట్ట వేయాలని, దేశ అత్యున్నత న్యాయమూర్తికే రక్షణ లేకుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఐఏఎల్ తీవ్రంగా ఖండిస్తుందని వారు తెలియజేశారు. అందుకోసమే కేంద్ర ప్రభుత్వం త్వరలో న్యాయవాద రక్షణ చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

**ఎంఎస్‌పి ఖండన:** భారతదేశ అత్యుత్తమ న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై, సనాతన హిందూ ధర్మం పేరిట ఒక ఉగ్రవాది అవమానకరమైన పద్ధతుల్లో చెప్పు విసరడాన్ని సభ్య సమాజం తలదించుకునే అంశం అని, సనాతన ధర్మాన్ని తామే మోస్తున్నామని చెప్పే దుర్మార్గ మతోన్మాదుల చర్యలను తిప్పికొట్టేందుకు భారత సమాజం సిద్ధం కావాలని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ అన్నారు.

**టిజెఎస్ ఖండన**

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ ఘవాయిపై మతోన్మాద దాడిని తెలంగాణ జన సమితి జిల్లా కమిటీ(టిజెఎస్) తీవ్రంగా ఖండిస్తుంది అని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పన్నాల గోపాల్ రెడ్డి ,గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు.

## మహిళల రక్షణే ధ్యేయంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** సూర్యాపేట జిల్లా పరిధిలో ఎటువంటి అసాంఘీక కార్యకలాపాలు,అక్రమ రవాణాలు జరగకుండా, నేరాల నియంత్రణ విద్యార్థినులు,మహిళల రక్షణే ధ్యేయంగా జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహా తెలిపారు. జిల్లాలో పోలీస్‌స్టేషన్‌ల వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్,సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. అంతకుముందు ఎస్పీకి పోలీస్ సిబ్బంది గౌరవవందనంతో స్వాగతం పలికి పోలీస్ పరేడ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్లోని సిసి టివి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్‌ను సేఫ్‌టౌన్ ప్రాజెక్ట్‌గా తీసుకున్నామని, 150 సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ ఉంటుందన్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోగల హుజూర్‌నగర్ టౌన్,మఠంపల్లి,గరిడేపల్లి,నేరేడుచర్ల,పాలకవీడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి పోలీస్‌స్టేషన్ నుండి 50 సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రణాళిక చేశామన్నారు. ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీస్ సిబ్బంది నేత్రాలతో సమానమని,సిసికెమెరాల ద్వారా నేరాలను త్వరతగతిన చేదించవచ్చునని అన్నారు. ప్రజలు వ్యాపారస్తులు,ఉద్యోగులు సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్,సర్కిల్ కార్యాలయంలోని రికార్డ్సను తనిఖీ చేసి కేసుల నమోదు,దర్యాప్తులో వేగం పెంచాలని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీస్ సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రామారావు,డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు,హుజూర్‌నగర్ సీఐ జి.చరమంద రాజు,ఎస్ఐలు బండి మోహన్ బాబు,చలికంటి నరేష్,బాబు,రవీందర్,కోటేష్,ఆర్ఎస్ఐ అశోక్,డిసిఆర్‌బి,పోలీస్ సిబ్బంది అంజన్ రెడ్డి,శేఖర్,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన వ్యాధులకు యశోదలో చికిత్సలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** అరుదైన వ్యాధులకు అతితక్కువ ఖర్చులతో హైదరాబాద్ మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న అధునాతనమైన డ్రామా వాస్క్యులర్ ఆర్థోపెడిక్ ప్లాస్టిక్స్ సర్జరీ సేవలు, క్రిటికల్ కేర్ సమగ్ర పునరస వైద్య సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఎక్కడలేని విధంగా యశోద సూపర్ స్పెషాల్టి హాస్పిటల్‌లో అనేక రకాలైన చికిత్సలకు అధునాతన పరికరాలతో అతితక్కువ ఖర్చులకే సర్జరీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మధ్య కాలంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వాళ్లకు చేతులు కాళ్లకు ప్రధాన రక్తనాళాలు అనుబంధ రక్తనాళాలు తెగిపోతే చాలా ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది, ప్రమాదం జరిగిన ఆరు గంటల్లో రోగిని వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకువస్తే శాశ్వతంగా వైకల్యాన్ని, ప్రాణాలను కాపాడవచ్చని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ సర్జన్ డా. ఎంఇవి చంద్రమౌళి, ఆర్థోపెడిక్ సర్జన్ డా. ప్రఫుల్ కిలార్, జనరల్ ఫిజిషియన్ గుత్తా శశిధర్ రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ సిద్దర, సీనియర్ మేనేజర్ వాసుకిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్రీడ



# ఇక ఆకాశంలో హంగామాకు రెడీ

## సర్టిఫైడ్ 'డ్రోన్ పైలెట్'గా ధోనీ

భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి అభిరుచులు చాలానే. క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే మహీభాయ్.. బైక్‌లు నడపడంతో పాటు యానిమేషన్, సినిమా రంగంలోనూ ప్రయోగాలు చేస్తుంటాడు. ఇప్పుడు మరో అడుగు ముందేసి సాంకేతికను అందిపుచ్చుకున్నాడు అతడు. ఇన్నిరోజులు మైదానంలో హెలిక్యాప్టర్ షాట్లతో అలరించిన ధోనీ ఇకపై ఆకాశంలోనూ తన మార్క్ చూపించనున్నాడు. అవును.. 'సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్'గా గుర్తింపు సాధించాడీ వెటరన్. ఈ సంతోషకరమైన విషయాన్ని ధోనీ అభిమానులతో పంచుకుంది గరుడ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ. భారత్‌లోని ప్రముఖ ఏరోస్పేస్ సంస్థ అయిన గరుడ ఏరోస్పేస్ నుంచి ధోనీ డ్రోన్ పైలెట్ లైసెన్స్ సాధించాడు. డ్రోన్ల తయారీకి ప్రసిద్ధి చెందిన ఈ కంపెనీకి ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న మహీ.. ఇప్పుడు అదే సంస్థ నుంచి సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్‌గా అవతరించాడు. ఇటీవలే చెన్నైలో కంపెనీ డీజీసీఏ అప్రూవ్డ్ రిమోట్ కంట్రోల్ శిక్షణ కేంద్రంలో పాల్గొన్న ధోనీ.. తన నైపుణ్యాలను ప్రదర్శించి లైసెన్స్ పట్టేశాడు.

'గరుడ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రచారకర్త, పెట్టుబడిదారుగా ఉన్న ధోనీ ట్రైనింగ్ పూర్తి చేసుకొని.. డ్రోన్ పైలెట్ లైసెన్స్ సాధించాడు. అతడు చాలా త్వరగా డ్రోన్ ఎగురేయడం నేర్చుకున్నాడు. డ్రోన్ పరిశ్రమలో విస్తరించాలనుకున్న మా టీమ్‌కు ధోనీ కీలకం కానున్నాడు. అతడి లాంటి లెజెండ్స్ ఏదైనా పాటిస్తే దేశం మొత్తం వాళ్లను అనుసరిస్తుంది. ప్రస్తుతం ధోనీ డీజీసీఏ సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్. అతడు గరుడ ఏరోస్పేస్ కేంద్రంలో శిక్షణ పొందాడు. ఇప్పటికే 2,500 మంది ఔత్సాహిక యువతకు డ్రోన్ పైలటింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చాం' అని ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది గరుడ స్పేస్.




# అగ్రస్థానంలో మంధాన..

## సెంచరీతో టాప్-5లోకి దూసుకొచ్చిన బ్రిస్త్!

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దంచికొడుతున్న బ్యాటర్ల ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో అదరగొట్టారు. న్యూజిలాండ్‌పై విధ్వంసక శతకం బాదిన తంజిమ్ బ్రిస్త్ టాప్5లోకి దూసుకొచ్చింది. ఇండోర్ స్టేడియంలో రికార్డు శతకంతో సఫారీ జట్టును గెలిపించిన బ్రిస్త్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానం సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 706 పాయింట్లు ఉన్నాయి. భారత ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానంలో నిలిచింది.

ఐసిసి మంగళవారం ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన అగ్రస్థానంలో నిలిచింది. వన్డే వరల్డ్ కప్ ముందు రెండు శతకాలతో మెరిసిన టీమిండియా వైస్ కెప్టెన్ 791 రేటింగ్ పాయింట్లతో నంబర్ 1 ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఇంగ్లాండ్ సారథి నాట్ సీవర్ బ్రంట్ రెండో ర్యాంక్ సాధించగా.. ఆసీస్ స్టార్ బ్యాటర్ బేత్ మూనీ 713 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియాకే చెందిన అష్ గార్డ్‌నర్ 697 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్ పట్టేసింది.

# తొలి వరల్డ్ కప్ విజేత.. వెస్టిండీస్ దిగ్గజం కన్నుమూత



వెస్టిండీస్ క్రికెట్‌లో విషాదం నెలకొంది. తొలితరం క్రికెటర్, మొట్టమొదటి ప్రపంచకప్ గెలుపొందిన బెర్నార్డ్ జులియన్‌కన్నుమూశాడు. క్లైవ్ లాయిడ్ సారథ్యంలో 1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టులో సభ్యుడైన బెర్నార్డ్ 75 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచాడు. నార్తర్న్ ట్రినిడాడ్‌లో ఆయన మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. వెటరన్ ప్లేయర్, వరల్డ్ కప్ ఛాంపియన్ అయిన బెర్నాల్డ్ మృతిపట్ల వెస్టిండీస్ క్రికెట్ సంతాపం తెలియజేసింది. 'బెర్నాల్డ్ మరణం మమ్మల్ని ఎంతో బాధించింది. ఆయన జట్టుకు అందించిన సేవల్ని కొనియాడుతున్నాం. విండీస్ జట్టు మొదటి వరల్డ్ కప్ విజేతగా అవతరించడంలో బెర్నాల్డ్ కృషి ఎంతో ఉంది. ఈ కష్టసమయంలో ఆయన స్నేహితులు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. క్రికెట్ పట్ల ఆయన నిబద్ధత కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది. ఆయన ఆత్మకు చేకూరాలని ప్రార్థిస్తున్నాం' అని విండీస్ క్రికెట్ అధ్యక్షుడు కిశోర్ షాల్లో పేర్కొన్నాడు.

**1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టు**

ఆల్‌రౌండర్ అయిన బెర్నాల్డ్ కుడిచేతివాటం బ్యాటర్, మంచి స్పిన్నర్ కూడా. అతడు 1973 నుంచి1977 మధ్య కాలంలో 24 టెస్టులు, 12 వన్డేలు ఆడాడు. వన్డే వరల్డ్ కప్‌లో విండీస్ విజేతగా నిలవడంలో బెర్నాల్డ్ పాత్ర మరువలేనిది. శ్రీలంక, న్యూజిలాండ్‌పై నాలుగేసి వికెట్లతో చెలరేగిన అతడు ఫైనల్లో బ్యాటుతో మెరిశాడు. లార్డ్స్ మైదానంలో జరిగిన టైటిల్ పోరులో ఆస్ట్రేలియాపై 26 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలకమయ్యాడు. 1973లో లారడ్స్ టెస్టులో బెర్నాల్డ్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లాండ్ బౌలర్ల వ్యూహాలను తిప్పికొడుతూ 121 పరుగులతో రాణించి జట్టును గెలిపించాడు. అయితే.. సుదీర్ఘ కాలం జాతీయ జట్టుకు ఆడాల్సిన అతడు రెబల్ గ్రూప్‌లో చేరిపోయాడు. అలా.. బెర్నాల్డ్ అంతర్జాతీయంగా ఓ వెలుగు వెలిగే అవకాశాన్ని చేజార్చుకున్నాడు.



# ఫోకస్

# మహిళ

## పెరుగుతున్న నేరాలు..

మహిళలకు భద్రత కల్పిస్తామంటూ ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు.. ఇస్తున్న హామీలు అమలుకావడం లేదని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకటించిన తాజా నివేదికను అనుసరించి 2023లో మహిళలపై మొత్తం 4,48,211 నేరాలు నమోదయ్యాయి. అంతకు ముందు సంవత్సరం కంటే ఇది ఎక్కువ. 2022లో 4,45,256, 2021లో 4,28,278 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు రికార్డుల ఆధారంగా సేకరించిన గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతి ఒక లక్ష మహిళల జనాభాకు 66.2 కేసులు ఉన్నాయి. మధ్యంతర అంచనాల ప్రకారం మొత్తం మహిళల జనాభా 6,770 లక్షలు. ఈ కేసుల్లో మొత్తం 77.6 శాతం చార్జ్‌షీటింగ్ రేటు నమోదైంది. రాష్ట్రాల వారీగా చూస్తే, ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 66,381 కేసులు నమోదు కాగా, తర్వాతి స్థానాల్లో తర్వాత మహారాష్ట్ర (47,101), రాజస్థాన్ (45,450), పశ్చిమ బెంగాల్ (34,691), మధ్యప్రదేశ్ (32,342) ఉన్నాయి. అయితే, నేర రేటు పరంగా తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ప్రతి లక్ష మహిళల జనాభాకు 124.9 కేసులు నమోదయ్యాయి. తర్వాత రాజస్థాన్ (114.8), ఒడిశా (112.4), హర్యానా (110.3), కేరళ (86.1) ఉన్నాయి. దేశ వ్యాప్తంగా చూస్తే, భారతీయ శిక్షాస్మృతిలోని (ఐపిసి) 498ఎ సెక్షన్ కింద భర్త లేదా బంధువుల క్రూరత్వం కేసులు అత్యధికం. ఈ విభాగంలో 1,33,676 కేసులు (సగటు రేటు 19.7) మోదయ్యాయి. ఇక మహిళల కిడ్నాపింగ్, అపహరణ కేసులు 88,605, (సగటు రేటు 13.1), మహిళలపై మర్యాద దెబ్బతీయాలనే ఉద్దేశంతో దాడులు 83,891 కేసులు, (సగటు రేటు 12.4), బలాత్కారం కేసులు 29,670, (సగట రేటు 4.4), వరకట్న మరణాలు 6,156, (సగటు రేటు 0.9), ఆత్మహత్య ప్రేరేపణ 4,825, (సగటు రేటు 0.7), ఆత్మగౌరవానికి భంగకరమైన కేసులు 8,823, (సగటు రేటు 1.3) ఉన్నాయి. బలాత్కార కేసుల్లో 18 ఏళ్ల పైబడిన మహిళలు సంబంధం కలిగినవి 28,821 కాగా, 18 ఏళ్ల లోపువారిపై 849 కేసులు నమోదయ్యాయి. బలాత్కారం ప్రయత్నాలు 2,796 కేసులు, యాసిడ్ దాడులు 113 నమోదయ్యాయి. ప్రత్యేక, స్థానిక చట్టాల (ఎస్ఎల్ఎల్) కింద మహిళలపై నేరాలు 87,850. వరకట్న నిషేధ చట్టం, 1961 కింద 15,489 కేసులు, అనైతిక రవాణా (తప్పుపడిన వ్యాపారం) నిరోధక చట్టం, 1956 కింద 1,788 కేసులు, గృహ హింస నుండి మహిళ రక్షణ చట్టం, 2005 కింద 632 కేసులు, మహిళల అసభ్య ప్రాతినిధ్యం (నిషేధం) చట్టం, 1986 కింద 31 కేసులు, పోక్సో చట్టం కింద 40,046 కేసులు (చైల్డ్ రేప్), 22,149 (లైంగిక దాడి), 2,778 (లైంగిక వేధింపులు), 698 (బాలల అశ్లీలత), 513 (ఇతర నిబంధనలు) నమోదు అయ్యాయి. గత ఏడాది వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాలు కూడా మహిళలపై మానసిక, శారీరక దాడులు పెరుగుతున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితులు దేశంలో మహిళలు అనుభవిస్తున్న దుస్థితిని కళ్లకు కడుతున్నాయి. మహిళల భద్రత, మహిళా అభ్యుదయాన్ని ప్రభుత్వాలు మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి. అప్పుడే మహిళలకు కొంతవరకైనా న్యాయం జరుగుతుంది.



## ఇదెక్కడి న్యాయం?



బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాజకీయ హడావుడి మొదలైంది. 'ఓట్ల చోరీ'పై ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఫిర్యాదులు చేసినా, పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. లక్షల్లో మహిళల పేర్లు ఓటర్ల జాబితా నుంచి కనిపించకుండా పోవడంలో అంతరార్థం ఏమిటనేది ప్రశ్న. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. రాజ్యాంగ మొదటి పేజీలోనే 'ప్రజలు' అనే సంబోధన ఉంది. కానీ, ఆ ప్రజల్లో మహిళల ప్రాధాన్యతను నామమాత్రపు స్థాయికి తగ్గించడం ఎంత వరకూ సమంజసం? చివరికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కూడా తొలగిస్తున్న వైనం. ఇదెక్కడి న్యాయం? బిహార్‌లో 22.7 లక్షల మహిళా ఓటర్ల పేర్లు జాబితా నుండి మాయమయ్యాయి. ఇది ఒక పరిపాలనా పొరపాటు కాదు.... ఒక సామాజిక దృష్టి లోపం. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు సమానత్వం, స్వేచ్ఛ, గౌరవం, హక్కులు ఇచ్చింది. కానీ, ఎంత వరకూ సక్రమంగా అమలవుతున్నాయన్నది ప్రశ్న.

ఆర్టికల్ 14 – సమానత్వం: ప్రతి పౌరుడు చట్టం ముందు సమానుడు. ఒక స్త్రీ పేరు జాబితా నుండి తొలగిస్తే, ఈ సమానత్వమే ప్రశ్నార్థకం అవుతుంది.

ఆర్టికల్ 15 – వివక్ష నిషేధం: లింగం, కులం, మతం, వర్గం ఆధారంగా వివక్ష చేయరాదు. అయితే మహిళల పేర్లు ఎక్కువగా మాయమవడం ఈ ఆర్టికల్‌ను ప్రత్యక్షంగా ఉల్లంఘిస్తుంది.

ఆర్టికల్ 19 – స్వేచ్ఛ : ఓటు హక్కు కేవలం ఎన్నికల్లో పాల్గొనడమే కాదు, అది రాజకీయంగా వ్యక్తీకరణరూపం. మహిళా ఓటు తొలగించడం అంటే ఆమె స్వరాన్ని నొక్కివేయడమే.

ఆర్టికల్ 21 – జీవన హక్కు : గౌరవంతో జీవించడానికి హక్కు ఉంది. ఓటు లేని పౌరుని గౌరవం కేవలం మౌఖిక హక్కుగా మిగిలిపోతుంది.

ఆర్టికల్ 326 – సార్వత్రిక ఓటుహక్కు : ప్రతి పౌరుడికి ఓటు హక్కు హామీ. పేర్ల తొలగింపుతో ఈ హక్కును దక్కకుండా చేసిన మరుక్షణమే ప్రజాస్వామ్యం నుండి మహిళ పాత్ర అదృశ్యమైంది.

మహిళలకు ఓటు హక్కు ఎవరి దయాదాక్షిణ్యాలుకావు. ఇది సామాజిక ఉద్యమాల ఫలితం. స్త్రీలు, దళితులు, కార్మికులు, రైతులు ఈ దేశపు ప్రజాస్వామ్యానికి మూలం. కానీ అదే ప్రజలు ఇప్పుడు జాబితా వెలుపల ఉన్నారు. ఇది యంత్రాంగ వైఫల్యం అనేకంటే, ఈ వ్యవస్థ నిజస్వరూపమనడమే అర్థవంతం. సామాజిక సమానత్వం లేని ప్రజాస్వామ్యానికి విలువ ఉండదు. మహిళల పేర్లను తొలగించినప్పుడు, ఆమె హక్కులు కేవలం చట్టాలకు, కాగితాలకు మాత్రమే పరిమితవుతుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం, దేశంలో 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంటుంది. 1988లో, 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ వయసును 18 సంవత్సరాలకు తగ్గించారు. అయితే, దేశంలో ఉంటున్న విదేశీయులకు, పిచ్చివారికి, దివాలా పిటిషన్ (ఐపి) పెట్టిన వారికి, తీవ్రమైన నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న వారికి ఓటు హక్కు ఉండదు. మరి బిహార్‌లో ఎన్నికల కమిషన్ తొలగించిన లక్షలాది మంది మహిళలు ఈ జాబితాలో ఏ విభాగానికి చెందుతారో అధికారులే వివరించాలి. ఒక స్త్రీ ఓటు వేయడం అంటే శతాబ్దాల నిషేధానికి ప్రతిస్పందన. ఒక స్త్రీ పేరు తొలగించబడడం అంటే శతాబ్దాల న్యాయం పునరుద్ధరణకు ఎదురుదెబ్బ. ప్రతి ఓటు ఒక స్వరం, ప్రతి స్వరం ఒక హక్కు, ప్రతి హక్కు ఒక గుర్తింపు. అదే గుర్తింపును చెరిపివేస్తే, ప్రజాస్వామ్యం శ్వాస తీసుకోవడం ఆగిపోతుంది. ఈ అన్యాయంపై మహిళలే గళం విప్పాలి. హక్కు కోసం ఉద్యమ బాట పట్టాలి. తనను తాను ఈ వ్యవస్థలో పునఃప్రతిష్ఠించుకోవాలి.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ : సిపిఐ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లా కేంద్రంలోని చైన్ గేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో కొమురం భీం విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కొమురం భీం వర్ధంతిని పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ముద్దుబిడ్డ కొమరం భీమ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎన్ రెడ్డి, రవి, బాబూలాల్, గంగయ్య పాల్గొన్నారు.

# గాజాపై జరుగుతున్న మారణకాండ ఆపాలని ఎఐవైఎఫ్ ఆందోళన



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గాజాపై జరుగుతున్న మారణకాండని ఇజ్రాయిల్ ఆపాలని, దానికి సహకరిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో పాలస్తీనా ప్రజలకు మద్దతుగా పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేశమోని ఆంజనేయులు, బిజ్జ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను వెంటనే ఆపాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనం వీడాలని, పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని, యుద్ధం ఆపేవిధంగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివకృష్ణ, డిహెచ్‌పిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మి పతి, శివశంకర్, గోపాల్, రాముడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

## ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం/వరంగల్ :** విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మేర భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ఖిలా వరంగల్ మండలం సమితి సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో శరత్ మాట్లాడుతూ రాష్ట్రం లో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే 25వేలకు పైగా విద్యార్థులకు సంబంధించిన రూ.180 కోట్ల బకాయిలు ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుండి విడుదల చేయకపోవడంతో ఆ స్కీం పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను మంగళవారం నుండి పాఠశాలలకు రావద్దన్న పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివ, భరత్, మదారపు శ్రేయస్, రమేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి రాజ్యాంగాన్ని అవమానించడమే

## మతోన్మాద విషసంస్కృతితో భౌతికదాడులు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిజెఐపై దాడి రాజ్యాంగాన్ని అవమానించడమేనని, మతోన్మాద విషసంస్కృతితోనే ఇలాంటి భౌతికదాడులు జరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యావత్‌దేశం తలదించుకునే నీచమైన చర్య అన్నారు. దీనికి కారణం బిజెపి, ఆర్ఎస్ఎస్, దాని పరివార్ శక్తులు అని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని అనుసరించాలని ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ సంఘటనకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని, దీనికి ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మి పతి, జిల్లా నాయకులు గోపాల్, శివశంకర్, బిజ్జశ్రీను, అంజి, శివకృష్ణ, బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.


**మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో ప్రధాన న్యాయమూర్తిపై దాడి ధోరణి అరాచకత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, బానోతు లింగనాయక్, చిరాల జ్ఞానేశ్వర్, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్ రవి చంద్ర బోస్, మంద శంకర్, తండా శ్రీనాథ్, కూరాకుల పాల్, నక్క నాగార్జున, శ్యాంప్రసాద్, బేతమల్ల శ్రీనివాస్, మెతుకు కుమార్, ఎండి రఫీ, బల్లెం శ్రీకాంత్, జడలనట రాజ్, దాసు, లాలు, ఎండి షంషీర్, తోట రమేష్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా వికారాబాద్ న్యాయవాద బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించిన సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు బస్వరాజ్ పటేల్, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కమల్‌రెడ్డి, అశోక్‌కుమార్, శంకరయ్య, వసుంధర, శ్రీలత, రాంచందరావు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** సిజెఐపై దాడి రాజ్యాంగాన్ని అవమానించటమేనని సిపిఐ సీనియర్ నాయకుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ సిపిఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నే సుజాత, కందుల సుధాకర్, ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాములుగౌడ్, ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశివర్ధన్‌రెడ్డి, బొంగు అరుణ్ కుమార్‌గౌడ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు మండల కార్యదర్శి సరిత, శోభ, అరుణ, సౌజన్య, సుమతి, రజిత, కళ్యాణి, శివజ్యోతి, జ్యోతి, పాల్వాయి సురేందర్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.






# సిపిఐలో చేరిన 30 కుటుంబాలు



## పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. ఆళ్లపల్లి మండలంలో పాతూరు గ్రామపంచాయితీ అనంతోగు గ్రామపంచాయతీ నుంచి సుమారు 30 కుటుంబాలు సిపిఐలో చేరారు. పాతూరు గ్రామానికి చెందిన సపన సీతారాములు, గొగ్గల రాజేందర్ సమక్షంలో 15కుటుంబాలు, ఆనంతోగు గ్రామపంచాయితీ జిన్నలగూడెం గ్రామంలో 15 కుటుంబాలు జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, జిల్లా నాయకులు గొగ్గెల కృష్ణ, మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు, మండల నాయకులు వజ్జ పగడయ్య ఆధ్వర్యంలో సిపిఐ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి సాబీర్‌పాషా పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆళ్లపల్లి మండలంలో సిపిఐ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు పూనెం సూర్యనారాయణ, నవీన్, అబ్బయ్య, కల్తి భద్రం, ప్రభాకర్, గొగ్గల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై నిర్లక్ష్యం

## వెంటనే బిల్లులు చెల్లించాలి

## ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు మూసివేతకు సిద్ధమయ్యాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని, ఒకటి నుంచి పదవ తరగతి వరకు 23వేల మంది సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఏడువేల మంది విద్యార్థులు వీటిల్లో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, జిల్లా సాయి, కార్యదర్శి శివానాయక్, గోపి, చంటి, పవన్, నరేందర్, నాగరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.





# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## స్వచ్ఛ ట్రక్‌లు ప్రారంభించిన ఎంపి



**ప్రజాపక్షం/వికారాబాద్:**కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త వికారాబాద్ పట్టణంలో కొత్తగా ఐదు స్వచ్ఛ ట్రక్కులు ఎంపి కొండవిశ్వేశ్వర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం 11 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 11 స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తున్నాయి. మొత్తం 16 స్వచ్ఛ ట్రక్కుల 16మండలాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచనున్నాయి. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచ డా నికి గత పది సంవత్సరాల నుండి స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తాయని అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవ కాశం కల్పిస్తున్నట్లు ఎంపి తెలిపారు.

## జస్టిస్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన దుండగుడిని కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం/బోడుప్పల్** : భారత న్యాయ వ్యవస్థకు గుండెకాయ లాంటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గా బాధ్యతలు నిర్వహిస్తున్నటు వంటి జస్టిస్ గవాయి పై రాకేష్ కిషోర్ అనే దుండగుడు దాడికి ప్రయత్నించడం క్షమించరాని నేరంగా భావించాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నత్తి మైసయ్య అన్నారు. అట్టి దుండగునికి కఠినమైన శిక్ష విధించాలని, దేశద్రోహిగా భావించాలని డిమాండ్ చేశారు. ఇలా దాడికి ప్రయత్నించడం భారత రాజ్యాంగాన్ని, న్యాయ వ్యవస్థను కించపరచడానికి కుట్ర పన్నినట్టుగా భావించాల్సి వస్తుందని తెలియజేశారు. ఇలాంటి దుశ్చర్య యావత్ భారతదేశ ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాలను కించపరిచినట్లుగా భావించాల్సి ఉంటుందని, కాబట్టి వెంటనే ఆ దుండగుడి పై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తు న నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలియచేశారు.

## నాయీ బ్రహ్మణులతో ఈటల అలయ్ బలయ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట** : నాయి ని బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుచలేదని, హామీలను కొట్లాడి సాధించుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం శామీర్ పే ట మండలంలో తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయిని బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఈటల రాజేందర్‌కు కండువ కప్పి అలయ్‌బలయ్ తీసుకున్నారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగే దౌర్భాగ్య దుస్థితి వచ్చిందని ఆవేదన చెందారు. ఇచ్చిన హామీలను పోరాడితే తప్ప అమలుచేయడం లేదన్నారు. నాయిని బ్రాహ్మణ సంఘానికి ప్రహరీగోడ, నీటి వసతి కొరకు బోర్, వేయించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్, నాయినీలు రమేష్, గోపాల్, బాలకృష్ణ, బిక్షపతి, రాకేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.




## ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు

**ప్రజాపక్షం/కాప్రా:** అధికారులు, ప్రజలతో సమన్వయం పాటిస్తూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా కృషి చేయటం ద్వారా సత్ఫలితాలిస్తాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకా నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ.1.20లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతతో కల్సి మంగళ వారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిలుకానగర్ శరవేగంతో అభివృద్ధి చెందుతోందని, ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తి కాగా మిగిలిన వాటిని సైతం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తానని చెప్పారు. మల్లాపూర్ డివిజన్‌లోని మల్లికార్జున నగర్ కాలనీలో జరిగిన మరో కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రూ.60లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైవ్ బాక్స్ పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి శంకు స్థాపన చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో వరద నీటి ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకొంటు న్నా నన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ అధికారులు రూప, స్రవంతిలతో పాటు స్థానకకాలనీ వాసులు పరమేష్‌రెడ్డి, మధు, ప్రతాప్‌రెడ్డి, సోమయ్య, సారంగపాణి, దుర్గయ్య అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

**ప్రజాపక్షం/తాండూరు:**స్థానిక సంస్థల ఎనికల వేళ కాంగ్రెస్ పార్టీలోకి భారీగ చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం తాండూరు మండల పరిధి చెనిగేష్‌పూర్, కోనాపూర్ గ్రామాలకు చెంది న బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 200మంది స్థానిక ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరా రు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి దారసింగ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, ప్రవీణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** పిట్స్‌తో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం సైనిక్‌పురి ఫస్ట్ ఎవెన్యూ వద్ద ఓ గుర్తు తెలియని మహిళకు ఫిట్స్‌తో పడిపోయి నోటి నురగలు రావడంతో స్థానికులు 100 డయల్ చేసి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో వైద్యం కోసం తరలిస్తూ ఉండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు.మహిళ మృత దేవాన్ని గాంధీ ఆసుపత్రిలో ఫ్రిజర్‌లో భద్రపర్చారు.వివరాలు తెలిసిన వారు కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సెల్ నంబర్ 8712662194,సిఐ భాస్కర్‌రెడ్డి 8712662116, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి 8712662119కు సమాచారం అందించాలని తెలిపారు.

# అధ్వాన్నంగా రహదారుల పరిస్థితి

* ప్రతిపాదనలకే పరిమితమైన సిఆర్ఎంపి
* స్వీపింగ్ మిషన్‌లతో జిహెచ్ఎంసి ఖజానాకు కన్నం
* అనవసర అంశాల చేర్పుతో భారీగా పెరిగిన అంచనా వ్యయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగర రహదారులు పాడైపోతున్నా వాటిని బాగుచేసే ప్రణాళికలు కేవలం ఫైళ్లకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఐదేళ్లుగా విజయవంతంగా అమలైన కంప్రెహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం (సిఆర్ఎంపి) తొలి దశ ముగిసినప్పటికీ, రెండో దశ మాత్రం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. రహదారుల భద్రతకు చర్యలు తీసుకోవాల్సిన పాలకమండలి సభ్యులు, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారుల అలసత్వంతో సిఆర్ఎంపి పథకం అమల్లోకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

రహదారుల నిర్వహణ కు ఉద్దేశించిన సిఆర్ఎంపిలో కొంతమంది అధికారుల అత్యుత్సాహంతో ఇతర అంశాల నిర్వహ ణ కూడా జోడించడంతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగిపోయింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న జిహెచ్ఎంసి ఇంత భారీ మొత్తంలో సిఆర్ఎంపికి నిధులు వెచ్చించలేని పరిస్థితిలో నెలకొంది. కేవలం రోడ్‌ల నిర్వహణకే ప్రతిపాదనలు సిద్ధం చేయడంలో సిఆర్ ఎంపి పథకం వ్యయం తగ్గింది. తీరా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిద్దామని స్థాయీసంఘం ఆమోదానికి ప్రతిపాదనలకు మరోసారి సభ్యులు స్వీపింగ్ మిషన్‌ల ద్వారా సిఆర్ఎంపి రహదారులపై స్వీపింగ్ మిషన్‌ల ద్వారా పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో ప్రతిపాదనలను మరోసారి అధికారులు సవరించి, స్వీపింగ్ మిషన్‌ల అంశాన్ని చేర్చారు. 2020లో అప్పటి ప్రభుత్వం హయాం లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ద్వారా జిహెచ్ఎంసి రూ.1,300 కోట్లతో 800 కిలోమీటర్ల ప్రధాన రహదారులను నిర్వహించింది. సిఆర్ఎంపి కాంట్రాక్టు పొందిన ఏజెన్సీలే ఐదేళ్లపాటు రోడ్లను నిర్వహించాయి. అయితే కొత్త రూపొందించిన ప్రతిపాదనల్లో అనేక అంశాలను పొందుపర్చారు. అంచనా వ్యయం ఎక్కువ కావడంతో వాటిని తొలగించి, తిరిగి ప్రతిపాదనలు రూపొందించారు. మెకానికల్ రోడ్ స్వీపింగ్ (యంత్రాల ద్వారా రోడ్ల శుభ్రత)ను అదనంగా చేర్చారు.

**రెండో దశ భారీ ప్రణాళికకు నిధుల సమస్య..**

ప్రస్తుతం రూపొందించిన సిఆర్ఎంపి రెండో దశలో, మునుపు తొలగించిన అంశాలతో పాటు కొత్తగా స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ల నిర్మాణం, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, గ్రీనరీ నిర్వహణ, డ్రెయిన్‌ల డీసిల్టింగ్ వంటి అంశాలను చేర్చారు. మొత్తం 1,142 కి.మీ. ప్రధాన రహదారులు, 934 యాక్సెస్ రోడ్లను కలిపి రూ.3,825 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ, 2023లో పలు మార్పు అనంతరం ఆర్థిక సంక్షోభంలో జిహెచ్ఎంసి కూరుకుపోయింది. దీంతో జిహెచ్ఎంసి ప్రణాళికను మరోసారి సవరించి, కేవలం రహదారి నిర్వహణకు సంబంధించిన అంశాలతో రూ.2,828 కోట్ల వ్యయంతో మళ్లీ ప్రతిపాదనలు అధికారులు రూపొందించారు.

**స్వీపింగ్ మిషన్‌ల కోసం స్థాయీ సంఘం సభ్యులు పట్టు..**

సిఆర్ఎంపి పథకంలో స్వీపింగ్ మిషన్‌ల ఏర్పా టు చేయాలని స్థాయీసంఘం సభ్యులు పట్టబట్టారు. స్వీపింగ్ మిషన్‌లు ఉండాలని స్థాయీసంఘంలో తీర్మానం చేశారు. దీంతో చేసేదిలేక అధికారులు స్వీపింగ్ మిషన్‌లతో సిఆర్ఎంపి పథకా న్ని తిరిగి రూపొందించారు. ఐదేళ్లపాటు స్వీ పింగ్ మిషన్‌ల కోసం రూ.317 కోట్లు అదనంగా చేర్చారు. తాజాగా సవరించిన ప్రతిపాదనలు మళ్లీ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు.

**తెల్ల ఏనుగుల్లా స్వీపింగ్ మిషన్‌లు..**

స్వీపింగ్ మిషన్‌లతో పారిశుద్ధ్య పనులు సరిగ్గా జరగడం లేదని ఇటీవల అధికారులు వాటిని తొలగించారు. స్వీపింగ్ మిషన్‌ల ద్వారా పారిశుద్ధ్య పనులు జరగపోవడంతో పాటు వాటి ఏర్పాటుకు భారీ మొత్తంలో వ్యయం అవుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పర్చడంతో పాటు భారీ వ్యయం అయ్యే స్వీపింగ్ మిషన్‌ల ఏర్పాటును తొలగించడంతో జిహెచ్ఎంసికి ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అధికారులు భావించారు. తీరా స్థాయీసంఘం సభ్యులు స్వీపింగ్ మిషన్‌ల ఏర్పాటుపై పట్టు బట్టడంతో చేసేదిలేక అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**గుంతలమయంగా రహదారులు..**
**వాహనదారులు నరకయాతన..**

ఇప్పటికే వర్షాలకు నగర రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గుంతల మాంగా రహదారులు మారాయి. పాడైన రోడ్లపై ప్రయాణం చేస్తూ ఇలా నిత్యం వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం త్వరగా ఆమోదం తెలపకపోతే రాను న్న రోజులలో రహదారుల పరిస్థితి మరింత దారుణంగా మారే పరిస్థితులు నెలకొననున్నాయి.

## కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

దోసకాయల వెంకటేష్‌ను సన్మానించిన తోటకూర వజ్రేష్‌యాదవ్




**ప్రజాపక్షం/శామీర్‌పేట** : మూడు చింతలపల్లిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన ఉద్దెమర్రి మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం అమలుపరుస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు చేరే విధంగా మున్సిపల్ అధ్యక్షుడు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్‌లు నూతన అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, శామీర్‌పేట మండల ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు, వర్కింగ్ ప్రసిడెంట్ బండి జగన్నాదం, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు తుంకి వెంకటేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ శ్రావణ్ కుమార్‌గుప్త, శామీర్‌పేట వర్కింగ్ ప్రసిడెంట్ చాట్లపల్లి నర్సింగరావు, మాజి ఎంపిటిసి, డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి, కొమరంభీమ్ వర్ధంతి

నివాళులు అర్పించిన కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్:** వాల్మీకి జయంతి, కొమరంభీమ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చిత్ర పటాలకి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ మహనీయులను గుర్తించుకోవడం గొప్ప విషయం అన్నారు. మహర్షి వాల్మీకి మన దేశానికి ఆదర్శప్రాయమైన కవి, ఆధ్యాత్మిక గురువుగా నిలిచారు. అయన రామాయణాన్ని రచించి సత్యం, ధర్మం న్యాయం నిష్కామ సేవ వంటి విలువలను సమాజానికి చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, మంగ్లీలాల్, తదితరులు పాల్గొ న్నారు.



**దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం లో**

దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదికవి రామాయణం రచయిత వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కమిషనర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఇ ఇ ఎస్ బాల మురళి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



**మేడ్చల్ మల్కాజిగిరి:** జిల్లా కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనం గా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డిఆర్ఓ హరిప్రియ, జిల్లా వెనుక బడిన తరగతుల శాఖాధికారి ఝాన్సిరాణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పద్మజల సమక్షంలో కలెక్టర్ మనుచౌదరి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


**తాండూరులో** : వాల్మీకి జయంతిని పురష్కరించుకుని మంగళవారం తాండూరు పట్టణ పరిధి వాల్మీకినగర్‌లో దేవాలయ కమిటి ఆధ్వర్యంలో మహర్షి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జయంతి ఉత్సవాలకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, పట్టణ ప్రముఖులు, భక్తులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నారాయణరెడ్డికి సతీ వియోగం

పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం

అంత్య క్రియలకు హాజరైన స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్, తాండూరు మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డి సతీమణి స్వర్గస్తులైనారు. పెద్దేముల్ మండల పరిధి గాజీపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మాజీ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డికి సతీమణి మణెమ్మ మృతి చెందిన విషయం తెలుసు కున్న ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి మంగళ వారం గాజీపూర్ గ్రామానికి చేరుకుని మాణె మ్మ పార్థివ దేహానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ చైర్మన్ నారాయణరెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాణెమ్మ మృతి పట్ల మహేందర్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాణెమ్మ అంత్యక్రియలు గాజీపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించారు. అంత్యక్రియలకు స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి పాల్గొని మాణెమ్మ పార్థివ దేహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి ప్రచార సమన్వయ కర్త కరణం పురుషోత్తమ్‌రావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయక్, కోట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ అంజయ్య, పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీగౌడ్, స్థానిక నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, లక్ష్మ ణ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులను పాఠశాలలోకి రానివ్వని ప్రిన్సిపల్

4 గంటల పాటు గేటు దగ్గరే వందల మంది పడిగాపులు



**ప్రజాపక్షం/కొడంగల్:** దసరా సెలవులు ముగించుకుని తిరిగి పాఠశాలలకు చేరుకున్న విద్యార్థులకు ఆ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లీదండ్రులను దాదాపు 4 గంటల పాటు మండుటెండలో నిలుచోబెట్టిన ఘటన కొడంగల్ లో చోటుచేసుకుంది. కొడంగల్ పట్టణ శివారులోని దౌల్తాబాద్ బిసి గురుకుల పాఠశాలలోకి విద్యార్థులను అనుమతించకపోవడంతో విద్యార్థులు గేటు ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థి తల్లీదండ్రుల కథనం మేరకు ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా విద్యార్థులకు దాదాపు 13 రోజుల పాటు సెలవులను ఇవ్వడం జరిగింది. శనివారం సెలవులు పూర్తి కావడంతో పాఠశాలలు పునఃప్రారంబం అయ్యాయి. సోమవారం విద్యార్థులంత పాఠశాలలకు చేరుకోవాలి. కాని దూర ప్రాంతాల నుంచి వేచ్చే వారు కావడంతో ఒక్క రోజు ఆలస్యం అయిందనే కోణంలో ప్రిన్సిపల్ విద్యార్థుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంగళవారం ఆయా దూర ప్రాంతాల నుంచి ఉదయం 8 గంటల వరకే పాఠశాలకు చేరుకోవడం జరిగిందన్నారు. కాని ప్రిన్సిపల్ శ్రీనివాస్ మేము ఫోన్ చేసి విద్యార్థులను రమ్మని పిలిచిన రావడం లేదనే కోపంతో పై అధికారులను అడ్డంపెట్టి దాదాపు 4 గంటల పాటు మండుటెండలో నిలుచోబెట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ తోటి గెస్ట్ ఫ్యాకల్టీలపై అదనపు పనిభారం పెట్టి వేదింపులకు గురి చేస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి.

టీచింగ్‌తో పాటు కంప్యూటర్, ఇతరాత్ర పనులు, రాత్రి పనులు, విద్యార్థులకు సంబందించిన బాగోగులు ఇలా ప్రతి ఒక్కటి ఉపాధ్యాయులపై మోపుతున్నారని ఆరోపణాలు వస్తున్నాయి. పని చేస్తారా లేదంటే టర్మినెంట్ చేస్తా అంటు బెదిరింపులకు గురి చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం . ఇలాంటి ప్రిన్సిపల్‌పై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



## బాబోయ్...తరగతి గదుల్లో వర్షం!

కలెక్టర్‌కు మొరపెట్టుకున్న సిబ్బంది

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రభుత్వం ఇటీవల చేపట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో(ఏటిసి) పూర్తిస్థాయిలో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆల్వాల్‌లోని ఐటిఐ సంస్థలో ఏర్పాటు చేసిన ఏటిసి సెంటర్‌ను పరిశీలించారు. శిక్షణార్థులకు అవసరమైన మౌలిక వసతులతో యంత్ర సామగ్రి, ఎసిలు, కంప్యూటర్లు ఏర్పాటు చేసి అన్ని ట్రేడ్‌లలో ప్రమాణాలతో కూడిన శిక్షణ అందించాలన్నారు. సంస్థలో ఏమైనా సమస్యలున్నాయా అని ప్రశ్నించగా తరగతి గదులతో పాటు వర్క్ షాప్ హాలులో వర్షంవస్తే లోపల నీరు చేరుతోందని, రూఫ్ లీకేజి సమస్య దీనికి కారణమని, పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉందని అక్కడి సిబ్బంది తెలియచేయగా త్వరలో దీనికి పరిష్కారం చేస్తానన్నారు. సంస్థలోఎంతమంది శిక్షణార్థులు ఉన్నారు, తగిన సంఖ్యలో సిబ్బంది ఉన్నారా లేరా అని అడుగుతూ ప్రాక్టికల్ తరగతులు జరుగుతున్నాయా లేదా అని శిక్షణార్థులను అడిగారు. డిఓ శేఖరరెడ్డి, సూపరింటెండెంట్ శైలజ, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## విజయలక్ష్మి విల్లాస్‌లో మళ్లీ అక్రమ నిర్మాణాలు

**ప్రజాపక్షం/దుండిగల్** : దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని మల్లంపేట్ సర్వే నెంబర్ 170/3,4 మల్లంపేట జిఎల్ఎస్ లక్ష్మి శ్రీనివాస కన్స్ట్రక్షన్ లో మళ్ళీ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి ఎఫ్టిఎల్ బఫర్ జోన్ లో నిర్మాణాలు చేయడంపై దుండిగల్ మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వోకు ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు అనంతరం మాట్లాడుతూ సందర్భంగా



ఆకుల సతీష్ మాట్లాడుతూ, అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో కత్వ చెరువు ఎఫ్‌టిఎల్ /బఫర్ జోన్లో విల్లాస్ నిర్మాణాలు చేయడమే కాకుండా, అమాయకులైన ప్రజలకు అమ్ముకోవడం విల్లాస్ వారు కొనడం తర్వాత చెరువు ఎఫ్ ఎల్ బఫర్ జోన్ లో విల్లాల కూల్చివేతలు చేయడం జరుగుతుందని అంతేకాకుండా ప్రభుత్వ భూమి మరియు చెరువు ఎఫ్‌టిఎల్ /బఫర్ జోన్లో అక్రమ నిర్మాణాలు చేసిన లక్ష్మి శ్రీనివాస కన్స్ట్రక్షన్ యజమాని విజయలక్ష్మి పై ఇటీవలే పోలీస్ కేసు నమోదు చేయడం కూడా జరిగిందని అన్నారు కానీ నేడు శ్రీ వినాయక రియాల్టర్స్ మరియు డెవలపర్స్ పేరుతో అనుమతులు పొంది నిర్మాణం ఏ విధంగా చేస్తున్నారో మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుందనీ, సర్వే నెంబర్ 170/3 మరియు సర్వే నెంబర్ 170/4లో ప్రభుత్వ భూమి అని, గతంలో ఇదేవిధంగా సరైన అనుమతులు ఉండకుండా ప్రభుత్వ భూమి చెరువులో నిర్మాణాలు మరియు కొనుగోలు చేసిన ప్రజలు పడిన ఇబ్బందులు చూసిన మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఒకే ఒక తప్పుడు అనుమతితో ఆరు విల్లాల నిర్మాణం జరుగుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనీ అన్నారు. కావున తక్షణమే నిర్మాణాలు చేస్తున్న శ్రీ వినాయక రియాల్టర్స్ మరియు డెవలపర్స్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయడమే కాకుండా, ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని శ్రీ వినాయక రియాల్టర్స్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చందు, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అధ్యక్షుడిగా తుంకి రమేష్

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా మజీద్‌పూర్ గ్రామానికి చెందిన తుంకి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసిసి అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ అలియాబాద్ అధ్యక్షుడు తుంకి రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తుంకి రమేష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో కాంగ్రెస్ అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించిన డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తాన ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటి డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు నేమూరి విష్ణుగౌడ్, రాంరెడ్డి, నర్మద, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** చిన్నారులకు పోషణతో కూడిన ఆహారం అందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటమ్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఫరూక్‌నగర్‌లో ఉన్న 13వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ మాట్లాడుతూ చిన్నారులకు బయటి తినుబండారాలను తినిపించకుండా ఇంట్లో తయారు చేసిన పోషక ఆహారం ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారం ఇస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, మహిళలు కె.వసంత, డి.శోభారాణి, నుశ్రత్ భేగం, సి.కవిత, రేణుకాదేవి పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములు కాపాడండి

తహసీల్దార్‌కు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/షాబాద్:** ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చేవెళ్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభులింగం మాట్లాడుతూ చేవెళ్ల మండల పరిధిలోని న్యాలట రెవిన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 240లో ఉన్న ప్రభుత్వ భూమిని రియల్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, కబ్జాదారులు కబ్జాలు చేసి యదేచ్ఛగా క్రయ విక్రయాలు కొనసాగిస్తున్నారని వివరించారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించడంతోపాటు గతంలో కేటాయించిన లబ్దిదారులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శి పాపయ్య, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎం.సుధాకర్ గౌడ్, ఏఐటియుసి మండల అధ్యక్షుడు శివ, శాఖ కార్యకర్తలు కిష్టయ్య, అంజయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ కుటుంబసభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీ చెందిన యువకుడు పోలే చంద్రశేఖర్ అమెరికా డల్లాస్ నగరంలోని టెక్సాస్‌లో గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో మృతి చెందడం బాధాకరమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టీచర్స్ కాలనీలో చంద్రశేఖర్ చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పమర్శించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ పన్యాల జయపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, వినయ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## కోదండరాంనగర్ కాలనీ పోచమ్మ దేవాలయ చైర్మన్‌గా ఆంజనేయులు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్ కాలనీ పోచమ్మ దేవాలయ అభివృద్ధికి పాటుపడుతానని నూతన చైర్మన్ చిగుర్ల ఆంజనేయులు తెలిపారు. మంగళవారం డివిజన్ కార్పోరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డిని నూతన కమిటీ సభ్యులందరూ మర్యాధపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. వైస్‌చైర్మన్ వట్టె రాజు, ప్రధాన కార్యదర్శి బొప్పెనపల్లి యాదగిరి, కోశాధికారి మేకల రాజు, సంయుక్త కార్యధర్శి చెంచు రాజులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎల్లయ్య, కర్నాల విజయ్, పెద్ది తిరుపతి, కుకట్ల బీరప్ప, యాద శంకర్, కర్నాల రాజయ్య, సంపత్ పాల్గొన్నారు.

## డిఎస్‌పిగా ఎంపికైన శాంతన్‌కుమార్‌రెడ్డిని అభినందించిన చిలుక బ్రదర్స్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 1 ఫలితాల్లో డిఎస్‌పిగా ఎంపికైన బుసిరెడ్డి శాంతన్‌కుమార్‌ని తెలంగాణ మార్కెట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి, సంఘసేవకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అభినందించారు. ఆర్‌కెపురం డివిజన్ వాసవీకాలనీకి చెందిన శాంతన్‌కుమార్ డీఎస్పీగా ఉద్యోగం పొందిన సందర్భంగా ఆయనను చిలుక బ్రదర్స్ శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా చిలుక బ్రదర్స్ మాట్లాడుతూ రాజచకొండ కమీషనరేట్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపిగా విధులు నిర్వహిస్తున్న బుసిరెడ్డి రవీందర్‌రెడ్డి కుమారుడు శాంతన్‌కుమార్‌రెడ్డి డీఎస్పీగా ఎంపిక కావడం హర్షనీయమన్నారు. శాంతన్‌కుమార్‌రెడ్డి విజయం కేవలం వ్యక్తిగత విజయమే కాదని, పేద, మధ్యతరగతి యువతకు స్పూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో తోడుపునూరి సతీష్, పెద్దవూర సైదులు, లింగాస్వామిగౌడ్, జగిని రమేష్, బచ్చు ప్రభాకర్, మామిడి రామకృష్ణగౌడ్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## దోబీఘాట్‌లో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఎంపికి వినతి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** నాగోల్ దోబీఘాట్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని రజక సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను శామిర్‌పేటలోని తన నివాసంలో రజక సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగోల్ దోబీఘాట్‌లో పెండింగ్‌లో ప్రహరీగోడ, కమ్యూనిటీహాల్, దోబీఖానాలు వంటి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించినట్లు వివరించారు. దీనిపై వెంటనే స్పందించి ఎంపి ఈటెల రాజేందర్ అధికారులతో చర్చించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బి.చుకయ్య, బి.కృష్ణ, బి.మధు, బి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ వికాసానికి చరిత్ర అందించిన వాల్మీకి

జయంతి వేడుకల్లో శివసేనారెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ సాహిత్యంలో ఆదికావ్యం శ్రీమద్రామాయణం రచించి మానవ వికాసానికి చరిత్రను అందించిన పరిపూర్ణ బ్రహ్మర్షి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్‌బి స్టేడియంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ పుట్టుకతో ఎవరు మహనీయులు కారని, మనం అనుసరించే మార్గం ద్వారా ఉత్తమ స్థాయికి చేరుకోగలమని వాల్మీకి జీవిత చరిత్ర నిరూపించిందన్నారు. 24 వేల సంస్కృత శ్లోకాలతో నాలుగు లక్షల 82 వేల పదాలతో రచించబడిన మహాకావ్యం రామాయణంలో మాతృధర్మం, రాజధర్మం, పుత్ర ధర్మం, మిత్ర ధర్మం, పతివ్రత ధర్మాలతో పాటు ప్రేమలు, బంధాలు, శరణాగతవత్సల, యుద్దనీతి, రాజనీతి,ప్రజాభ్యుదయము సత్‌వాక్య పరిపాలన ఉపాసన రహస్యాలు సంభాషణ చతురత జీవిత విలువలు అనేక రకాల ఉపదేశాలు ఉన్నాయని ఇంత విలువైన సత్యాలను చెప్పే మహత్తర కావ్యాన్ని ప్రపంచానికి అందించిన కవి వాల్మీకి మహర్షికి ప్రతి ఒక్కరు చేతులెత్తి నమస్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, అసిస్టెంట్ డైరెక్టర్లు కేఆర్‌బట్లర్, కళ్యాణి, పిఆర్‌ఓ కాలేరు సురేష్, కోచ్‌లు సిబ్బంది నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

**డిజిపి కార్యాలయంలో...** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి జయంతి కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం మహర్షి వాల్మీకి ఆలోచనలు, ఆత్మనిబ్బరత, సత్యం మరియు ధర్మానికి ఆయన చేసిన సేవలను స్మరించారు. కార్యక్రమంలో శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిజిపి కార్యాలయ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డా.మొరంగపల్లి శ్రీనాథ్‌కు 'గిన్నిస్'లో చోటు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఆటిజం చికిత్సపై తాంతీయా యూనివర్సిటీలో ప్రత్యేక పరిశోధన (పిహెచ్‌డి) చేసి గత 15ఏళ్లుగా పిల్లలకు థెరపీలతో పాటు హోమియోపతి మందుల ద్వారా అనేక కేసులను సమస్యలను పరిష్కరించిన డా.మొరంగపల్లి శ్రీనాథ్‌కుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకొన్నారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌కుమార్ మాట్లాడుతూ ఆటిజం అరుదైన సమస్య అయినప్పటికీ ఇటీవలకాలంలో ఎక్కువ కేసులు భారత్‌లోనే వస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యతో పిల్లల్లో మూర్ఛ, నిరాశ, ఆందోళన, హైపర్‌యాక్టివ్ డిజార్డర్‌కు దారితీస్తుందన్నారు. అలో ఆటిజం ఉన్నట్టు నిర్ధారణ అయితే ప్రత్యేక ముందస్తు నివారణ, మందులతోపాటు రోబోటిక్ పిల్స్ ద్వారా వారిలో సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచవచ్చునని ఆయన పేర్కొన్నారు.

## 'కృత్రిమ మేధస్సు పాత్రపై అవగాహన తప్పనిసరి'



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కృత్రిమ మేధస్సు పాత్రపై ఔత్సాహిక విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ ''ఆర్కిటెక్చర్ డే '' సందర్భంగా ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో ''ఆర్కిటెక్చర్ రంగంపై కృత్రిమ మేధ ప్రభావం'' అనే అంశంపై జాతీయ సదస్సు హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. తొలుత ఇక్ఫాయ్ వర్సిటీ రిజిస్ట్రార్ డా.విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు శిరీష్ బేరి, డా.మాసిమో వినియోనిల్లా, సాహిల్ తన్వీర్(దార్వాడ), సుబీన్ జమీల్ (అహ్మదాబాద్), సురభీకుమార్ (రాంచీ), మానీష్ సిరిపురపు (ఢిల్లీ) ప్రసంగించారు. అనంతరం ఇక్ఫాయ్ వ్యవస్థాపకులు ఎన్.జె.యశస్వి జీవిత విశేషాలపై ప్రచురించిన '' ఫస్ట్ ఫర్ ఎవర్'' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సులో ఇక్ఫాయ్ సొసైటీ చైర్‌పర్సన్ శోభారాణి యశస్వి, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ సలహాదారు వెంకట్ పీసపాటి, ప్రిన్సిపల్ డా.మహేంద్ర సోనవాని, కన్వీనర్ డా.అనిల్ కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## భారీగా గంజాయి, మద్యం, నల్లబెల్లం పట్టివేత





**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని ఎస్‌టిఎఫ్‌ఏ టీం లీడర్ అంజిరెడ్డి సమాచారం మేరకు ఎస్టిఎఫ్‌ఏ టీం లీడర్ సిబ్బంది దాడులు నిర్వహించారు. తనిఖీల్లో 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు టు వీలర్ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని హట్ గోడ సంజయ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో సంజయ్‌తో పాటు శేఖర్‌బాబు, కామ్రే బాబు, గంగోలి బహు అనే ముగ్గురుపై కేసు నమోదు చేశారు. వీరు పరార్‌లో ఉన్నట్లు అంజిరెడ్డి తెలిపారు. నిందితుడిని గంజాయిని నాంపల్లి ఎక్సైజ్‌స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు.

**ఢిల్లీ నుంచి వచ్చే రైల్లో మద్యం పట్టివేత..** ఢిల్లీనుంచిహైదరాబాద్‌కు వచ్చే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైల్లో సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సౌజన్య సిబ్బంది కలిసి నిర్వహించిన తనిఖీల్లో 44 మద్యం బాటిల్లు పట్టుబడ్డాయి. ఈ మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

**నల్ల బెల్లం పట్టివేత..** హైదరాబాద్ హైదరాబాదు ఎంజీబీఎస్ బస్‌స్టేషన్ నుంచి నాగర్ కర్నూల్‌కు బస్సులో తీసుకెళ్తున్న నల్లబెల్లాన్ని ఎస్టిఎఫ్‌బీ టీం సిఐ భిక్షరెడ్డి, ఎస్ఐ బాలరాజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. బెల్లాన్ని తీసుక వెళుతున్న ఎల్లమ్మ అనే మహిళను అరెస్ట్ చేశారు. 120 కేజీల బెల్లం, 30 కేజీల ఆల్లం స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. నాగర్ కర్నూల్ కు హైదరాబాదు నుంచి బయలుదేరినటువంటి బొలెరో వాహనాన్ని బిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. బొల్లేరా వాహనంలో 900కేజీల బెల్లాన్ని, 20 కేజీల ఆలమును, వాహనాన్ని నాగర్ కర్నూల్ డిటిఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. బొలెరో వాహనంతో పాటు బిజినేపల్లి భాస్కర్ రెడ్డి, డ్రైవర్ రాంబాబును అరెస్ట్ చేశారు.

**శేరిలింగంపల్లి :** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 45 కిలోల గంజాయి పట్టుకుని ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైజాగ్ నుండి ముంబాయికి వెళుతున్న రైల్లో వెంకట్ (35), ఇద్దరు మహిళలు బుల్కి (31), దివ్యరాణి (21) 45కిలోల గంజాయితో ఉన్నారన్న సమాచారంతో లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

**ప్రజాపక్షం /గండిపేట:** ఘనంగా ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ బి.శరత్‌చంద్ర, నార్సింగ్ మున్సిపాలిటీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సాహిత్యంలో ఆదికావ్యం శ్రీమద్రామాయణం రచించి మానవ వికాసానికి చరిత్రను అందించిన పరిపూర్ణ బ్రహ్మర్షి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమన్నారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి భారతీయ సంస్కృతికి గొప్ప గ్రంధాన్ని అందించారన్నారు. పరివర్తన రామాయణం రచించడంతో ఆయనను గొప్ప కవిగా గౌరవిస్తారన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎఎంసి డి.చంద్రశేఖర్ రెడ్డి , కృష్ణమోహన్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ లో ట్రైనింగ్ మున్సిపల్ కమిషనర్లు నాగేంద్రబాబు, డి ఈ నరేష్ ,మేనేజర్ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, జేఏఓ కృష్ణయ్య, లచ్చిరాం, సెక్షన్ల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఇన్‌చార్జ్ కమిషనర్ శరత్ చంద్ర



**ప్రజాపక్షం/శంషాబాద్:** విధుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చూపరాదని శంషాబాద్ పురపాలక సంఘం ఇన్చార్జి కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. మంగళవారం శంషాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో అన్ని విభాగాల అధికారులతో ఇన్చార్జి కమిషనర్ శరత్ చంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల పరిస్థితులు, పనుల పురోగతి, ప్రజా సేవల అమలుపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యాపార అనుమతుల జారీ, జనన, మరణ ధృవపత్రాల జారీ, భూముల నియమిత పద్ధతిలో నమోదు, భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై చర్యలు, ప్రకటనల నియంత్రణ, పన్నుల వసూళ్లు, కోర్టు వ్యవహారాలు,కొత్త సంఘాల ఏర్పాటు, లక్ష్యాల సాధన వంటి అంశాలను సమీక్షించారు.

## నాణ్యమైన వైద్యసేవలతోనే ప్రజల మన్ననలు

రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ లలితాదేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కె.లలితాదేవి అన్నారు. మంగళవారం సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ కె లలితాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిఎంహెచ్ఓ డాక్టర్ కె.లలితాదేవి సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. డెలివరీ అయిన మహిళలను ప్రత్యక్షంగా కలిసి చికిత్స, వసతుల గూర్చి అడిగారు. ఈ చికిత్స వివరాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆరోగ్య కేంద్రంలో ఉండే అన్ని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి నిర్వహణ పద్ధతులు రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. విధులలో ఉన్న వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగుల హాజరు మరియు విధినిర్వహన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మంచి నాణ్యమైన వైద్య సేవలు అందించి మన్ననలు పొందాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల స్టోర్ సందర్శించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయో లేదో గమనించారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సందర్భంగా ఉద్యోగులను హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారిని డాక్టర్ గీత, స్థానిక వైద్యులు డాక్టర్ అర్చన, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే నని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న కలమ్మ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడిని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, అదే తరహాలో బిల్లులు సైతం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు గౌడ్, నరేందర్ గౌడ్, వేణు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలే మొదటి ప్రాధాన్యత

జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్‌లోని ఇందిరానగర్ లో డ్రైయినేజీ వ్యవస్థ బ్లాక్, వర్షం పడితే రోడ్డు పై నీరునిలిచి రాకపోకలకు ఇబ్బందులు, పవర్ బోర్, హ్యాండ్‌పంప్‌లు పనిచేయకపోవడం వంటి సమస్యలపై స్థానిక ప్రజల ఫిర్యాదుల నేపథ్యంలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రేమ్ కుమార్‌తో కలిసి సమస్యలను విశ్లేషించి, తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ,నీటి సమస్యలను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, ధన్ పాల్ గౌడ్,సివరేజ్ సూపర్వైజర్ సక్రు నాయక్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌బి నగర్ డిసిపి అనురాధను కలిసిన కాంగ్రెస్ నాయకులు శశిధర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఇటీవల ఎల్‌బి నగర్ డిసిపిగా పదవి బాధ్యతలు చేపట్టిన అనురాధను మంగళవారం హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్‌రెడ్డి వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బొకే అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిసిపి అనురాధ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. లోన్ యాప్ పేరుతో మోసాలు జరుగుతన్నాయని, యాప్‌లను ఓపెన్ చేయరాదని ఆమె పేర్కొన్నారు. శాంతి భద్రతలకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమె కోరారు.

# రీల్



## 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ

నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ పతాకాలపై నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఈ వినోదభరిత చిత్రానికి నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎమ్, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వెండితెరపై నవ్వుల టపాసులు పేల్చడానికి, దీపావళి కానుకగా అక్టోబర్ 16న 'మిత్ర మండలి' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు.



## 'సీతా పయనం'లో యాక్షన్ లుక్ రిలీజ్

మల్టీ ట్యాలెంటెడ్ అర్జున్ సర్జా దర్శకత్వం వహిస్తున్న తాజా సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య అర్జున్, నిరంజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అర్జున్, ధ్రువ సర్జా పవర్ ఫుల్ పవర్ ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు. ధ్రువ సర్జాకు సంబంధించిన యాక్షన్ భరితమైన ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి.




## 'కానిస్టేబుల్' ప్రీ రిలీజ్ వేడుక

'నా కెరీర్‌లో అక్టోబర్ నెలను మరచిపోలేను. ఎందుకంటే దాదాపు పద్దెనిమిది ఏళ్ల క్రితం నేను నటించిన తొలి చిత్రం 'హ్యాపీడేస్' 2007లో ఇదే నెలలో విడుదలై, ఘన విజయం సాధించి, నా కెరీర్ నే మలుపు తిప్పింది. అందుకే నా జీవితంలో అక్టోబర్ మాసం గుర్తుండి పోయింది. ఇప్పుడు ఈ చిత్రం కూడా ఇదే నెలలో విడుదలవుతుండటంతో ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయి' అని హీరో వరుణ్ సందేశ్ అన్నారు. వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు.

## 'బ్యాడ్ బాయ్'గా నాగ శౌర్య

హీరో నాగ శౌర్య తాజాగా నటిస్తున్న సినిమా 'బ్యాడ్ బాయ్'. కార్తీక్ అనే పవర్ ఫుల్ పాత్రలో యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. నూతన దర్శకుడు రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవి ఫిలిమ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. టీజర్‌లో నాగ శౌర్యను రగ్గడ, ఇంటెన్స్ స్టైలిష్ న్యూ అవతార్‌లో కనిపించరు. యాక్షన్ సన్నివేశాలు, మూమెంట్స్‌తో మాస్ పాత్రలో నటిస్తున్నాడు.







యాంకర్ సుమ, నటుడు రాజీవ్ కనకాల దంపతుల కుమారుడు హీరో రోషన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'ఛాంపియన్.' ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఛాంపియన్ ఫస్ట్ లుక్, ఆసక్తికరమైన టీజర్ గ్లింప్స్ విడుదల చేశారు. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. చాంపియన్ డిసెంబర్ 25న, క్రిస్మస్ సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.

## 25 మిలియన్ వ్యూస్ దాటిన 'నువ్వుంటే చాలే' పాట

రామ్ పోతినేని హీరోగా నటిస్తుబుతాజా చిత్రం




ఆంధ్రా కింగ్ తాలూక. మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల విడుదలైన 'నువ్వుంటే చాలే' సాంగ్ రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఈ సాంగ్ 25 మిలియన్ + వ్యూస్ క్రాస్ చేసి ఆల్‌టైమ్ ఫేవరెట్‌గా ఆడియన్స్ మన సుల్ని గెలుచుకుంది.



## ఆ పాత్ర చాలా పవర్ ఫుల్ -రవితేజ

'మాస్ మహారాజా' సినిమాలో తాను పోషించిన ఆర్‌పిఎఫ్(రైల్వే పోలీస్ ఫోర్స్) అధికారి పాత్ర పవర్ ఫుల్‌గా ఉంటుందని హీరో రవితేజ అన్నారు. ఈ పాత్ర గురించి ఆయన మాట్లాడుతూ, ఇది తన సినీ ప్రయాణంలో సరికొత్త, ప్రత్యేకమైన పాత్ర అని అభివర్ణించారు. అలాగే చిత్ర దర్శకుడు భాను భోగవరపు, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియోపై ప్రశంసలు కురిపించారు. భాను ప్రతిభావంతుడని, చిత్రీకరణ సమయంలో కూడా సన్నివేశాన్ని ఇంకా మెరుగ్గా మలచడానికి ప్రయత్నిస్తుంటాడని, చాలా వేగంగా మార్పులు చేయగలడని కొనియాడారు. భీమ్స్ ఎంతో కృషి చేసి, ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించాడని అన్నారు. ఇక మాస్ జాతర సినిమా గురించి మాట్లాడుతూ.. వినోదం, మాస్ అంశాలతో పాటు హృదయపూర్వక కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుందని తెలిపారు.'మాస్ జతర'. రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హాస్యం, భావోద్వేగాలు మరియు మాస్ అంశాలతో నిండిన వినోదభరితమైన కుటుంబ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న 'మాస్ జతర' సినిమా, భారీ అంచనాల నడుమ అక్టోబర్ 31న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలకు విశేష స్పందన లభించింది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఈ క్రమంలోనే తాజాగా సుమతో కలిసి ఒక ఉల్లాసమైన మరియు వినోదాత్మక సంభాషణలో చిత్ర బృందం పాల్గొంది. 'మాస్ జతర' సినిమా ఎంత ప్రత్యేకమైనదో తెలిపేలా వీరి సంభాషణ సాగింది. రవితేజ గారితో కలిసి నటించడం చాలా ఆనందకరమైన అనుభవమని శ్రీలీల అన్నారు. అత్యంత ఆహ్లాదకరమైన సహనటులలో ఆయన ఒకరని శ్రీలీల తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. మాస్ జాతరలో తాను సైన్స్ టీచర్‌గా, శ్రీకాకుళం యాసలో మాట్లాడే ఉల్లాసభరితమైన పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తానని ఆమె వెల్లడించారు. తన మునుపటి పాత్రలకు పూర్తి భిన్నంగా ఇది ఉంటుంది. స్క్రిప్ట్ చదివినప్పుడే తాను నవ్వుకున్నానని, ఇక సెట్‌లో దానిని ప్రదర్శించే సమయంలో ఆ నవ్వులు రెట్టింపు అయ్యాయని శ్రీలీల పేర్కొన్నారు. రవితేజ అంకితభావం గురించి మాట్లాడుతూ.. గాయంతో బాధపడుతున్నప్పటికీ, ఆయన ఆసుపత్రికి వెళ్లే ముందు 'తూ మేరా లవర్' పాటను పూర్తి చేసి, తన నిబద్ధతను చాటుకున్నారని శ్రీలీల కొనియాడారు. 'మాస్ జాతర' ప్రేక్షకులను అలరించడానికి ఈనెల 31న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతోంది.



## విజయ్ దేవరకొండకు కారు ప్రమాదం

తెలుగు సినిమా నటుడు విజయ్ దేవరకొండకు ప్రమాదం తప్పింది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి సమీపంలో విజయ్ దేవరకొండ ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. తన స్నేహితులతో కలిసి పుట్టపర్తికి వెళ్లి వస్తుండగా ఘటన జరిగింది. ప్రమాదం నుంచి సురక్షితంగా విజయ్ బయట పడ్డారు. విజయ్ కారు స్వల్పంగా ధ్వంసమైంది. దీంతో స్నేహితుడి కారులో విజయ్ అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. విజయ్ కారును మరో వాహనం బొలేరో ఢీ కొన్నట్టు విజయ్ తరఫు వ్యక్తి ఒకరు తెలిపారు.

## ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్ ట్రైలర్ విడుదల




20th సెంచరీ స్టూడియోస్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్‌అడ్వెంచర్ చిత్రం ప్రెడేటర్: బ్యాడ్ ల్యాండ్స్ ఫైనల్ ట్రైలర్‌ను అధికారికంగా విడుదల చేసింది. డైరెక్టర్ డాన్ ట్రాచ్టెన్‌బర్గ్ ఈ ఐకానిక్ ఫ్రాంచైజీకి కొత్త బోల్డ్ విజన్‌ను అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఎక్స్‌ప్లోసివ్ సెట్ పీసెస్, అనూహ్యమైన అలయన్సెస్, ప్రెడేటర్ వర్సెస్ ప్రెడేటర్ బ్యాటిల్స్ లాంటివి ప్రేక్షకులు ఇంతకు ముందు చూడని విధంగా టీజ్ చేస్తున్నాయి.

# ముందుకెళదాం

(మొదటి పేజీ తరువాయి)

ఆశిస్తున్నామని చెప్పారు. డి.రాజా మంగళవారం బిహార్‌లో పర్యటించారు. ఇండియా భాగస్వామిగానే కాకుండా బిహార్‌లో ప్రతిపక్ష మహాకూటమిలో సిపిఐ ఉన్న నేపథ్యంలో బిహార్‌లో సీట్ల సర్దుబాటుపై చర్చలు ప్రారంభమయ్యాయి. వీటిలో పాల్గొనేందుకు రాజా పట్నా చేరుకున్నారు. ఇదే క్రమంలో విలేకరుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఓ ఛానల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. సీట్ల సర్దుబాటుపై చర్చలు త్వరలోనే కొలిక్కివస్తాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. సముచిత స్థానాల్లో పోటీ చేసేందుకుగాను పెద్ద పార్టీల మద్దతు కోరుతున్నట్లు తెలిపారు. 'ఎన్నికల సంఘం బిహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించింది. ఎస్ఐఆర్‌పై అనేక ప్రశ్నలు వచ్చాయి. సుప్రీంకోర్టు జోక్యం తర్వాతే ఆధార్, ఇతర పత్రాలను ఇసి అనుమతించింది' అని రాజా అన్నారు. ఎన్నికల సంఘం తన విశ్వసనీయతను పునరుద్ధరించుకోవాలని, బిహార్ అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా ఇసి హామీనివ్వాలన్నారు. బిహార్ అసెంబ్లీలో 243 స్థానాలు ఉండగా, 24 చోట్ల పోటీ చేస్తామని సిపిఐ ఇప్పటికే వెల్లడించింది. 2020లో ఆరు స్థానాల్లో పోటీ చేసిన సిపిఐ రెండు సీట్లు గెలుచుకుంది. ఈసారి మంచి ప్రదర్శన ఇవ్వగలమన్న దీమాతో ఉంది. ఇదే క్రమంలో డి.రాజా మాట్లాడుతూ పెద్ద పార్టీలకు పట్టువిడుపు అవసరమని, చిన్న పార్టీలకు సముచిత స్థానాలు కేటాయించాలన్నారు. ఈసారి ఎన్నికల ప్రచారాన్ని సిపిఐ పెద్దఎత్తున నిర్వహిస్తుందని చెప్పారు. ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్‌తో ముఖాముఖి భేటీలో కీలక అంశాలపై చర్చించి సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు. ప్రతిపక్ష కూటమి తరపున సిఎం అభ్యర్థిగా తేజస్వికి మద్దతు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. కమ్యూనిస్టు భావజాలం, సిద్ధాంతాల బలం తగ్గలేదని డి.రాజా నొక్కిచెప్పారు. బిజెపి, ఆర్‌ఎస్ఎస్ దాడులు పెరిగినా పార్లమెంటులో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగినా ప్రస్తుత సామాజిక నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూపగల సామర్థ్యం కమ్యూనిస్టులకు ఉందని



వక్కాణించారు. కులరహిత సమాజ స్థాపన కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. మత తత్వవాదం, ఫాసిస్టు శక్తులపై రాజీలేని పోరాటానికి సిపిఐ కట్టుబడి ఉందని, పార్టీ బలాన్ని పెంచుకుంటూనే ఈ పోరాటాన్ని సాగిస్తామని డి.రాజా అన్నారు. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు అన్ని ఎన్నికల్లోనూ సిపిఐ పోటీ చేస్తుందని చెప్పారు. వామపక్ష ఐక్యతను పెంచడం కోసం ఇతర కమ్యూనిస్టు పార్టీల అగ్ర నాయకులను చండీగఢ్‌లో నిర్వహించిన సిపిఐ జాతీయ మహాసభలకు ఆహ్వానించినట్లు వెల్లడించారు. శతవార్షికోత్సవం సందర్భంగా వామపక్ష పార్టీల పునరేకీకరణ కోసం పిలుపునిచ్చాం... ఆ దిశగా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని డి.రాజా తెలిపారు. బిహార్‌లోనే కాకుండా 2026లో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపైనా సిపిఐ దృష్టిని కేంద్రీకరించిందన్నారు. పశ్చిమ బెంగాల్ వామపక్షాల పునరుద్ధరణే తమ లక్ష్యమన్నారు. తమ పార్టీతో పాటు ఇండియా అభ్యర్థుల తరపున ప్రచారం కోసం బిహార్‌లో సిపిఐ నాయకులు తరచూ పర్యటిస్తారని రాజా చెప్పారు.

## ఐదు రాష్ట్రాలకు కేంద్రం వరద సహాయం

**న్యూఢిల్లీ:** ఐదు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1600 కోట్లు పైగా వరద సహాయం ప్రకటించింది. 2024లో వచ్చిన వరదలు, కొండచరియలు విరిగి పడి జరిగిన నష్టాలకుగాను ఈ మొత్తాన్ని కేటాయించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నాయకత్వానగల ఉన్నతస్థాయి కమిటీ దీనికి ఆమోదం తెలియజేసింది. అసోం,గుజరాత్ రాష్ట్రాలలో గత ఏడాది వరద నష్టాలకు గాను 707.97 కోట్లు అదనపు కేంద్ర సహాయం కేటాయించగా, జాతీయ ప్రకృతి వైపరీత్యాల ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్ఎఫ్)ఖాతా కింద హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు రూ.903.67 కోట్లు కేటాయించారు. ఈ మొత్తాన్ని ఈ రాష్ట్రాలలో అగ్నిమాపకదళ సేవలను ఆధునీకరించి విస్తరించేందుకు ఖర్చుచేస్తారు. కాగా అసోం,గుజరాత్‌లకు కలిపి కేటాయించిన అదనపు సహాయంలో రూ.313.69 కోట్లు అసోం వాటా ఉండగా, రూ.394.28 కోట్లు గుజరాత్‌కు వరదసహాయం కింద వాటా వెళుతుంది. హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లకు కేటాయించిన రూ.903.67 కోట్లలో రూ.676.33 కోట్లు కేంద్రం వాటా ఉంది.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com